ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం
: fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada,Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
16-3-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 44 పేజీలు: 8+16 వెల: 6.50

కోడ్ ముందటి తాయిలాలపై ఏం చేయలేం: సిఇసి

కాన్షీరామ్‌కు భారతరత్న ఇవ్వాలి: రాహుల్ గాంధీ 5లో



ఆదివారం ఇరాన్‌లోని ఇస్ఫహాన్ అణుకేంద్రంపై దాడి జరిగిన దృశ్యం

# మండుతున్న మధ్యప్రాచ్యం

### ఇరాన్ ఇస్ఫహాన్ అణుకేంద్రంపై ఇజ్రాయెల్-యుఎస్ దాడులు

### ఇరాక్‌లోని అతిపెద్ద ఆయిల్‌రిఫైనరీపై ఇరాన్ దాడి

### సౌదీ, యుఎఇ ఎయిర్‌పోర్టుల్లో సేవల నిలిపివేత

**టెహ్రాన్/జెరూసలెం/వాషింగ్టన్, మార్చి 15:** పశ్చిమాసియా దేశాల్లో నెలకొన్న యుద్ధవాతావరణం రానురాను తీవ్రతరం అవుతోంది. దీనికితోడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ సోషల్‌మీడియా వేదికగా చేస్తున్న రెచ్చగొట్టే వ్యాఖ్యలు పరిస్థితిని మరింత తీవ్రతరంచేస్తున్నాయి. ఇదిలా ఉంటే ఆదివారం కూడా ఇజ్రాయెల్, అమెరికా దేశాలు సంయుక్తంగా ఇరాన్‌కు అత్యంత కీలకంగా ఉన్న ఇస్ఫహాన్ అణుస్థావరంపై దాడులుచేసాయి. అలాగే ఇరాన్ కీలక సమాచారంసేకరించేస్పేస్ స్టేషన్‌ను కూడా ధ్వంసంచేసాయి. టెహ్రాన్‌నగరంపైనా రెండుదేశాలు దాడులుచేసాయి. ఇరాన్ అణుస్థావరాన్ని పూర్తిగా ధ్వంసంచేసామని ఇజ్రాయెల్‌ప్రకటించింది. అలాగే ఖర్గ్ ద్వీపంపై సరదాగాకూడా అవసరమైతే మా సైన్యం దాడులుచేస్తుందని చెపుతూ ఇరాన్‌ను ఇప్పటికే పూర్తిగా నిర్వీర్యం చేసామని ట్రంప్ చెపుతూ ఇకపై ఇరాన్‌లో ప్రజాప్రభుత్వమే ఏర్పాటవుతుందని చెప్పారు. ఇప్పటికే ఇరాన్ సుప్రీం కమాండర్ మొజ్తబా ఖమైనీపై 93 కోట్ల రివార్డుప్రకటించిన అమెరికా ఆతడు ఇప్పటికి బతికి ఉన్నా గుర్తుపట్టలేని స్థితిలో గాయపడి ఉన్నాడంటూ అమెరికా చేసిన ప్రకటనలకు మద్దతుగా భారత్ నిఘా వర్గాలు కూడా బతికున్న మాట నిజమే కానీ అచేతనావస్థలో ఉన్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడటం ఇరాన్‌ను మరింత కలవపరపరిచింది. ఈపరిస్థితి ఇలా ఉంటే ఇరాన్ తాజాగా >>2

# మోగిన 'పాంచ్' నగారా

### ఏప్రిల్ 9న కేరళ, అసోం, పుదుచ్చేరి 23న తమిళనాట ఒకే దఫా ఎన్నికలు

### బెంగాల్‌లో రెండు విడతలుగా పోలింగ్

### 8 అసెంబ్లీ ఉప ఎన్నికలు కూడా 23నే, మే4న ఓట్ల లెక్కింపు

**న్యూఢిల్లీ, మార్చి 15:** దేశంలో మరో ఎన్నికల సంగ్రామం మొదలైంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అసోం, కేరళ రాష్ట్రాలతోపాటు కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. వీటితోపాటు ఆరు రాష్ట్రాల్లో 8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల >>2



ఆదివారం మీడియాతో సిఇసి జ్ఞానేశ్ కుమార్

# నేటి నుంచి బడ్జెట్ అసెంబ్లీ

### ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ శుక్లా ప్రసంగం

### గవర్నర్ తెలుగులోనే ప్రసంగించే అవకాశం

### మూసీ ప్రాజెక్టు, సైనీకోల్ బ్లాక్స్‌పై పోరుకు విపక్షాలు రెడీ

### డి.స్పీకర్ ఎన్నిక ఈసారి కూడా లేనట్లేనా?

### తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరించనున్న గవర్నర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి15:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాలు ఉదయం 11.45 గంటలకు ప్రారంభం కానున్నాయి. ఈ సారి అసెంబ్లీకి కొత్త గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తొలిసారి రావడం విశేషం. గవర్నర్ ప్రసంగంతో ఉభయ సభలు ప్రారంభంకానున్నాయి. ఆయన తెలుగులో ప్రసంగించేందుకు సన్నద్ధమైనట్లు తెలు స్తోంది. 9నుంచి పదిరోజుల పాటు సమావేశాలను నిర్వహించాలనే యోచనలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉంది. సభ ప్రాంగణంలో సోమవారం తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం గవర్నర్ అసెంబ్లీ నుంచి వెళ్లిపోయాక అసెంబ్లీ బిజినెస్ అడ్వయిజరీ కమిటీ సమావేశం కానుంది. సమావేశాలు ఎన్ని రోజులు నడుపుకోవాలనే విషయంతో పాటు అజెండాను కూడా చర్చించనున్నారు. ఈనెల 20వ తేదీన అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్‌ను డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టనున్నారు. అదే రోజు శాసన మండలిలో అసెంబ్లీ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. 21న రంజాన్ పండుగ ఉండనుండటంతో అసెంబ్లీ సమావేశాలకు సెలవు ఇవ్వనున్నారు. గవర్నర్ ప్రసంగంపై 17.18 తేదీలలో ధన్యవాద తీర్మానంపై చర్చించనున్నారు. 19వ తేదీన ఉగాది పండుగ ఉన్నందున ఆ రోజు అసెంబ్లీ సమావేశాలకు సెలవు ఉండనుంది. 22వ తేదీ నుంచి బడ్జెట్ ప్రతిపాదనలపై సభలో చర్చించనున్నారు.సభలో చర్చించే అంశాలివే..

**వాటిలో ప్రధానంగా గిగ్ వర్కర్ల కొత్త చట్టం:** గిగ్ వర్కర్ల హక్కుల పరిరక్షణ కోసం కొత్త చట్టానికి మద్దతుపై చర్చించనున్నారు.

**విద్యా విధానం:** విద్యారంగంలో కొత్తవిధానాల అమలు,మార్పులు, బడ్జెట్ కేటాయింపులపై చర్చ.

**సోషల్ మీడియా కట్టడి:** ఫేక్ న్యూస్, >>2



ఆదివారం అసెంబ్లీ భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన స్పీకర్ ప్రసాద్ కుమార్, ఛైర్మన్ సుఖేందర్ రెడ్డి

## ఏర్పాట్లపై సమీక్షించిన అసెంబ్లీ స్పీకర్, కౌన్సిల్ ఛైర్మన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి15:** సోమవారం నుండి ప్రారంభం కానున్న తెలంగాణ రాష్ట్ర మూడవ శాసనసభ ఎనిమిదో సమావేశాలు, తెలంగాణ శాసనమండలి 26 వ సమావేశాల నేపథ్యంలో నిర్వాహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు,పోలీసు శాఖ ఉన్నతాధికారులతో ఆదివారం శాసనసభ భవనంలోని కమిటీ హాల్‌లో సన్నాహక సమావేశం జరిగింది. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాష్,అసెంబ్లీ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి,శాసన >>2

## ఎఆర్ కానిస్టేబుల్ దారుణహత్య

**హైదరాబాద్ (ఉప్పల్), మార్చి 15 ప్రభాతవార్త :** ఉప్పల్ చిలుకానగర్‌లో ఎఆర్ కానిస్టేబుల్ దారుణహత్యకు గురైయ్యారు. చెంగిచెర్ల ఆర్‌టిసి కాలనీకి చెందిన సుబ్బయ్య కుమారుడు సుధీర్‌రెడ్డి (40) హైదరాబాద్ వింగ్‌లో ఎఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. అయితే ఆదివారం రాత్రి 8.30 గంటల సమయంలో చిలుకానగర్ స్మశానవాటిక వద్ద ఉన్న ఖాళీ స్థలంలో కొందరు వ్యక్తులతో కలిసి వచ్చారు. అక్కడ వీరంతా కలిసి మద్యం సేవించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఖాళీ స్థలం నుంచి పరుగులు పెడుతూ ఒక వ్యక్తి రోడ్డుపైకి రావడంతో స్థానికులు కలవరపడ్డారు. అతనిని వెంబడిస్తూ మరికొందరు రోడ్డుపైకి వచ్చారు. వెంట తెచ్చుకున్న కత్తులతో ఎఆర్ కానిస్టేబుల్‌పై దాడి చేయడంతో అతను అక్కడి కక్కడే మృతి చెందారు. >>2

## లైఫ్ సైన్సెస్‌లో రూ.300 కోట్ల పెట్టుబడులు: మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, మార్చి 15 ప్రభాతవార్త:** అమెరికాకు చెందిన కేంబ్రిడ్జ్ ఐసోటోప్ ల్యాబొరేటరీస్, స్థానిక కెమ్ తత్వ చిరల్ సొల్యూషన్స్ సంయుక్తంగా అధునాతన తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చాయి. ఈ కంపెనీలు వచ్చే మూడేళ్లలో రూ.300 కోట్ల పెట్టుబడి పెడతాయని ఐటి, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. హైదరాబాద్ జీనోమ్ వ్యాలీ ఫేజ్-4లో ఏర్పాటు కానున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా 250 మందికి ఉద్యోగాలు లభిస్తాయని ఆయన తెలిపారు. ఆదివారం సచివాలయంలో తనతో సమావేశమైన రెండు కంపెనీల సిఇఓలు పెట్టుబడులకు అంగీకరించారని ఆయన చెప్పారు. లైఫ్ సైన్సెస్, స్పెషాలిటీ కెమికల్స్ రంగాల్లో తెలంగాణ ప్రపంచ స్థాయి కేంద్రంగా ఎదుగుతుందన్నారు. కేంబ్రిడ్జ్ ఐసోటోప్ ల్యాబొరేటరీస్, కెమ్ తత్వల భాగస్వామ్యం అంతర్జాతీయ కంపెనీలకు రాష్ట్రంపై ఉన్న ప్రగాఢ విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు.



ఆదివారం గాంధీభవన్‌లో పిసిసి చీఫ్ మహేష్‌గౌడ్

# డ్రగ్స్ పరీక్షకు కెటిఆర్ సిద్ధమా?

### ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు డ్రగ్‌టెస్టు చేయించి అసెంబ్లీకి వెళ్దాం


### మహిళలకు కాంగ్రెస్‌లో మరింత ప్రోత్సాహం: పిసిసి చీఫ్ మహేష్

**హైదరాబాద్,మార్చి 15,ప్రభాతవార్త:** అసెంబ్లీ సమయంలో ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు అందరం డ్రగ్స్ టెస్టులు చేసుకొని లోనికి వెళ్దామని టిపిసిసి చీఫ్,ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ప్రకాశం హాల్ లో ఆదివారం టిపిసిసి మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు గా ఎర్రబెల్లి స్వర్ణ పదవీ బాధ్యతలు స్వీకరణ కార్యక్రమం జరుగగా టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ అల్ ఇండియా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబ, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావ్, ప్రోటోకాల్ ఇంచార్జ్ హర్కర్ వేణు గోపాల్ రావు , ఎంపి కడియం కావ్య,కాంగ్రెస్ నాయకులు గుండు సుధారాణి,కోట నీలిమ, నేరెళ్ళ శారద రాష్ట్ర మహిళ కాంగ్రెస్ ఇంచార్జ్ తదితరులు హాజరైనారు. ఈ సందర్భంగా టిపిసిసి చీఫ్ మాట్లాడుతూ మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై కెటిఆర్ బృందం సమాధానం చెప్పాలని, కెటిఆర్, ఆయన అనుచరగణం డ్రగ్స్ పరీక్షలకు సిద్దం కావాలని ఆయన కోరారు. ఈగల్ బృందం రాజకీయాలకు అతీతంగా డ్రగ్స్ రహిత సమాజం కోసం దాడులు చేస్తోందని ఆయన అన్నారు. డ్రగ్ రహిత తెలంగాణ కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో కృషిచేస్తున్నారనీ ఆ ప్రయత్నంలో మనవంతు సాయం చేయాలి కానీ పోరాటాన్నే నిర్వీర్యం చేసే పనిచేయొద్దని మహేష్‌కుమార్ అన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ హయాంలో తెలంగాణను డ్రగ్స్ >>2

ఏ పరీక్షకైనా సిద్ధం: కెటిఆర్ 2లో

### ఎంపి పుట్టా మహేష్ సహా

# ఆరుగురికి డ్రగ్స్ పాజిటివ్



పట్టుబడిన మాదకద్రవ్యాలు

**మొయినాబాద్, మార్చి 15, ప్రభాతవార్త :** మొయినాబాద్ లో తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ లో శనివారం రాత్రి సంచలనం సృష్టించిన డ్రగ్స్ ఏలూరు ఎంపీ పుట్ట మహేష్ కుమార్ యాదవ్ సహా ఆరుగురికి

రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో సంచలనం సృష్టించిన వీకెండ్ పార్టీ

పాజిటివ్ వచ్చిన వారిలో మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి, విజయ్ కృష్ణ కౌశిక్, అర్జున్ రెడ్డి ప్రభృతులు

మహేష్ సహా ఎనిమిదిమందికి స్టేషన్ బెయిల్



మీడియాతో ఈగల్ ఫోర్స్ ఎస్పీ గిరిధర్

డ్రగ్స్ పాజిటివ్ వచ్చినట్లు ఆదివారం ఈగల్ ఎస్పీగిరిధర్ తెలిపారు శనివారం ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ శనివారం >>2

చంచల్‌గూడ జైలుకు రోహిత్ రెడ్డి 2లో

# మైనారిటీలకు సింహాభాగం

### ఆత్మశుద్ధికి రంజాన్ అనువైన సమయం

### ఇఫ్తార్ విందులో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి15:** రంజాన్ కేవలం పండుగ కాదు..ఆత్మ శుద్ధి చేసుకునే సమయమని తెలంగాణ రాష్ట్రముఖ్యమంత్రి ఎ,రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం తరపున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినందుకు సంతోషంగా ఉందన్నారు.. సోదరభావం తీసుకువచ్చి మతసామరస్యంతో కలిసి మెలిసి ఉండాలి..మా ప్రభుత్వం ముస్లిం లకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ఆదివారం సాయంత్రం ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు (దావత్-ఎ-ఇఫ్తార్)కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. >>2



ఆదివారం ఎల్‌బి స్టేడియంలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న సిఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో మంత్రి అజారుద్దీన్, ఎంపి అసదుద్దీన్ ఓవైసి

# 24x7 గ్యాస్ కష్టాలే!

### పల్లె నుంచి పట్టణం దాకా అంతా హాహాకారాలు

### సర్వర్లు మొరాయిస్తుండడంతో నిలిచిపోతున్న బుకింగ్‌లు

### ఒటిపి రాదు.. సిలిండర్ కదలదు

### రూ.5వేలిస్తే బ్లాక్‌లో ప్రత్యక్షం

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావంతో రాష్ట్రంలో ప్రజలు, చిరు వ్యాపారులకు గ్యాస్ కష్టాలు రోజు రోజుకూ తీవ్రమవుతున్నాయి. వంట గ్యాస్ కొరత లేదని ప్రభుత్వం ఎంత భరోసా ఇచ్చినా, అధికారులతో ఎన్ని రివ్యూలు చేసినా రాష్ట్రంలో సామాన్యులకు వంట గ్యాస్ కష్టాలు మాత్రం తీరడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో పట్టణం నుంచి పల్లె దాకా ప్రజలు వంట గ్యాస్ కష్టాలు వెంటాడుతున్నాయి. ఏజెన్సీలు, గోడౌన్ల దగ్గర ఖాళీ సిలిండర్లు దర్శనమిస్తున్నాయి. సర్వర్లు మొరాయించడంతో గ్యాస్ బుకింగ్‌లు నిలిచి పోయాయి. టోల్ ఫ్రీ, కస్టమర్ కేర్ నెంబర్లు కనెక్ట్ కావడంలేదు. అదృష్టం కొద్దీ కనెక్ట్ అయినా ఓటిపిలు జనరేట్ కావడంలేదు. ఓటిపి లేకుండా ఏజెన్సీలు డెలివరీ చేయడంలేదు. ఇప్పటికే బుకింగ్ ప్రాసెస్ కంప్లీట్ అయ్యి ఓటిపి వచ్చినా రీఫిల్లింగ్ సిలిండర్లు అందడంలేదు. స్టాక్ వచ్చాకనే ఇస్తామంటూ డీలర్లు సర్ది చెప్తున్నారు. ఏజెన్సీలు



ఒక చోట, గోడౌన్లు మరో చోట ఉండడంతో జనం నిత్యం చక్కర్లు కొడుతున్నారు. స్టాక్ ఎప్పుడొస్తుందో విని యోగదారులకు తెలియదు, వచ్చాక బినామీ, బోగస్ పేర్లతో ఎవరికి డెలివరీ అవుతున్నాయో అర్థం కావడంలేదు. ఇదే సమయంలో సందట్లో సడేమియా అన్నట్లుగా అక్రమార్కులు బ్లాక్ మార్కెట్‌లో గ్యాస్‌ను అధికధరలకు విక్రయించి సొమ్ము >>2

# నేటి నుంచి ఒంటిపూట బడులు

**హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 15:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో నేటి(సోమవారం) నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. ఒంటిపూట బడుల నేపథ్యంలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పాఠశాలలు కొనసాగుతాయి. నేటి నుంచి 2025-26 విద్యా సంవత్సరం చివరిపనిదినం అయిన ఏప్రిల్ 23వరకు ఒంటిపూట బడులు >>2



ఆదివారం హైదరాబాద్‌లో హెచ్‌జె దొర కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఏపి సిఎం చంద్రబాబు

# కెసిఆర్ అసెంబ్లీకి వస్తారా? ఎప్పటిలానే దూరంగా ఉంటారా?

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి15:** రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాలకు ప్రధాన ప్రతిపక్ష నేత కెసిఆర్ అసెంబ్లీకి వస్తారా..లేక ఎప్పటిలానే శాసనసభ సమావేశాలకు దూరంగానే ఉంటారా...? అనేది చర్చనీయాంశంగా మారింది. అయితే కెసిఆర్ సభకు హాజరవడంపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో ఈసారి కూడా బడ్జెట్ సమావేశాలకు రాకపోవచ్చని పలువురు పేర్కొన్నారు. బడ్జెట్ సమావేశాలలో భాగంగా సోమవారం ఉభయ సభలను ఉద్దేశిస్తూ గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగిస్తారు. తర్వాత రెండు రోజులు మంగళ, బుధవారాలు రెండు సభల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదం తెలుపుతారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఈసారి బడ్జెట్ చర్చలతో పాటు మూసీ ప్రాజెక్టు, సింగరేణి బొగ్గు కుంభకోణం, ఇతర అంశాలపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడివేడి చర్చ జరిగే అవకాశం ఉంది.

# మండుతున్న మధ్యప్రాచ్యం

>> యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, దుబాయి ఎయిర్‌పోర్టులపై మళ్లీ దాడులుచేయడంతో ఈ ఎయిర్‌పోర్టులను మూసివేసారు. తాత్కాలికంగా సేవలన్నింటినీ నిలిపివేస్తున్నట్లు ఎయిర్‌ఫోర్టు అధికారులు ప్రకటించారు. అలాగే ఉత్తర ఇరాక్‌లోని ఎర్బిల్‌నగరంలో జరిగిన డ్రోన్‌దాడుల్లో లూనాజ్ రిఫైనరీ ధ్వంసం అయింది. ఆకాశమంత ఎత్తున నల్లటిపొగ అలుముకున్న విడియోలు వైరల్ అయ్యాయి. దీనితో రిఫైనరీలో చమురు శుద్ధిని తాత్కాలికంగా నిలిపివేసారు. మరోవైపు బాగ్దాద్‌లోని అమెరికా దౌత్యకార్యాలయంపైనా మళ్లీ దాడులు జరిగాయి. ఎంబసీపై రెండోసారి దాడిజరగడంతో అమెరికా అప్రమత్తం అయింది. ఇప్పటికీ సౌదీ అరేబియా, యెమెన్, యుఎఇ, ఖతార్ వంటి దేశాల్లోని అమెరికా సైనిక, వైమానిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేస్తున్న ఇరాన్ సముద్రజలాల్లో ఇరాన్ వివరాలను రాబడుతున్నట్లు చెపుతున్న అమెరికా నౌకల స్పేస్ రిసీవర్లపై నిఘావేసి వాటినే టార్గెట్‌గా డ్రోన్ల దాడులుచేస్తోంది.

**ఆరెండుదేశాల నౌకలనే అడ్డుకుంటాం...**

ఇదిలా ఉంటే హార్ముజ్‌జలసంధినుంచి ఇకపై అమెరికా, ఇజ్రాయెల్‌కువెళ్లే చమురు, గ్యాస్ ట్యాంకర్లనే అడ్డుకుంటామని, ఇతర దేశాల నౌకలకు ఎలాంటి ఆంక్షలు ఉండవని ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ ఆరాగ్చీ ప్రకటించారు. ఇదిలా ఉంటే యెమెన్ పరిధిలో ఉన్న బాబ్ ఎల్ మాండెబ్ జలసంధిని కూడా మూసేస్తామని ఇరాన్ మద్దతున్న హౌతీ రెబెల్స్ ప్రకటించారు.యూరప్ ఆసియా ఖండాలమధ్య నౌకలు సూయెజ్ కాలువకు చేరుకోవాలంటే బాబ్ ఎల్ మాండెబ్ ఒక్కటే మార్గం. అందువల్లనే ఇపుడు ఆసియా, యూరోప్‌దేశాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి.

**ఆచూకీలేని నెతన్యాహు కుమారుడు...**

నిన్నమొన్నటివరకూ ఇజ్రాయెల్‌ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆచూకీలేదని జరిగినప్రచారం ఇపుడు నెతన్యాహు కుమారుడిపైకిమళ్లింది. ప్రధాని నెతన్యాహు కుమారుడు యాయిర్ నెతన్యాహు వారంరోజులుగా సోషల్‌మీడియాలో కనిపించకపోవడం కూడా అనుమానాలు రేకెత్తాయి. యాయిర్ ఇలా ఆకస్మికంగా మాయం కావడంపై ఆయన భద్రతకు ముప్పు పొంచి ఉందన్న అంచనాలుపెరిగిపోయాయి. అలాగే బెంజమిన్ నెతన్యాహు క్షేమంగా ఉన్నారని, ఆ వార్తలన్నీ ఫేక్‌న్యూస్ అని అన్నారు. యాయిర్ మౌనం కూడా భద్రతా చర్యల్లోభాగమేనని ఇజ్రాయెల్ సర్దిచెప్పింది.

# ఎంపి పుట్టా మహేష్ సహా ఆరుగురికి డ్రగ్స్ పాజిటివ్



>> రాత్రి 7:30 గంటలకు సమయంలో తమకు డ్రగ్స్ పార్టీకి సంబంధించిన సమాచారం అందిందని తెలిపారు వెంటనే మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజిత్ నగర్ రెవెన్యూ లో గల తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్కు వెళ్లి ఈగల్ టీం ఎస్ఓటి పోలీసులు కలిసి ఫామ్ హౌస్ పై దాడులు నిర్వహించగా ఫామ్ హౌస్ లో మొత్తం 11 మంది తో పార్టీ జరుపుతున్నట్లు తెలిసింది అందులో 11 మందికి టెస్ట్ నిర్వహించగా ఆరుగురికి పాజిటివ్ వచ్చిందని పేర్కొన్నారు పాజిటివ్ వచ్చిన వారిలో మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్కు చెందిన అధికార పార్టీ టిడిపి ఏలూరు ఎంపీ పుట్ట మహేష్ కుమార్ యాదవ్. విజయ్ కృష్ణ కౌశిక్ రవి తిరువీడుల అర్జున్ రెడ్డి నమిత్ శర్మ మోరవినేని రమేశ్ లకు డ్రగ్స్ పాజిటివ్ వచ్చినట్లు ఆయన తెలిపారు 11 మందిపై కేసు నమోదు చేసి విచారించారు రోహిత్ రెడ్డి స్నేహితుడు కౌశిక్ రెడ్డి సిమ్లా నుండి గుర్తు తెలియని వ్యక్తి దగ్గర డ్రగ్స్ కొనుగోలు తెచ్చారని తెలిపారు అయితే అందరికీ డ్రగ్స్ పంచిన తర్వాత రెండు కొకైన్ ప్యాకెట్లు రోహిత్ రెడ్డి పిఏ సిల్వర్ శరత్ కుమార్ దగ్గర స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు

**ముగ్గురికి మినహా ఎనిమిది మందికి బేల్ మంజూరు.....**

డ్రెస్ కేసులో మొత్తం 11 మంది పై కేసు నమోదు కాగా ముగ్గురికి మినహా ఎనిమిది మందికి స్టేషన్ బెయిల్ మంజూరు చేసినట్లు పోలీసులు తెలిపారు ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి, కౌశిక్ రెడ్డి నమిత్ రెడ్డి లకు బెల్ నిరాకరించారు రేపటినుండి రేపటినుండి ఆంధ్రప్రదేశ్ లో పార్లమెంట్ సమావేశాలు ఉండడంతో ఏలూరు ఎంపీ మహేష్ కుమారి యాదవ్ కు ప్రియాంక రెడ్డి లకు షరతులతో కూడిన బేలు మంజూరు చేసినట్లు వారు పేర్కొన్నారు.

**సంచలనాలకు అడ్డగా మారిన రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్....**

గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు టిఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఓ స్వామీజీ కొనుగోలు చేసి పార్టీ ఫిరాయింపుల వ్యవహారం మొయినాబాద్ మండలంలోని ఈ ఫామ్ హౌస్ లోనే జరిగింది అప్పట్లో ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది ఇప్పుడు మరోసారి రోహిత్ రెడ్డి ఫామ్హౌస్ రెండు రాష్ట్రాల్లో సంచలనానికి నిలయమైందని పలువురు అంటున్నారు తెలంగాణ రాష్ట్రంలో గంజాయి డ్రగ్స్ వంటి మారకద్రవ్యాల నిషేధం పై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నారని పలువురు అంటున్నారు కానీ ఈ డ్రగ్స్ వ్యవహారం కాస్త సినీ రంగం నుండి రాజకీయ రంగు పూసుకుంది మరి ఈ వ్యవహారంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తుందో చూడాలని పలువురు అంటున్నారు .

## కొత్త బడ్జెట్ కూర్పు వేగవంతం

# 2026-27 కేటాయింపుపై ఫోకస్

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త** వచ్చే 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను తెలంగాణ ప్రభుత్వానికి అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనల ప్రక్రియపై ఆర్థికశాఖ వేగవంతం చేసింది. ప్రభుత్వం ఆదాయ లక్ష్యాలపై తుది పరిణామాలు, మార్పులను వచ్చే 2026-27 బడ్జెట్‌లో ప్రతిబింబింపజేయనుంది. ప్రస్తుత 2025-26 బడ్జెట్ ప్రకారం మొత్తం ఆదాయం రూ.2.84 లక్షల కోట్లుగా ఉండాలి, కానీ మార్చి చివరి నాటికి ఇది రూ.2.60 లక్షల కోట్ల వరకు పరిమితం కావచ్చని ఆర్థిక శాఖ అధికారులు భావిస్తున్నారు. ఇందుకు సంబంధించి ప్రస్తుత ఏడాది పన్నుల వసూళ్లపై ప్రతిపాదనలు అందిన దరిమిలా, శాఖల కార్యదర్శులు, మంత్రులతో కలిసి ఆర్థికశాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ కేటాయింపుల అంచనాలపై సంబంధిత శాఖల వారీగా సమీక్షలు దాదాపు పూర్తయ్యాయి. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక అంశాలపై ఆ శాఖ అధికారులు దృష్టిసారించారు. ప్రధానంగా పన్నుల వసూళ్ల విషయమై పునరాలోచన చేస్తున్నారు. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక శాఖ బడ్జెట్‌లో ప్రభుత్వం పన్నుల ద్వారా రూ.1.75 లక్షల కోట్లకు పైగా ఆదాయం వస్తుందని అంచనా వేసింది.

# మోగిన 'పాంచ్' నగారా

>> చేశారు. పశ్చిమబెంగాల్‌లో రెండు దశల్లో ఏప్రిల్ 23, ఏప్రిల్ 29న పోలింగ్ నిర్వహించనున్నారు. తమిళనాడులో అక్టోబర్ 23న పోలింగ్ జరుగనుంది. అసోం, కేరళ, పుదుచ్చేరిల్లో ఒకే దశలో ఏప్రిల్ 23న పోలింగ్ నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. వీటితోపాటు గోవా, కర్ణాటక, నాగాలాండ్, త్రిపురల్లో ఏప్రిల్ 9, గుజరాత్, మహారాష్ట్రలో ఏప్రిల్ 23న పోలింగ్ జరుగనుంది. అన్ని రాష్ట్రాల ఓట్ల లెక్కింపు మాత్రం మే 4న జరుగనుందని కేంద్ర ఎన్నికల కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలు వివరించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల నేపథ్యంలో ఆయా రాష్ట్రాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ ముగిసేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఎన్నికల ప్రక్రియలో హింసాత్మక ఘటనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# 24x7 గ్యాస్ కష్టాలే!

>> చేసుకుంటున్నారు.పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధం భారతీయ వంట గదుల్లో మంటలు పుట్టిస్తోంది. ఇరాన్-అమెరికా మధ్య ఘర్షణలతో చమురు, సహజవాయువు సరఫరా వ్యవస్థలు దెబ్బతినడంతో సామాన్యుల వంట గ్యాస్ భయం ఇప్పుడు బ్లాక్ మార్కెట్ వ్యాపారులకు వరంగా మారింది. గతంలో ఎన్నడూ లేని విధంగా దేశవ్యాప్తంగా ఎల్‌పిజి సిలిండర్ల కొరత ఏర్పడటంతో అక్రమ విక్రయదారులు సిలిండర్ ధరను ఆకాశానికి తీసుకెళ్లారు. ప్రస్తుతం హైదరాబాద్‌తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా గ్యాస్ బ్లాక్ మార్కెట్ దందా జోరందుకుంది. ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ రూ.2 వేల వరకు, కమర్షియల్ గ్యాస్ ధర రూ.3 వేల నుంచి 5 వేల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఒకప్పుడు వెయ్యి రూపాయలకే దొరికే సిలిండర్ నేడు బ్లాక్‌లో రూ.5వేలకు అమ్ముడవుతోంది. సిలిండర్లు సరిపడా ఉన్నాయని అధికారులు చెబుతున్నప్పటికీ ఏజెన్సీల్లో నో స్టాక్ అంటూ చెబుతున్నారని వినియోగదారులు వాపోతున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఏజెన్సీల ముందు సిలిండర్ల కోసం వినియోగదారులు క్యూలో నిల్చోవాల్సిన దుస్థితి నెలకొంది. మరోవైపు హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, మెస్‌లు సిలిండర్లు లేక మూసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని నిర్వాహకులు వాపోయారు. హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో ఓ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వాహకుడు కట్టెలతోనే వంటకాలు సిద్ధం చేసుకోవాల్సి వచ్చింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఏజెన్సీల బ్లాక్ దందాను అరికట్టాలని ఎల్‌పిజి వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. సిలిండర్లు సరిపడా ఉన్నప్పుడు బుక్ చేసినా పది రోజుల గడిచినా ఎందుకు రావడం లేదని ప్రశ్నిస్తున్నారు. గృహ అవసరాలకు కేటాయించిన ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాలశాఖ హెచ్చరిస్తోంది. హోటళ్లు, రెస్టారెంట్లలో డొమెస్టిక్ సిలిండర్ల వినియోగాన్ని అరికట్టేందుకు పౌరసరఫరాలశాఖ అధికారులు,డిటిలు, ఎస్ఐలతో కూడిన అయిదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వినియోగదారులకు సకాలంలో, నిర్దేశిత పరిమాణంలో గ్యాస్ సరఫరా చేయాలని, ఆస్పత్రులు, వసతి గృహా లకు నిబంధనల మేరకు సరఫరా కొనసాగించాలని స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో గ్యాస్ వినియోగదారులు అధికారిక ఛానెళ్ల ద్వారానే బుకింగ్ చేసుకోవాలని, బ్లాక్ మార్కెట్‌ను ప్రోత్సహించవద్దని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోంది.

# నేటి నుంచి బడ్జెట్ అసెంబ్లీ

>> హార్మ్ కంటెంట్ నియంత్రణపై చట్టపరమైన చర్చ. గోదావరి,కృష్ణా నదీ జలాల అంశంపై చర్చ. కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. ఏపీ ప్రభుత్వం గోదావరి నదీపైన చేపడుతున్న ప్రాజెక్టులపైన ప్రభుత్వం,అధికార పార్టీ తరఫున వివరణ ఇవ్వనున్నట్లు తెలిసింది. ఇక సింగరేణిలో నైనీకోల్ బ్లాక్ అంశంపై ఇటీవల వివాదం చెలరేగి రాజకీయ దుమారానికి దారి తీసింది. ఈ మేరకు గనుల టెండర్లపై అవినీతి ఆరోపణలు తదితర అంశాలు అసెంబ్లీలో చర్చకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. కాగా, దఫాలో అనేక అంశాలపైన ప్రతిపక్షాలు సంధించే ప్రశ్నలు,ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న అనేక వివాదస్పద అంశాలపైనా ప్రజలకు స్పష్టత ఇచ్చేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. మూసీ నది ప్రక్షాళన,సరోవర్ ప్రాజెక్టు వంటి అంశాలు కూడా ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో అధికార,ప్రతిపక్ష,బిజెపిల మధ్య పొలిటికల్ వార్ నడుస్తున్నది. దీనిపైనా సభలో చర్చకు వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. ఖమ్మంలో భూదాన్ భూముల అంశం సైతం హాట్ టాపిగ్‌గా మారింది. ఇది కూడా అసెంబ్లీలో చర్చకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దీనిపైనా విపక్షాల ఆరోపణలు,విమర్శలకు కౌంటర్ ఇచ్చేందుకు తమ సభ్యులు సిద్ధమవుతున్నారని అధికార పార్టీ వర్గాలు తెలిపాయి.

అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా డోర్నకల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే రాంచందర్ నాయక్ పేరును పార్టీ అధిష్టానం గతేడాది జూన్ లో ప్రకటించింది. ఆయన ప్రస్తుతం విప్‌గా కొనసాగుతున్నారు. రాంచందర్ నాయక్ పేరు ఖరారైనా అధికారికంగా ఉపసభాపతి ఎన్నిక ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. అయితే ప్రతి సమావేశంలోనూ ఈ నియామకానికి బ్రేక్‌లు పడుతూ వస్తోంది. కాగా, ఈ బడ్జెట్ సమావేశాల్లోనూ డిప్యూటీ స్పీకర్ ఎన్నికపైనా స్పష్టత లేదు, డిప్యూటీ స్పీకర్ ఎన్నికకు ముందు నోటిఫికేషన్ ఇచ్చి ఎలక్షన్ జరిపించాల్సి ఉంటుంది. గత అసెంబ్లీ సమావేశాల్లో సమయం లేకపోవడంతో ఎన్నికను నిర్వహించలేదని ప్రభుత్వ వర్గాలు చెప్పాయి. అయితే రాంచందర్ నాయక్ సైతం మంత్రివర్గ విస్తరణ జరిగితే తనకు మంత్రిపదవి ఇవ్వాలని అధిష్టానాన్ని కోరుతున్నట్టు సమాచారం. దీనితో డిప్యూటీ స్పీకర్ ఎన్నిక జాప్యానికి అది కూడా ఓ కారణమన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో ఉంది.

## ఏర్పాట్లపై సమీక్షించిన అసెంబ్లీ స్పీకర్, కౌన్సిల్ ఛైర్మన్

>> మండలి కార్యదర్శి వి.నరసింహా చార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి. హాజరైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, జిఏడి ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బోజ్జా, ఫైనాన్స్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, స్పెషల్ సెక్రటరీ (ఫైనాన్స్) సిక్తా పట్నాయక్. డిజిపి శివధర్ రెడ్డి, అదనపు డిజిపి (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్, అదనపు డిజిపి(ఇంటెలిజెన్స్) విజయకుమార్, హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్ కమిషనర్లు విసి సజ్జనార్, అవినాష్ మహంతి, ఎం. రమేష్, ఇంటెలిజెన్స్ ఐజి కార్తికేయ, అసెంబ్లీ, కౌన్సిల్ ఛీఫ్ మార్షల్స్ కర్ణాకర్, సంజీవరెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ గతంలో లాగానే ఈ సమావేశాలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సహకారం అందించాలి. బడ్జెట్ సమావేశాలు అత్యంత ప్రాధాన్యతమైనవి.ఎక్కువ రోజులు జరగడంతో పాటుగా, ఎక్కువ సమయం పాటు జరుగుతాయని పేర్కొన్నారు. శాసనసభ, శాసనమండలి సమావేశాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరగడానికి పోలీసు శాఖ తరుపున చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశాలకు హాజరయ్యే మంత్రులు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.. మొదటి రోజు గవర్నర్, ముఖ్యమంత్రి చేతుల మీదుగా శాసనసభ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ జరుగుతుంది కాబట్టి అందుకనుగుణంగా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ. ..సభలు సజావుగా జరగడానికి ప్రభుత్వం నుంచి అవసరమైన పూర్తి సహాయ, సహకారాన్ని అందిస్తాం. కోఆర్డినేషన్ కోసం ప్రతి శాఖ నుండి ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తామని చెప్పారు.

## విద్యాసంస్థల్లో కుల వివక్షను అంతం చేయాలి

### అసెంబ్లీ సమావేశాల్లో రోహిత్ చట్టం చేసి అమలు చేయాలి

### ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సదస్సులో తీర్మానం

**హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 15:** ఉన్నత విద్యాసంస్థలు, యూనివర్సిటీల్లో వేళ్లూనుకున్న కుల వివక్షను తుదముట్టించాలని, విద్యార్థుల గౌరవం, భద్రతను కాపాడేందుకు ప్రత్యేకంగా 'రోహిత్ చట్టం' తీసుకురావాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర సదస్సు డిమాండ్ చేసింది. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆదివారం రాష్ట్ర స్థాయి సదసును నిర్వహించగా.. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. రజనీకాంత్ అధ్యక్షత వహించారు. సదస్సులో విజ్ఞాన దర్శిని వ్యవస్థాపక అధ్యక్షుడు టి.రమేష్ మాట్లాడుతూ. ఆధునిక సమాజంలో జ్ఞానం, విమర్శనాత్మక ఆలోచనలు, భావాజాల సంఘర్షణ కేంద్రాలుగా నిలవాల్సిన యూనివర్సిటీలు నేటికీ కుల వివక్షకు వేదికలుగా మారడం అత్యంత దురదృష్టకరమన్నారు. కుల వివక్ష కారణంగా రోహిత్ వేముల వంటి ప్రతిభావంతులైన విద్యార్థులను దేశం కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే విద్యార్థులకు చట్టపరమైన రక్షణ కల్పించే రోహిత్ చట్టంను కేంద్ర ప్రభుత్వం తక్షణమే తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర స్థాయిలో చట్టం చేసి కాంగ్రెస్ ప్రభుత్వం తన హామీని నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడుతూ.. విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులపై జరుగుతున్న వివక్ష, దాడులు, అణచివేతకు వ్యతిరేకంగా విద్యార్థి లోకం ఐక్యంగా పోరాడాలన్నారు. యూనివర్సిటీల్లో యూజీసీ నిబంధనలను అమలు చేయాలని, ఈ నిబంధనలను కేంద్రం అమలు చేయకుండా న్యాయ సమస్యలు వచ్చేలా బిజెపి అనుబంధ సంఘాలు చేయడం దుర్మార్గపు చర్య అని విమర్శించారు. యూనివర్సిటీ క్యాంపస్‌లలో ప్రజాస్వామ్య వాతావరణాన్ని బలోపేతం చేసి,

ప్రతి విద్యార్థికి సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. సదస్సులో భాగంగా రోహిత్ చట్టం ఆవశ్యకతను వివరించే తీర్మానాన్ని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిక్ అహ్మద్ ప్రవేశపెట్టగా సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. విద్యాసంస్థల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు అంతర్గత ఫిర్యాదు కమిటీలను బలోపేతం చేయాలని, వివక్షకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సదస్సు తీర్మానించింది. సదస్సులో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.అశోక్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు కార్తీక్, లావుడ్య రాజు, లెనిన్ గువేరా, అవినాష్, రాజేష్, అజయ్, సతీష్, రాజు, జ్యోష్నిక, నవ్య, శివాని, సుబ్బు పాల్గొన్నారు.



ఆదివారం లోక్‌భవన్‌లో కొత్త గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను గౌరవ పూర్వకంగా కలిసిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

## తెలంగాణ నూతన గవర్నర్‌ను కలిసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 15 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి లోక్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ గవర్నర్‌గా నియమితులైన సందర్భంగా పుష్ప గుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పరిస్థితులపై ఇరువురు కాసేపు చర్చించుకున్నారు.

# పుట్టా మహేశ్ వ్యవహారంపై సిఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం

**ఆయనకు నోటీసులివ్వాలని ఎపి టిడిపి అధ్యక్షుడికి, పార్లమెంటరీ పార్టీ నేతకు ఆదేశం**

**పార్టీ కార్యక్రమాలకు దూరం పెట్టాలని ఆదేశం**

**విజయవాడ,మార్చి 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ పుట్టా మహేశ్ వ్యవహారంపై ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేసారు.డ్రగ్స్ అంశంలో పుట్టా ఈ స్థాయిలో ఆరోపణలు ఎదుర్కోవడం చాలా ఆందోళన కలిగించే విషయమని వ్యాఖ్యానించారు.పార్టీ కార్యకలపాల్లోగాను.ప్రభుత్వ అంశాల్లోగాని పుట్టా పాల్గొనకూడదని సీఎం చంద్రబాబు ఆదేశించారు.ఆ దిశలో ఆయన టీడీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు కృష్ణదేవరాయులకు,ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేసారు.పుట్టాపై ఉన్న అభియోగాలు చట్టపరంగా పరిష్కారమయ్యే వరకు ఆయన అధిష్టానం ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరించాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.మొయినాబాద్ డ్రగ్స్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ వ్యవహారంపై ఏపీ సీఎం చంద్రబాబు ఈ వ్యవహారంపై ఆరా తీసారు. ఆ వెంటనే మహేశ్‌పై వచ్చిన ఆరోపణలను చంద్రబాబు సీరియస్ అంశంపై పరిగణించాలన్నారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఎంపీ మహేష్‌ను పార్టీ అధిష్ఠానం ఆదేశించింది. ఆరోపణలకు సంబంధించి వివరణ కోరుతూ పుట్టా మహేశ్‌కు నోటీసులు ఇవ్వాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను చంద్రబాబు ఆదేశించారు ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ డ్రగ్స్ కేసులో పట్టుబడిన అంశంపై నివేదిక ఇవ్వాలని పల్లా శ్రీనివాస్‌ను సీఎం చంద్రబాబు ఆదేశించారు డ్రగ్స్ వంటి ఘటనల్లో ఎవరు ఉన్నా ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వ్యక్తులు, నేతలు చేసే తప్పులకు పార్టీ నష్టపోయే పరిస్థితి రానివ్వనని సీఎం చంద్రబాబు తేల్చి చెప్పారు.డ్రగ్స్ కేసులో అరెస్టైన పుట్టా మహేశ్‌కు స్టేషన్ బెయిల్ లభించడంతో విడుదలయ్యారు.

# ఏ పరీక్షకైనా సిద్ధం : కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి15:** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో డ్రగ్స్ పార్టీ తీవ్ర కలకలం సృష్టించింది. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. డ్రగ్స్ మహమ్మారిపై తన నిబద్ధతను చాటుతూనే.. ఈ అంశాన్ని రాజకీయం చేస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. డ్రగ్స్ కేసుపై కేటీఆర్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు మనుషులను రాక్షసులుగా మారుస్తాయి. సమాజానికి ఇవి పెను ముప్పు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు కూడా ఇలాంటి వ్యసనాలకు పాల్పడటం దురదృష్టకరం. డ్రగ్స్ వాడకాన్ని, విక్రయాలను బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోంది. ఈ విషయంలో మాకు ఎలాంటి రాజీ లేదు. డ్రగ్స్ కేసులను అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ పార్టీపై దుష్ప్రచారం జరుగుతోంది. ఈ అంశంలో నీచమైన రాజకీయాల కోసం బీఆర్ఎస్ పార్టీని లాగుతున్నారు. నాపై అసత్య ప్రచారాలు చేసేవారికి చట్టపరమైన నోటీసులు ఇస్తాను. నేను ఏ పరిక్షకైనా సిద్ధం. గతంలోనూ ఇదే విషయం చెప్పాను. డ్రగ్స్ వాడుతున్న వారు లేదా విక్రయిస్తున్న వారెవరైనా సరే.. అలాంటివారికి రాజకీయ నేపథ్యంతో సంబంధం లేకుండా చట్టప్రకారం కఠినంగా శిక్షి ంచాలి అని అన్నారు. అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు ఈ పరీక్షలు చేయించుకోవాలన్న మహేష్ కుమార్ గౌడ్ సూచనను నేను స్వాగతిస్తున్నాను.

## చంచల్‌గూడ జైలుకు రోహిత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, మార్చి15:** రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన మొయినాబాద్ డ్రగ్స్ కేసులో విచారణను పోలీసులు వేగవంతం చేశారు. ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ పార్టీలో పట్టుబడిన బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మలను జడ్జి ముందు హాజరుపరిచారు. రోహిత్‌రెడ్డితో పాటు మిగతా ఇద్దరికి ఉప్పర్‌పల్లి మేజిస్ట్రేట్ 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. దీంతో రోహిత్‌రెడ్డితో పాటు మిగతా ఇద్దరిని కూడా పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. మొయినాబాద్‌లో డ్రగ్స్ కేసులో ఇరురాష్ట్రాల రాజకీయ నాయకులు ఉండడం సంచలనంగా మారింది. ఈగిల్ బృందం జరిపిన పరీక్షల్లో తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, రితేశ్ రెడ్డి, నమిత్‌శర్మ, కౌశిక్, అర్జున్ రెడ్డిలకు పాజిటివ్ వచ్చిందని ఎస్పీ గిరిధర్ వెల్లడించారు. పాజిటివ్ వచ్చిన పైలట్ రోహిత్‌రెడ్డి(ఫామ్ హౌజ్‌ను దుర్వినియోగం చేసినందుకు), రితేష్‌రెడ్డి (అక్రమంగా రివాల్వర్ కలిగి ఉన్నందుకు), నమిత్‌శర్మ(రివాల్వర్‌తో కాల్పులు జరిపినందుకు) లను పోలీసులు ఉప్పర్‌పల్లిలో జడ్జిముందు హాజరుపరిచారు. ఆ ముగ్గురికి మెజిస్ట్రేట్ రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఫామ్‌హౌస్‌లో రోహిత్,టిడిపి ఎంపీ పుట్టా మహేశ్,రితేశ్, నమిత్ సహా మొత్తం 11 మంది డ్రగ్స్ కేసులో పట్టుబడ్డారు. ఇదిలా ఉండగా మహేశ్‌కు స్టేషన్ బెయిల్ లభించింది.

## చేపల వినియోగంలో.. జాతీయ సగటు కంటే తెలంగాణ రాష్ట్రం తక్కువ

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త** తెలంగాణలో చేపల వినియోగం జాతీయ సగటు కంటే తక్కువగా ఉంది. సగటు తలసరి వినియోగం 8.37 కిలోలు మాత్రమే ఉండగా, ఇతర రాష్ట్రాలు అధిక వినియోగంతో ముందున్నాయి. మత్స్యశాఖ తాజా అధ్యయన నివేదిక ప్రకారం చేపలను తినడంలో తెలంగాణ ప్రజలు వెనుకబడి ఉన్నారు. దేశంలో 72.1 శాతం మంది ప్రజలు చేపలను ఆహారంగా తీసుకుంటుండగా తెలంగాణలో కేవలం 58 శాతం మంది మాత్రమే వాటిని తింటున్నారు.

## వారం - వర్జ్యం

16-03-2026, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, పూర్వాభాద్ర కార్తె
ద్వాదశి ఉ.9.38
ధనిష్ఠ పూర్తి
వర్జ్యం : ఉ.10.00-11.38
దు.మ.12.41-1.29,
మ.3.06-3.54
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం:** ఉపయోగపడవని భావించిన పత్రములకు కొన్ని కీలక నిర్ణయముల వలన విలువ ఏర్పడుతుంది.

**వృషభం:** అన్ని రంగాలలోనూ అభివృద్ధి బాగుంటుంది. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చేసే కార్యక్రమాలు ఉపయోగపడు కుంటాయి.

**మిథునం:** సంతృప్తికి మించినది లేదని నమ్ముతారు. ఇతరులకు బోధచేస్తారు. అందరి సలహాలు వింటారు. వాహనసౌఖ్యం.

**కర్కాటకం:** మీ మనస్సుకు తోచిందేచేస్తారు. బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. ప్రయాణాలు.

**సింహం:** ఇతరుల ఈర్ష్యా అసూయలు మీపై ప్రభావం చూపకుండా జాగ్రతలు పాటించండి. క్రయవిక్రయాలలో లాభాలు.

**కన్య:** చేపట్టిన పనులలో జాప్యం జరిగినా చివరికి పూర్తిచేస్తారు. కోపతాపాలకు దూరంగా ఉండటం మంచిది.

**తుల:** గృహోపకరణాలు, శుభకార్యాలు మొదలగు వాటికి అధికంగా ధనం ఖర్చుచేస్తారు. మిత్రుల కలయిక.

**వృశ్చికం:** దూరప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలు చేపడతారు.

**ధనుస్సు:** ప్రత్యర్థుల పోటీదారుల నుండి ఊహించిన విధంగానే పోటీలు ఎదురవుతాయి. నూతన విద్యావకాశాలు.

**మకరం:** విద్యార్థినీ, విద్యార్థులు మేధస్సుకు పదును పెట్టి, విద్యాపరంగా అభివృద్ధిని సాధిస్తారు. మిత్ర వర్గం పెరుగుతుంది.

**కుంభం:** తాత్కాలిక అవసరాలకన్నా భవిష్యత్తుకు తత్సంబంధిత విషయ వ్యవహారాలకు ప్రాముఖ్యతనిస్తారు.

**మీనం:** రాజు కన్నా ! మొండివాడు బలవంతుడన్న సామెత గుర్తుకు వచ్చే విధంగా ప్రవరిస్తారు. వాహన సౌఖ్యం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# వాతావరణంలో అనూహ్య మార్పులు

**రాష్ట్రంలో బెంబేలెత్తిపోతున్న రైతులు**

**ప్రస్తుతం కంకి ఈనె దశలో వరి పంట**

**నేల రాలనున్న మామిడి.. నేల వాలనున్న మొక్కజొన్న**

**కల్లాల్లో ఉన్న వేరుశనగ, మిర్చి పంట దిగుబడులు**

**20 వరకు పలు జిల్లాలకు వర్ష సూచన**

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** వాతావరణంలో చోటు చేసుకుంటున్న అనూహ్య మార్పులతో రాష్ట్రంలోని అన్నదాతలు బెంబేళెత్తిపోతున్నారు. నిన్నమొన్నటి వరకు ఎండలు దంచికొట్టగా ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై చల్లని గాలులువీచాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 20 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రంహెచ్చరించింది. ఉత్తర, పశ్చిమ జిల్లాల్లో 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. అయితే వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ సమాచారంతో ప్రజలు కాసింత ఉపశమనం పొందుతున్నా రైతులు మాత్రం బెంబేళెత్తిపోతున్నారు. ప్రస్తుతం రైతులు సాగు చేసిన యాసంగి పంటలు చేతికొచ్చే సమయం కావడంతో ఈ సమయంలో ఈదురుగాలులు, వర్షాలతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. ప్రస్తుతం వేరుశనగ, మిర్చి, పసుపు తదితర పంటలు కొన్ని ప్రాంతాల్లో కోత దశలో ఉండగా మరికొన్ని ప్రాంతాల్లో కల్లాల్లో ఉన్నాయి. ఇలాంటి సమయంలో వర్షాలు పడితే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ప్రస్తుతం యాసంగి వరి పంట కంకి ఈనేద దశలో ఉంది. ఈ దశలో అకాల వర్షాలు,వ డగళ్లు కురిస్తే తాలు పోయే ప్రమాదముందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మామిడి, టమాట, కూరగాయలతోపాటు మొక్కజొన్న సాగు చేసిన రైతులకు కూడా తీవ్ర నష్టం వాటిల్లనుంది. ఈ నెల 17వరకు ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు హెచ్చరించింది.

పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, పిడుగులు, ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వానలుకూడా పడే అవకాశం ఉందని రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.

ప్రధానంగా ఉత్తర, పశ్చిమ జిల్లాలైన నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. సోమవారం హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మేడ్చల్, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కేవలం వర్షమే కాకుండా, సెకనుకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో వీచే బలమైన గాలులు, భీకరమైన ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వానలు ప్రజలను బెంబేలెత్తించనున్నట్టు తెలిపింది. ముఖ్యంగా మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు ఈ వర్షాల ప్రభావం అత్యంత తీవ్రంగా ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. అదేవిధంగా హైదరాబాద్‌లో మార్చి 18 19 తేదీల్లో మధ్యాహ్నం నుంచి తెల్లవారుజాము వరకు ఎడతెరిపి లేని భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున, ట్రాఫిక్ ఇబ్బందులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే ముప్పు ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. దాదాపు నెలన్న రోజులుగా తెలంగాణలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. ఉదయం 9గంటల దాటితే బయటకు రావాలంటే ఎండ తీవ్రతతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి పరిస్థితి నెలకొంది. మధ్యాహ్నం సమయంలో ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. సాయంత్రం సమయంలో ఉక్కపోతతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 20 వరకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ సమాచారంతో ప్రజలు ఊరట చెందుతున్నారు. అయితే ముఖ్యంగా వర్షాలు పడే సమయంలో పిడుగులు పడే అవకాశం ఉందని, ఈదురు గాలులు వీస్తాయని, ఆ సమయాల్లో ప్రజలు చెట్ల కింద, హోర్డింగ్‌లు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు ఉండే ప్రాంతాల్లో ఉండొద్దని, సురక్షి త ప్రాంతాల్లోకి వెళ్లాలని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.



## ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం

**అత్తాపూర్‌లో రూ. 250 కోట్ల ప్రభుత్వభూమి స్వాధీనం**

**అత్తాపూర్ (హైదరాబాద్), మార్చి 15, ప్రభాతవార్త :** సర్కార్ భూముల ఆక్రమణలపై హైడ్రా అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. విలువైన ఆస్తులను ఆక్రమణల చెర నుంచి విముక్తి కలిగించడానికి ఆపరేషన్ ల్యాండ్ ప్రొటెక్షన్ కొనసాగుతుంది. ఇందులో భాగంగా అత్తాపూర్ రెవెన్యూ పరిధిలోని 354/1 సర్వే నంబర్‌లో 250 కోట్ల భూమిని హైడ్రా, రెవెన్యూ అధికారులు ఆదివారం స్వాధీనపరుచుకున్నారు. ప్రైవేట్ వ్యక్తుల ఆధీ నంలో ఉన్న భూమిని తీవ్రఉద్రిక్త పరిస్థితుల నడుమ సర్కారు ఆధీనంలోకి తీసుకున్నారు. కొన్నిరోజులుగా రాంబాగ్, శివాలయం మధ్యన ఉన్న ఈ స్థల వివాదం ఆందోళనకు దారితీసింది. స్థానిక ప్రజలు దీనిపై ఆందోళనకు దిగడంతో గురువారం హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్‌తోపాటు రెవెన్యూ అధికారులు వివాద స్థలాన్ని పరిశీలించి సదరు స్థలం ప్రభుత్వ భూమి అని రంగనాథ్ స్పష్టం చేశారు. ఒక మతం పేరిట స్థలాన్ని స్వాధీనం చేసుకున్న వారికి కూడా ఆయన నచ్చజెప్పారు. దీనిపై తీవ్రఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడుతుండటంతో అధికారులు అప్రమత్త మయ్యారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలు, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సూచనతో అధికారులు తెల్లవారుజామున భారీ బందోబస్తు నడుమ ఒక గ్రూప్ ఏర్పాటు చేసిన రేకులు, ప్రహరీ, నిర్మాణాలను తొలగించారు. అనంతరం ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేశారు. మత సెంటిమెంట్ దెబ్బ తినకుండా కొంతస్థలం వదిలారు. ఈ సందర్భంగా కొందరు అధికారులను అడ్డుకోవడానికి తీవ్రంగా ప్రయత్నించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయనంతో వ్యవహరించి పరిస్థితులు సద్దుమణిగేలా చర్యలు తీసుకున్నారు. విలువైన ప్రభుత్వస్థలాన్ని స్వాధీనం చేసుకోవడం పట్ల పాండురంగానగర్, హైదర్‌గూడ, అత్తాపూర్ ప్రాంతవాసులు సంతోషం వ్యక్తం చేశారు. తాము ఏ మతానికి వ్యతిరేకం కాదని, కానీ, ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించామని కొందరు పలు పార్టీలకు చెందిన నాయకులు వెల్లడించారు. రాజేంద్రనగర్ డిసిపి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ఎసిపి తుల శ్రీనివాస్ స్వీయపర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు.

# 22న యాసంగి రైతు భరోసా పంపిణీ

**మూడు విడతల కోసం ప్రభుత్వం ప్రణాళిక**

**సిద్ధిపేట జిల్లా నర్మెట్ట వేదికగా ప్రారంభించనున్న సిఎం రేవంత్**

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. ఎన్నికల వాగ్దానంలో భాగంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా పథకం నిధులను ఈ నెల 22వ తేదీన విడుదల చేసేందుకు ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసినట్టు తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించ నున్నారు. తొలి విడత నిధుల విడుదల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది రైతుల ఖాతాల్లో నేరుగా నగదు జమ కానుంది. గత కొంతకాలంగా ఈ నిధుల కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఇది పెద్ద ఊరటనిచ్చే అంశం. సిద్దిపేట జిల్లా నర్మెట్ట వేదికగా యాసంగి రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పర్యటనలో భాగంగా మొదటి విడత నిధులను అధికారికంగా విడుదల చేస్తారు. ఇందుకోసం అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మొదటి విడతలో భాగంగా ఎకరం లోపు వ్యవసాయ భూమి ఉన్న 70 లక్షల రైతుల ఖాతాల్లో నగదు జమ కానుంది. గత ప్రభుత్వం అందించిన రైతుబంధు స్థానంలో, పెంచిన పెట్టుబడి సాయంతో రైతు భరోసాను అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నిధుల విడుదల ద్వారా సాగు పనులకు అవసరమైన ఖర్చుల కోసం రైతులకు ఆర్థిక భరోసా లభించనుంది. కాగా.. రైతులకు పంటల సాగు సమయంలో ఆర్థికంగా అండగా నిలిచేందుకు తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ప్రతీయేటా రెండు విడతల్లో ఎకరాకు రూ.6వేల చొప్పున నిధులు విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ రబీ సీజన్‌కు సంబంధించి జనవరిలో రైతు భరోసా నిధులు రైతుల బ్యాంక్ ఖాతాల్లో వేస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల కారణంగా ఆలస్యమయింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి మున్సిపల్ ఎన్నికల తర్వాత రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తామని తెలిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రైతు భరోసా నిధుల విడుదలపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతోపాటు ఉన్నతాధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ నెల 22న మొదటి విడతలో సుమారు రైతుల ఖాతాల్లోకి రూ.3,590 కోట్లను ప్రభుత్వం జమ చేయనుంది. ఒక ఎకరం వరకు ఉన్న రైతులకు ఈ విడతలో రైతు భరోసా నిధులు అందనున్నాయి.

మొదటి విడత విడుదలైన 20 రోజుల తర్వాత రెండో విడత నిధులను విడుదల చేయనున్నారు. ఈ దశలో సుమారు రూ.2,650 కోట్లను రైతుల ఖాతాల్లోకి బదిలీ చేయాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. అలాగే ఏప్రిల్ నెలాఖరులోగా మూడో విడత నిధులను కూడా విడుదల చేసి ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మూడు విడతల్లో కలిపి దాదాపు రూ.9,000 కోట్ల రైతు భరోసా నిధులు రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఖాతాల్లోకి చేరనున్నాయి.

## నిజామాబాద్‌లో బెట్టింగ్ యాప్‌కు బానిసై యువకుడి ఆత్మహత్య

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌కు బానిసగా మారిన ఓ యువకుడు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యకు పాల్పడ్డ వైనం నిజామాబాద్ జిల్లాలో సంచలనం రేపింది. వివరాలు ఇలా వున్నాయి. డిచ్‌పల్లి మండలం నడిపల్లి తండాకు చెంఇన బదావత్ అరుణ్ అనే యువకుడు తెలంగాణ యూనివర్శిటీలో చిరుద్యోగిగా పని చేస్తున్నాడు. కొంతకాలంగా అరుణ్ ఆన్‌లైన్ గేమింగ్‌తో పాటు బెట్టింగ్‌కు బానిసగా మారాడు. ఈ క్రమంలో అందిన ప్రతీచోట అప్పులు చేసి, ఆఖరుకు తన బైక్‌ను కూడా తాకట్టుపెట్టాడు. అయినా అప్పులు తీరక పోవడంతో ఇంట్లో గొడవలకు దిగాడు. బైక్‌ను తనఖా పెట్టిన విషయమై అరుణ్‌ను తల్లి నిలదీసింది. దీంతో శనివారం రాత్రి తన ఇంట్లో ఎవరు లేని సమయంలో అరుణ్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై సమాచారం అందిన వెంటనే అరుణ్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. డిచ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆరు నెలల క్రితమే అరుణ్ తండ్రి అనారోగ్యంతో చనిపోవడం, ఇప్పుడు అందివచ్చిన కుమారుడు కూడా ఆత్మహత్యకు పాల్పడడంతో అతని తల్లి ఆవేదన అందరిని కలచివేసింది.

## మధుయాష్కి ఇంటికి వెళ్లిన వేం నరేందర్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన వేం నరేందర్‌రెడ్డి ఆదివారం మాజీ ఎంపి, పిసిసి ప్రచారకమిటీ చైర్మన్ మధు యాష్కి ఇంటికివెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మధుయాష్కిగౌడ్ వేం నరేందర్‌రెడ్డిని శాలువాతో సత్కరించి, రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైనందుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల సమస్యలను రాజ్యసభలో సమర్థవంతంగా ప్రస్తావిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షి ంచారు. ఈ సమావేశంలో తాజా రాజకీయ పరిస్థి తులు, ప్రజా సమస్యలు, కాంగ్రెస్ పార్టీ బలోపేతం వంటి అంశాలపై ఇద్దరు నేతలు చర్చించుకున్నారు. ఇదిలా ఉంటే ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గం నాగరకర్నూల్ ఎంపి మల్లు రవి ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఎన్నికైన వేం నరేందర్‌రెడ్డి ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలపుతూ శాలువాతో సన్మానించారు.



## లోయలో పడిపోయిన బస్సు

**ఏడుగురు భారత్ యాత్రీకులు దుర్మరణం**

**మరో ఏడుగురికి గాయాలు**

**కఠ్మాండు, మార్చి 15:** నేపాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మనకమాన ఆలయాన్ని దర్శించుకుని తిరిగి వస్తున్న భారత యాత్రికుల బస్సు లోయలో పడిపోవడంతో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాద ఘటన గోర్ఖా జిల్లాలో జరిగింది. గోర్ఖా జిల్లాలోని షాహిద్ లఖన్ రూరల్ మున్సిపాలిటీ పరిధిలోని కాంతార్ ప్రాంతంలో బస్సు అదుపుతప్పి లోయలో పడిపోయిందని జిల్లా పోలీస్ అధికారి, డీఎస్పీ రాజ్ కుమార్ శ్రేష్ఠ తెలిపారు. ప్రమాద సమయంలో బస్సులో డజనుకు పైగా ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం భరత్‌పూర్‌లోని చిత్వాన్ మెడికల్ కాలేజీకి తరలించినట్లు ఆయన చెప్పారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. మనకమాన ఆలయం నుంచి తనాహు జిల్లాలోని అన్‌బుఖైరేని వైపు బస్సు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని గోర్ఖా చీఫ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ తులసి బహదూర్ శ్రేష్ఠ తెలిపారు. నిటారుగా ఉన్న రహదారిపై ఎలక్ట్రిక్ మైక్రోబస్సు అదుపు కోల్పోవడం వల్లే ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రమాదానికి కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. నేపాల్‌లో ఇటీవలి కాలంలో రోడ్డు ప్రమాదాలు ఆందోళనకరంగా పెరుగుతున్నాయి. 2024 ఆగస్టులో ఇదే ప్రాంతంలో జరిగిన మరో బస్సు ప్రమాదంలో 27 మంది భారత యాత్రికులు మరణించిన విషయం తెలిసిందే.

## ఆస్తులు కొల్లగొట్టిన వ్యక్తిపై ఐఎఎస్ రాధికారస్తోగి ఫిర్యాదు

**ఐపిఎస్ తండ్రిని మోసం చేశాడని ఆరోపణ**

**పోలీసులు కేసు నమోదు**

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), మార్చి 15, ప్రభాతవార్త:** చిన్ననాటి నుంచి ఆశ్ర యం ఇచ్చిన వ్యక్తి తమ కుటుంబసభ్యులను నమ్మించి ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డారంటూ ఒక విశ్రాంత ఐపిఎస్ కుమార్తె అయిన మహారాష్ట్ర కేడర్‌కు చెందిన ఐఎఎస్ రాధికారస్తోగి చేసిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీ సులు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై ముంబైలోని కఫ్ఫీ పెరేడ్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన జీరో ఎఫ్‌ఐఆర్ బదలీ నేపథ్యంలో జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఈ కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో నివసించిన విశ్రాంత ఐపిఎస్ అధికారి పేరం వెంకయ్య 1995లో ప్రశాసన్‌నగర్‌లో ఇంటి నిర్మాణం చేపట్టే సమయంలో కూలీగా పనిచేసే ఓ వ్యక్తి కుమారుడు విజయ్‌కు మానవతా దృక్పథంతో ఆశ్రయమిచ్చి చదువు, జీవన వ్యయాలు భరిం చారు. ఈ క్రమంలోనే అతడు ఐపిఎస్ కుటుంబానికి చాలా నమ్మకస్తుడిగా మారాడు. దీంతో విజయ్‌కు వారే దగ్గరుండి క్రాంతి అనే మహిళతో వివా హం చేయడమే కాకుండా ఇంట్లోనే ఆశ్రయం ఇచ్చారు.

అయితే 2015లో పేరం వెంకయ్య గాయపడటం, ఆయన ఆరోగ్యం క్షీ ణించడంతో విజయ్ కుటుంబ ఆర్థిక వ్యవహారాలపై పూర్తి నియంత్రణ సాధించినట్లు రాధికారస్తోగి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. బ్యాంకు ఖాతాలు, ఎటిఎం కార్డులు, చెక్‌బుక్‌లను తన ఆధీనంలోకి తీసుకుని అనుమతి లేకుండా రూ.27,51,766 వరకు అనుమానాస్పదంగా ఉపసంహరించుకున్నట్లు గుర్తించారు. వెంకయ్య మరణానికి ఒకరోజు ముందు రూ.40 వేలను చెక్కును నగదుగా మార్చినట్లు గుర్తించారు. వెంకయ్య చివరిరోజుల్లో ఆయనకు సరైన వైద్యసంరక్షణ ఇవ్వకుండా నిర్లక్ష ్యం చేశారని, ఆరోగ్యం క్షీ ణించిన విషయాన్ని పిల్లలమైన తమకు ఎవరికి తెలియజేయలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ తండ్రి మరణం తరువాత ఆయన వ్యక్తిగత డైరీలు, కొన్ని పత్రాలు, ఇంట్లోని నగదు, కొంత బంగారం కూడా కనిపించ లేదన్నారు. విజయ్ తనను వెంకయ్య దత్త పుత్రుడిగా పరిచయం చేసుకుంటూ వివిధ వ్యాపారాలు, ఆస్తులు కూడ బెట్టుకున్నట్లు అనుమానాలున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాధికా రస్తోగి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సంపంగి విజయ్, అతని భార్య క్రాంతి వారి అను యాయులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అంగన్‌వాడీల్లోనూ ఒంటిపూట బడులు!

**ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం**

**ఏప్రిల్ 23 వరకు సగం రోజే ఆ కేంద్రాలు**

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అంగన్వాడీ కేంద్రాలను కూడా ఒంటిపూట మాత్రమే నిర్వ హించాలని ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా పాఠశాల విద్యాశాఖ మార్చి 16 నుంచి ఒంటిపూట బడులను అమలు చేస్తోంది. అదే తరహాలో అంగన్వాడీలు కూడా ఇకపై ఉదయం వేళల్లోనే పనిచేయనున్నాయి. ఈ కొత్త నిబంధనలు ఏప్రిల్ 23 వరకు అమల్లో ఉంటాయని అధికారులు స్పష్టం చేశారు. మండుతున్న ఎండల కారణంగా మధ్యాహ్నం వేళ చిన్నారులు ఇంటికి వెళ్లడం ఇబ్బందికరంగా మారుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు.

ఏప్రిల్ 23 తర్వాత వేసవి తీవ్రతను బట్టి సుమారు నెలరోజులపాటు వేసవి సెలవులను ప్రకటించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. దీనిపై మరికొన్ని రోజుల్లో అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

అయితే సెలవులు ప్రకటించినా చిన్నారులు, గర్భిణులకు అందాల్సిన పౌష్టికా హారంలో ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చి భోజనం చేయలేని వారికి టేక్ హోమ్ రేషన్ పద్ధతిలో నేరుగా వారి ఇళ్లకే రేషన్‌ను చేరవేసే ప్రక్రియను మరింత పటిష్టం చేయనున్నారు. తద్వారా వేసవిలో కూడా పౌష్టికాహార పంపిణీ నిరంతరాయంగా కొనసాగుతుందని అధికారులు తెలిపారు.




## పిఎన్జీ కనెక్షన్ ఉంటే ఎల్పీజి వదులుకోవాల్సిందే!

**కేంద్ర పెట్రోలియం శాఖ నోటిఫికేషన్**

**న్యూఢిల్లీ, మార్చి 15:** ఇరాన్‌పై యుద్ధం భారత్‌లో వంటగ్యాస్ (ఎల్పీజీ) ఆందోళనల్ని పెంచుతోంది. యుద్ధం వల్ల ఎల్పీజీ కొరత ఏర్పడుతుందనే భయంతో ప్రజలు పానిక్ బుకింగ్స్ చేస్తున్నారు. సాధారణం కన్నా ప్రతీ రోజు 25 లక్షల సిలిండర్లు ఎక్కువగా బుక్ అవుతున్నట్లు కేంద్ర ఇప్పటికే ప్రకటించింది. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, దేశంలో చమురు, గ్యాస్ కొరత లేదని చెబుతున్నా ప్రజల్లో భయాలు ఇంకా తగ్గడం లేదు. ఈ సంక్షోభం నేపథ్యంలో కేంద్రం కొందరికి షాక్ ఇచ్చింది. పైప్డ్ నేచరల్ గ్యాస్ పిఎన్జీకనెక్షన్ మరియు డొమెస్టిక్ లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ) కనెక్షన్ రెండూ ఉన్నవారు రెండో దాన్ని సరెండర్ చేయాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఏదైనా ప్రభుత్వ చమురు కంపెనీ లేదా పంపిణీదారుడు ద్వారా వారికి సిలిండర్ రీఫిల్ బుకింగ్స్ నిలిపేయాలని పెట్రోలియం మరియు సహజ వాయువు మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. నోటిఫికేషన్ ప్రకారం ఇంట్లో పైప్డ్ నేచరల్ గ్యాస్ (పీఎన్జీ) కనెక్షన్ ఉన్న కుటుంబాలు తమ వద్ద ఉన్న డొమెస్టిక్ ఎల్పీజీ కనెక్షన్‌ను వెంటనే సరెండర్ చేయాలని కేంద్ర పెట్రోలియం శాఖ ఆదేశించింది. పీఎన్జీ కనెక్షన్ ఉన్నవారు ఇకపై సిలిండర్ రీఫిల్స్ బుక్ చేయకూడదని, ప్రభుత్వ చమురు సంస్థల నుంచి కొత్త ఎల్పీజీ కనెక్షన్లు తీసుకోవడంపై కేంద్రం నిషేధించింది. ఈ నిబంధనలు తక్షణమే అమలులోకి వస్తాయని ప్రభుత్వం నోటిఫికేషన్ పేర్కొంది. ఇరాన్, ఇజ్రాయిల్అమెరికా యుద్ధం కారణంగా హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. దీంతో గల్ఫ్ ప్రాంతాల నుంచి చమురు, గ్యా సరఫరాలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. భారత్ తన ఎల్పీజీ అవసరాల్లో 60 శాతం దిగమతి చేసుకుంటుంది. ఇందులో 85-90 శాతం సౌదీ, ఖతార్ వంటి గల్ఫ్ దేశాల నుంచి వస్తోంది. ఈ కారణంగా దేశంలో ఎల్పీజీ సంక్షోభం ఏర్పడింది.



## పశ్చిమాసియా దేశాల్లో సిబిఎస్ఇ పరీక్షలు రద్దు

**న్యూఢిల్లీ, మార్చి 15:** పశ్చిమాసియా దేశాల్లో భారతీయ విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) ఒక కీలక నిర్ణయం తీసుకుంది. అనిశ్చిత పరిస్థితుల కారణంగా ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన పరీక్షలను బోర్డు ఇప్పుడు పూర్తిగా రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. గల్ఫ్ రీజియన్‌లోని ప్రధాన దేశాల్లో నివసిస్తున్న భారతీయ విద్యార్థులకు ఈ నిర్ణయం వర్తిస్తుంది. బహ్రెయిన్, ఇరాన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాల్లో ఈ పరీక్షలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈనెల 16 నుంచి ఏప్రిల్ 10 మధ్య జరగాల్సిన 12వ తరగతి ప్రధాన పరీక్షలతో పాటు, వాయిదా పడిన పది ఇతర పరీక్షలను కూడా రద్దు చేశారు. దాడుల కారణంగా నిర్వహించలేకపోయిన పదో తరగతి పరీక్షలను కూడా రద్దు చేసినట్లు బోర్డు స్పష్టం చేసింది. పరీక్షలు జరగని పక్షంలో విద్యార్థుల ప్రతిభను ఎలా అంచనా వేస్తారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. దీనిపై సీబీఎస్ఈ స్పందిస్తూ ఫలితాల గణన ప్రక్రియను త్వరలోనే వెల్లడిస్తామని పేర్కొంది. విద్యా నిపుణుల అంచనా ప్రకారం ఈ క్రింది అంశాల ఆధారంగా గ్రేడింగ్ ఇచ్చే అవకాశం ఉంది. పాఠశాల స్థాయిలో నిర్వహించిన యూనిట్ టెస్టులు, బోర్డు పరీక్షలకు ముందు జరిగిన మాక్ ఎగ్జామ్స్ మార్కులు, విద్యార్థులు సమర్పించిన ప్రాజెక్ట్ వర్క్ , ల్యాబ్ పరీక్షల పనితీరు, విద్యా సంవత్సరం పొడవునా విద్యార్థి చూపిన ప్రతిభ ఆధారంగా ఫలితాలను ఇవ్వనున్నారు.

## ఫాస్టాగ్ వార్షిక పాస్ ధర రూ.3,075కి పెంపు

**న్యూఢిల్లీ, మార్చి 15:** దేశంలో నేషనల్ హైవేలపై ప్రయాణించే ప్రయాణికులకు ఏప్రిల్ 1 నుంచి ఫాస్టాగ్ వార్షిక పాస్ ధరలు పెరుగుతున్నాయి. జాతీయ రహదారులపై టోల్ చెల్లింపులను సులభతరం చేసే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఫాస్టాగ్ వార్షిక పాస్ పథకం ఇప్పుడు కాస్త ప్రియం కానుంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ ఈ పాస్ ధరలో స్వల్ప పెంపును అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ జారీ చేసిన అధికారిక ఉత్తర్వు ప్రకారం, ఏప్రిల్ 1 నుండి, ప్రైవేట్ వాహనాల ఫాస్టాగ్ వార్షిక పాస్ ధరను రూ.3,075కు పెంచారు. ఇంతకుముందు, ఈ ధర రూ.3వేలుగా ఉండేది. ఈ పాస్ ప్రైవేట్ కార్లు, జీపులు, వ్యాన్‌ల వంటి వాణిజ్యేతర వాహనాలకు వర్తిస్తుంది. రహదారులపై పదే పదే టోల్ చెల్లించాల్సిన ఇబ్బందిని తొలగించడం, డిజిటల్ పద్ధతిలో టోల్ వసూళ్లను ప్రోత్సహించడం దీని ప్రధాన లక్ష్యం. ఫాస్టాగ్ కలిగిన ఏ ప్రైవేట్ వాహనమైనా ఈ పాస్‌ను కొనుగోలు చేయడానికి అర్హత కలిగి ఉంటుంది. ఒకసారి యాక్టివేట్ అయిన తర్వాత, ఈ వార్షిక పాస్ ఒక సంవత్సరం పాటు లేదా గరిష్టంగా 200 ప్రయాణాల వరకు చెల్లుబాటు అవుతుంది, ఈ రెండింటిలో ఏది ముందుగా పూర్తయితే అంతవరకు ఇది వర్తిస్తుం ది. ప్రస్తుతం, దేశవ్యాప్తంగా 5 మిలియన్లకు పైగా వాహన యజమానులు ఫాస్టాగ్ వార్షిక పాస్‌ను వినియోగిస్తున్నారు. జాతీయ రహదారులపై ప్రైవేట్ కార్లకు సంబంధించిన మొత్తం టోల్ లావాదేవీలలో సుమారు 28 శాతం ఇప్పుడు ఈ వార్షిక పాస్ ద్వారానే జరుగుతున్నాయి. నేషనల్ హైవేలపై తరుచుగా ప్రయాణించే వ్యక్తులు ఈ పథకంలో లబ్ధి పొందుతున్నారు. భారతదేశంలో ఫాస్టాగ్ విధానం తొలిసారిగా 2016లో ప్రవేశపెట్టారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఇప్పటి వరకు మారు 118.6 మిలియన్ల ఫాస్టాగ్స్ జారీ చేసారు. సుమారు 59 మిలియన్ల ఫాస్టాగ్స్ ప్రస్తుతం యాక్టీవ్‌గా ఉన్నాయి. ప్రస్తుతం జాతీయ రహదారులపై టోల్ ద్వారా వచ్చే ఆదాయంలో 98 శాతానికి పైగా వీటి ద్వారానే వసూలు అవుతుంది. మీరు జాతీయ రహదారులపై తరచుగా ప్రయాణించేవారై ఉండి, ఇంకా ఫాస్టాగ్ వార్షిక పాస్ లేకుంటే, మీరు దీనిని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఎఐ), రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ అధికారిక వెబ్‌సైట్ల ద్వారా గానీ, లేదా రాజ్‌మార్గ్‌యాత్రే మొబైల్ అప్లికేషన్ ద్వారా గానీ కొనుగోలు చేయవచ్చు. ఇప్పటికే ఉన్న పాస్‌లను కూడా ఇదే పద్ధతులను ఉపయోగించి పునరుద్ధరించుకోవచ్చు. వినియోగదారులు తమ ఫాస్టాగ్‌కు లింక్ అయిన అకౌంట్‌లో లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. వాహన రిజిస్ట్రేషన్ నంబర్, మొబైల్ నంబరును నమోదు చేయాల్సి ఉంటుంది. దీని తర్వాత యుపిఐ, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లింపు చేయవచ్చు. చెల్లింపు పూర్తయిన వెంటనే, ఆ పాస్ నేరుగా ఫాస్టాగ్‌కు లింక్ అవుతుంది. సాధారణంగా 24 గంటలలోపు యాక్టివేట్ అవుతుంది. వాహన యజమాని ఒక సంవత్సరం పాటు లేదా గరిష్టంగా 200 టోల్ ప్రయాణాల వరకు దీని ప్రయోజనాలను పొందవచ్చు.



వార్త


మనస్సును ఆరోగ్యకరమైన ఆలోచనలతో నింపండి. అవే జీవితాన్ని సుఖమయం చేస్తాయి.

-విల్‌కిన్స్

# కారుణ్య మార్గం

తీవ్రమైన నయం కాని వ్యాధితో బాధపడుతున్నవ్యక్తి జీవితం ఇక కొనసాగించలేని, అలా అని స్వచ్ఛంద మరణం పొందలేని పరిస్థితుల్లో వారి ఆత్మీయులు ఈ విషయాన్ని బయటికి చెప్పి వారి ఆకస్మిక మరణానికి దారిచూపవచ్చు. అదే వైద్య పరిభాషలో 'యుథనేసియా' అంటారు. మరణం ఎలాంటిదైనా చావలేక బతుకలేక చచ్చేటంతటి నరకబాధను అనుభవిస్తూ ఆత్మీయులకు తీవ్రవేదన కల్పిస్తున్న దశలో 'కారుణ్య మరణం కోరడం సబబే అని ప్రపంచంలోని 27 దేశాలు చట్టాలు చేశాయి. అయితే దానికీ ఎన్నో నియమ నిబంధనలు, ఆటంకాలు, అడ్డంకుల ఆలోచనలు మానవ మస్తిష్కంలో ఉదయిస్తారు. అలాంటి సంఘర్షణ ఒకటి సుప్రీంకోర్టు ధర్మాసనం ముందుకు వచ్చింది.ఎంతో కారుణ్యమున్నా ఇలాంటి సందర్భాల్లో చట్ట పరిధిలో నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినప్పుడు ఎంతటి వారికైనా మనసు వ్యార్థ్యంగా మారి ఉంటుంది. అందుకే 13ఏళ్లకు పైగా కోమాలో ఉన్న 32 ఏళ్ల హరీష్ రాణాకు 'పరోక్ష కారుణ్య మరణాన్ని' ప్రసాదిస్తూ తీర్పు వెలువరించిన సందర్భంలో జస్టిస్ పార్థీవాలా కంటనీరు చెమ్మగిల్లింది. అంటే ఇలాంటి అంశాల్లో నిర్ణయం తప్పనిసరైనప్పుడు బాధ తప్త హృదయాలతోనే తీర్పు ఇవ్వడం జరిగే విషయమే. 'జీవితం ఎంత క్షణభంగురమో తెలిసొచ్చినా ప్రేమ, కారుణ్యం ఆధారంగానే తప్ప హేతుబద్ధత, తర్కాలతో నిర్ణయం జరుగదు. కృత్రిమ పద్ధతుల్లో జీవితాన్ని నిరర్థకంగా పొడిగించాల్సిన అవసరముండదు. ఎంత వైద్యం చేసినా సజీవంగా ఉంచామన్న పేరుకే తప్ప ఏ జీవికి చావును తప్పించలేమన్నది 'ధర్మాసనం' అభిప్రాయపడింది. ఈఅంశంపై మనకు ప్రత్యేక చట్టాలులేవు.సుప్రీంకోర్టు నిర్ణయం సంచలనాత్మకమే. మిశ్రమ అభిప్రాయాలు వెలిబుచ్చినా వైద్య చికిత్సలు కొనసాగిస్తూ మనుడకు ప్రాణం పోయడమే తప్ప ఏ వ్యక్తికీ సజావైన జీవితాన్ని ఇవ్వలేరు. రోగి కోలుకునే అవకాశం ఏమాత్రమూ లేదని ఎందరో వైద్య నిపుణులు, ఎన్నో మెడికల్ బోర్డులు తేల్చి చెప్పాయి. హరీష్ తండ్రి వైద్యంద్వారా తన కుమారుడిని బతికించుకోవాలని చూసారు. 13ఏళ్లు కోమాలో ఉన్న హరీష్‌కుటుంబం యావత్తు బాసటగా నిలిచారు. నిస్వార్థ సేవలు చేస్తూ హరీష్ పట్ల అంతులేని ప్రేమ చూపేవారు. తండ్రి అశోక్ రాణా తన బిడ్డపడే నరక యాతనను చూడలేక 'పరోక్ష కారుణ్య మరణం' ప్రసాదించమని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. అంటే తన కుమారునికి వైద్యసేవలు నిలిపి వేసేందుకు అనుమతి అన్న మాట. ఈ పిటిషన్‌పై జస్టిస్ పార్థీవాలా, కె.వి విశ్వనాథన్‌లు ధర్మాసనం చరిత్రాత్మక తీర్పునిచ్చింది. ఈ తీర్పు మేరకు హరీష్‌కు ఒక క్రమపద్ధతిలో వైద్యాన్ని నిలిపివేసి అతడ్ని సహజ మరణం వైపునకు ప్రేరిపిస్తారు. అనంతరం అతని ప్రాణం అనంత వాయువుల్లో కలిసిపోతుంది. దేశంలో కారుణ్యమరణాన్ని కోర్టు ఆమోదించిన ప్రప్రథమ కేసు ఇదే అవుతుంది. ఎన్నో ఏళ్లుగా చర్చనీయాంశంగా ఉన్న ఇలాంటి 'యుథోనేసియా' ప్రక్రియపై 2018లో 'కామన్ కాజ్' కేసులో ప్రత్యేక పరిస్థితుల్లో పరోక్షకారుణ్య మరణాన్ని అనుమతించవచ్చునని రాజ్యాంగ ధర్మాసనం సూచించింది. అప్పట్లో 1973లో ముంబై కింగ్ అడ్వర్డ్ స్మారక మెమోరియల్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న అరుణ శాన్‌బాగ్‌పై లైంగిక దాడిజరిగింది. పెనుగులాటలో మెదడుకు ఆక్సిజన్ సరఫరా తగ్గిపోయి కోమాలోకి వెళ్లిపోతే ఆమె నాలుగు దశాబ్దాలపాటు ఆసుపత్రిలోనే ఉండిపోయింది. 2009లో పింకీ విరానీ అనే స్నేహితురాలు ఆమెదుస్థితి చూడలేకపోతున్నందున శాన్‌బాగ్‌కు కారుణ్య మరణానికి ఆదేశాలిమ్మని కోర్టును కోరింది. ఆసందర్భాన్నే ఉదాహరణగా తీసుకొని అప్పటి ధర్మాసనం కారుణ్యమరణం సమంజసమేనని, అందుకు పూర్తి అర్హతలున్న కేసే నని వ్యక్తంచేసింది. కానీ రోగి ఆత్మబంధువులు కాకుండా స్నేహితురాలు కోర్టును ఆశ్రయించడంతో దానినిసాంకేతిక కారణాలతో అభ్యంతరం పెట్టారు. 'యుథనేసియా'పై ఒక చట్టాన్ని తీసుకురావాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.జీవించే హక్కుతోపాటు గౌరవప్రదంగా తనువు చాలించడం కూడా రాజ్యాంగంలోని ఆర్టికల్ 21రీత్యా పరిగణనలోకి తీసుకోదగినదని కోర్టు అభిప్రాయపడింది. ముందుగా హరీష్‌కు కారుణ్య మరణం ప్రసాదించే విషయంలో ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. దాంతో అతని తల్లిదండ్రులు సుప్రీంకోర్టు తలుపు తట్టారు. పైపులద్వారా అందించే పోషకాహారం కూడా వైద్య చికిత్స కిందకే వస్తుంది కనుక వైద్యుల పరిశీలనానంతరం లైఫ్ సపోర్టు తోపాటు పోషకాహారాన్ని నిలిపివేయాలని ధర్మాసనం చెబుతోంది. తాజాగా మరో కేసులోఇక జీవించే అవకాశం లేదని వైద్యనిపుణులు భావించి 'బ్రెయిన్‌డెడ్'గా నిర్ణయించిన ఓ మహిళను ఇంటికి తీసుకెళ్తుండగా చలనం వచ్చి బతికింది.బ్రెయిన్‌డెడ్ మహిళ బతికి బట్టకట్టింది. ఆమెను ఇంటికి తీసుకెళ్తున్న అంబులెన్స్ రోడ్డు గుంతలోపడింది. మిగిలినవారు చెల్లాచెదురుగా కిందపడగా ఆమెలోకాస్తంత చలనం గమనించి ఆసుపత్రికి చేర్చి వైద్యసహాయం అందిస్తే లేచి కూర్చొంది. ఎంత అద్భుతం. మృత్యుంజయిగా పేర్కొనవచ్చు. తాజా సంఘటన మరోలా అన్వయించవచ్చు. ఈ ఉదంతం కూడా ఇకపై కారుణ్య మరణం కోసం తపించే అంశాలకు కొత్తదారి చూపించవచ్చు. అది లేకుంటే మరో మార్గాంతరం కోసం అన్వేషించనూవచ్చు. జీవచ్ఛవంలా బతుకుతున్న వారికి, వారి సేవలో అంటిపెట్టుకుని ఉండేవారికి ప్రస్తుత తీర్పు దిశానిర్దేశాన్ని సూచిస్తుంది. ఎన్నో ఏళ్లుగా చర్చల్లో ఉన్న 'యుథోనేసియా'కు కొత్త కొత్త సూచనలు బాసటగా ఉండే అవకాశం ఉంది.

ఇతరులు అనుసరించడానికి తమనే ఉదాహరణగా తీసుకోవాలని తమకు తామే ఎవరైతే అనుకుంటారో వారు అభివృద్ధి చెందలేరు.



గోల్డ్‌స్మిత్

అవినీతికి పాల్పడే వారికి చివరకు మిగిలేది ఆవేదనా, అవమానాలే!



సి. సిమ్మన్స్

# ప్రజావాక్కు



## గ్యాస్ కొరత లేకుండా చూడాలి

ఇరాన్ యుద్ధ ప్రభావంతో దేశ వ్యాప్తంగా గ్యాస్ కొరత ఏర్పడింది. ఇరాన్ నుండి గ్యాస్ దిగుమతి ఆగిపోవడంతో ఈ సమస్య తలెత్తింది. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో సరిపోనుగ్యాస్ ఉంది అంటూ సంబంధిత మంత్రి అంటున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించి గ్యాస్ నిల్వలపైఒక క్లారిటీ ఇస్తే బాగుంటుంది. ఏదిఏమైన ప్రజలకు ప్రభుత్వం నిర్ణయించిన ధరకే గ్యాస్ వచ్చే విధంగా రాష్ట్రప్రభుత్వం చొరవతీసుకోవాలి. తెలంగాణ, బెంగళూరులలో చాలా వరకు గ్యాస్‌లేక హోటల్స్‌లు బంద్ పెట్టుకున్నారు. వంట గ్యాస్ కూడా బుక్ కావడం లేదు. అతి కష్టంపై అయినా కూడా డెలివరీ కావడానికి రోజులు తరబడి ఎదురు చూడాల్సి వస్తుంది. గ్యాస్‌ఏజెన్సీల ముందు ప్రజలు బారులుతీరి గంటల కొద్దీ లైన్‌లో వేచి ఉంటున్నారు.టిఫిన్ సెంటర్స్‌లలో కూడాధరలువిపరీతంగా పెంచుతున్నారు.దీంతోమధ్యతరగతివారుఇబ్బందిపడుతున్నారు.

- మిద్దె సురేష్,నాగర్ కర్నూల్ జిల్లా

## అభివృద్ధి నష్టం కలిగించకూడదు

మూసీరివర్ ఫ్రంట్ పేరిట మూసి పరివాహక ప్రాంతంలోని ఇండ్లు కూల్చడం అన్యాయం అయితే ఒక ప్రాంతం నుండి వాళ్ళునిరాశ్రయులు అవుతున్నారు.అంటే ఏమిటి దాని అర్థం ఆ ప్రాంతంతో వాళ్ళ చారిత్రక మానసిక భౌతిక జ్ఞాపకాలు కోల్పోతున్నారు అన్నమాట. అయితే ఏ ప్రాంతంఅయినా అభివృద్ధికావాల్సిందే. అయితే అభివృద్ధి పేరిట ప్రజలను విస్తాపితం చేయడం,అది అభివృద్ధి అనిపించుకోదు. అభివృద్ధి అనేది మనుషులతో కలిసి ఉండాలి. ప్రజలకు నష్టం కలుగని రీతిలో ఉండాలి. దీనిని ఆపడం కోసం ప్రముఖ హక్కుల కార్యకర్త మేధా పాట్కర్ నడుం బిగించడం గొప్ప మలుపు.

- భారత అవినాష్, జనగామ

## దుష్ట రాజకీయాలు

అధికార పదవిలో కూర్చోవాలనుకునేవారుమిత్రుడు, హితుడు చుట్టం అనిచూడకూడదు. ఎవరినైనా ముంచేయాలి. వంచించాలి. వ్యతిరేకించేవారిని తనవైపు తిప్పుకోవాలి.ప్రతికూల పరిస్థితులను అనుకూలంగా మార్చుకోవాలి. సినీరంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చినఎన్టీఆర్‌కి ఇవేమీ తెలియవు.మంచి వారిలాగా నమ్మకస్తుల్లాగా నటిస్తూ తన వెనుక గోతులు తవ్విన వారిని కనిపెట్టలేకపోయారు.

- ఎమ్. జగన్నాథం, హైదరాబాద్

## ఇంధనం కోసం నిధులు కేటాయించాలి

నగరాల్లోని భోజనశాలలు, చిన్న తరహా పరిశ్రమలపై ప్రభావం చూపుతున్న వాణిజ్య గ్యాస్‌సరఫరా అంతరాయాలు భారతదేశ ఇంధన వ్యవస్థ బాహ్యఒత్తిళ్లకు ఎంత లోనవుతుందో స్పష్టంగా తెలియజేస్తున్నాయి.దిగుమతి చేసుకునేఇంధనాలపై మన దేశం ఎంతగా ఆధారపడి ఉందో ఈపరిస్థితి ఎత్తిచూపుతోంది. సౌర, పవన, జీవవాయువు వంటి పునరుత్పాదక ఇంధన వనరులపై మనం ముందే స్థిరమైన పెట్టుబడులు పెట్టి ఉంటే, సుదూర ప్రాంతాల్లో జరిగే భౌగోళిక రాజకీయ మార్పుల వల్ల మన ఆర్థిక వ్యవస్థ ఇంతగా ప్రభావితమయ్యేది కాదు. వికేంద్రీకృత జీవవాయువు వ్యవస్థలు, భవనాలపై సౌర విద్యుత్ ఉత్పాదన వంటి స్వచ్ఛ ఇంధన పరిష్కారాలు వంట గ్యాస్‌కు నమ్మకమైన స్థానిక ప్రత్యామ్నాయాలుగా నిలుస్తాయి. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పునరుత్పాదక ఇంధన మౌలిక సదుపాయాల కోసం బడ్జెట్‌లో మరిన్ని నిధులను కేటాయించాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ప్రజాపాలనా.. ప్రగతి ప్రణాళిక

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ప్రకటించే సంక్షేమ పథకాలపై పేద తెలంగాణ ఉద్యమకారులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు.విద్య, వైద్యం,రైతులు,రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ యువవికాసం ఉద్యోగస్తులు, వికలాంగులు, మహిళలు, అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వం ప్రకటించే సంక్షేమ పథకాల కోసం తెలంగాణ ఉద్యమకారులు ఎదురుచూస్తున్నారు. తెలంగాణ ఉద్యమకారుల కృషిఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలోఉద్యమకారులను గుర్తించి సన్మానించాలి.ఉద్యోగ తెలంగాణ ఉద్యమకారులకు స్పెషల్ స్టేట్ ఇంక్రిమెంట్ అమలు చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

## ఉద్యోగాల కోత

ఇప్పటి వరకు ఇంజనీరింగ్ విద్య చదివిన వారందరూ అధిక జీతాలకు ఆశపడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎగబడి దేశ విదేశాలలో ఉద్యోగాలు సంపాదించుకున్నారు. ఇంకా ఎంతో మంది ఎదురు చూస్తున్నారు.ఏటాలక్షల మందిదేశవ్యాప్తంగా ఇంజనీర్లు పుట్టుకు వస్తున్నారు.వీరందరికి ఉద్యోగాలు దొరకక ప్రయివేటు సంస్థలలోను చిన్నదో పెద్దదో ఎంతో కొంత జీతానికి పని చేస్తున్నారు. పెద్ద పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీల ఈమధ్య తమ సీనియర్ ఉద్యోగులను వేలసంఖ్యలో తొలగిస్తున్నారు.

- ఎం. నాగరాజు, కరీంనగర్‌జిల్లా

గమనిక : ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# కాలుష్యం నుంచి స్వచ్ఛత వైపు మూసీ

**ప్రాజెక్టు విజయవంతం కావాలంటే కేవలం నిర్మాణ పనులు సరిపోవు. నగరంలోని మురుగు కాల్వలను పూర్తిగా నియంత్రించాలి. పారిశ్రామిక వ్యర్థాల విడుదలను కట్టడి చేయాలి. ప్రజల్లో కూడా పర్యావరణ అవగాహన పెంచాలి. లేదంటే భారీ వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టు దీర్ఘకాలంలో ఆశించిన ఫలితాలు ఇవ్వకపోవచ్చు. మొత్తం మీద 7 వేల కోట్ల రూపాయల వ్యయంతో రూపొందుతున్న మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు హైదరాబాద్ నగర చరిత్రలో ఒక కీలక మైలురాయిగా నిలవవచ్చు. శాస్త్రీయ ప్రణాళిక, పారదర్శక అమలు, ప్రజల భాగస్వామ్యం ఉంటే మూసీ నది మళ్లీ జీవనదిగా మారే అవకాశం ఉంది. ఒకప్పుడు నగరానికి ప్రాణాధారంగా నిలిచిన మూసీ మళ్లీ అదే వైభవాన్ని సంతరించుకుంటే అది కేవలం పర్యావరణ విజయం మాత్రమే కాదు, హైదరాబాద్ నాగరికతకు కొత్త అధ్యాయం అవుతుంది.**



రామ కిష్టయ్య సంగన భట్ల

హైదరాబాద్ నగరానికి జీవనాడిగా ఒకప్పుడు ప్రవహించిన మూసీ నది, గత కొన్ని దశాబ్దాలుగా కాలుష్యం, నిర్లక్ష్యం, అశాస్త్రీయ నగరీకరణ కారణంగా కాలువల సమాహారంగా మారిపోయింది.ఒకప్పుడు నగరానికి తాగునీటి వనరుగా నిలిచిన ఈ నది ప్రస్తుతం పారిశ్రామిక వ్యర్థాలు, మురుగు నీటివల్ల తీవ్ర కాలుష్యానికి గురైంది. ఈపరిస్థితినిమార్చి మూసీని మళ్లీ పునరుద్ధరించేందుకు తెలంగాణ ప్రభుత్వం భారీ ప్రణాళికను రూపొందించింది. సుమారు 7 వేల కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టబోయే మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు సంబంధించి డీటెయిల్డ్‌ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్) సిద్ధమై అమలు దిశగాఅడుగులు వేస్తోంది. ఈ ప్రాజెక్టు కేవలం నదిని శుభ్ర పరచడమే కాదు, హైదరాబాద్ నగర పర్యావరణాన్ని మెరుగుపరచడం, వరద ప్రమాదాలను తగ్గించడం, నగర అభివృద్ధికి కొత్త దిశను చూపించడం వంటి లక్ష్యాలను ముందుంచుకుంది. మూసీనది చరిత్రను పరిశీలిస్తే, ఈ నది హైదరాబాద్ నగర నిర్మాణంలో కీలక పాత్ర పోషించింది. మూసీకి ఉపనదులైన ఈసా, ఇతర వాగులు కలిసే ప్రాంతాల్లో పూర్వం వ్యవసాయం అభివృద్ధి చెందింది. హైదరాబాద్ నగరాన్ని స్థాపించిన మహమ్మద్ కులీ కుతుబ్ షా కాలంలోనే మూసీ నగరానికి ప్రధాన జలవనరుగా ఉపయోగించబడింది. అయితే 1908 లో జరిగిన భారీ వరదలు నగరాన్ని అతలాకుతలంచేశాయి. ఆ వరదల తర్వాత నగరానికి వరదల నుంచి రక్షణ కల్పించేందుకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య రూపొందించిన ప్రణాళికల ప్రకారం ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలు నిర్మించబడ్డాయి. ఈ జలాశయాలు దశాబ్దాల పాటు హైదరాబాద్ నగరానికి తాగునీటి ప్రధాన వనరులుగా నిలిచాయి. కానీ 1980ల తరువాత హైదరాబాద్ వేగంగా విస్తరించడం ప్రారంభమైంది. ఐటిరంగం అభివృద్ధి, పారిశ్రామిక విస్తరణ, జనాభా పెరుగుదల కారణంగా నగరంలోమురుగు నీటి పరిమాణం పెరిగింది. నగరంలోని వందలాది కాలువలు, మురుగు కాల్వలు మూసీలోకి కలవడం ప్రారంభమైంది. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో రోజుకు సుమారు 2 వేల మిలియన్ లీటర్లకు పైగా మురుగు నీరు ఉత్పత్తి అవుతున్నదని అంచనా. అందులో గణనీయమైన భాగం సరైన శుద్ధి లేకుండానే మూసీ నదిలోకి చేరుతున్నదనే ఆందోళనలు ఉన్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళిక రూపొందించింది. మూసీ నది మొత్తం సుమారు 55 కిలోమీటర్ల పొడవున హైదరాబాద్ నగర పరిధిలో ప్రవహిస్తుంది. ఈ మొత్తంప్రాంతాన్ని ఐదు జోన్లుగా విభజించి అభివృద్ధి చేయాలని ప్రణాళిక రూపొందించారు. మొదటి దశలో సుమారు 20 కిలో మీటర్ల ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇందులో హిమాయత్ సాగర్ నుంచి బాపూఘాట్ వరకు సుమారు 9 కిలోమీటర్ల భాగం ప్రధానంగా అభివృద్ధి చేయబడనుంది. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో ప్రధానంగా నాలుగు అంశాలు కీలకంగా నిలుస్తాయి. మొదటిది కాలుష్య నియంత్రణ. నగరంలోని మురుగు కాల్వలు నదిలోకి చేరకుండా ఇంటర్ సెప్టర్ డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా సుమారు 3,100కోట్ల రూపాయల వ్యయంతో ట్రంక్ ఇంటర్ సెప్టర్ సీవర్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించారు. ఇది నగరంలోని ప్రధాన మురుగు కాల్వలను మళ్లించి శుద్ధి కేంద్రాలకు తరలిస్తుంది. రెండవది నీటి ప్రవాహాన్ని స్థిరంగా ఉంచడం. ప్రస్తుతం మూసీ నది ఎక్కువగా మురుగు నీటిపై ఆధారపడి ప్రవహిస్తున్నది. దీనికి పరిష్కారంగా గోదావరి జలాలను హైదరాబాద్‌కు తరలించే ప్రాజెక్టుల ద్వారా కొంత నీటిని మూసీ ప్రవాహానికి విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మల్లన్నసాగర్ నుంచి తాగునీటి సరఫరాతో పాటు మూసీ నదిని పునరుజ్జీవం చేయడానికి నీటిని మళ్లించే ప్రణాళిక కూడా సిద్ధమైంది. మూడవది పర్యావరణ పరిరక్షణ. నది తీరప్రాంతాల్లో భారీగా హరిత వనాలు, పార్కులు, ప్రజలకు విశ్రాంతి ప్రాంతాలు ఏర్పాటు చేయనున్నారు. నగరంలోని ప్రజలు నదిని ఆస్వాదించేందుకు వాకింగ్‌ట్రాకులు, సైక్లింగ్ మార్గాలు, వినోద కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రణాళిక ఉంది. నాలుగవది పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి. నది తీరాల వెంట సేవా రహదారులు, కొత్త వంతెనలు, ప్రజలకు సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా నగర ట్రాఫిక్ ఒత్తిడి తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు.ఈ భారీ ప్రాజెక్టుకు నిధుల సమీకరణ కూడా ముఖ్యమైన అంశంగా మారింది. ఆసియా అభివృద్ధిబ్యాంకు నుంచి సుమారు 4,100కోట్ల రూపాయల రుణాన్ని పొందేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అదనంగా కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నుంచి జాతీయ నది పరిరక్షణ పథకం కింద మరికొన్ని వేల కోట్ల రూపాయలు పొందేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రాజెక్టు అమలు కోసం ప్రత్యేకంగా మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అనే సంస్థను ఏర్పాటు చేశారు. ఈసంస్థ ప్రణాళిక రూపకల్పన, భూసేకరణ, నిర్మాణ పనుల పర్యవేక్షణ వంటి బాధ్యతలను నిర్వహిస్తుంది. అంతర్జాతీయ స్థాయి సలహాదారులతో కలిసి ప్రాజెక్ట్ మాస్టర్ ప్లాన్ రూపొందించబడింది.



అయితే ఈప్రాజెక్టుపై కొంతమంది పర్యావరణవేత్తలు,సామాజిక సంస్థలు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా నది తీరప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల పునరావాసం, భూసేకరణ ప్రక్రియ, పర్యావరణ ప్రభావం వంటి అంశాలపై చర్చలు జరుగుతున్నాయి. ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని ప్రాజెక్టును అమలుచేయాలని కొందరు కార్యకర్తలు సూచిస్తున్నారు. మరోవైపు నగరాభివృద్ధి నిపుణులు ఈ ప్రాజెక్టును హైదరాబాద్ భవిష్యత్తుకు కీలకంగా భావిస్తున్నారు. ప్రపంచంలోని అనేక నగరాలు తమనదులను పునరుద్ధరించి పర్యాటక కేంద్రాలుగా మార్చుకున్నాయి. ఉదాహరణకు లండన్‌లో థేమ్స్, అహ్మదాబాద్‌లో సబర్మతి నదీ తీర అభివృద్ధి నగరఅభివృద్ధికి దోహదపడింది. అదే తరహాలో మూసీ కూడా పునరుజ్జీవం అయితే హైదరాబాద్ నగరానికి పర్యావరణ పరంగా, ఆర్థికపరంగా పెద్ద ప్రయోజనం కలుగుతుందని విశ్లేషకులు అంటున్నారు. మూసీ నది శుద్ధి కావడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. మొదటగా నగర పర్యావరణం మెరుగుపడుతుంది.ప్రస్తుతం నదినుంచి వ్యాపిస్తున్న దుర్వాసన, దోమల సమస్యలు తగ్గే అవకాశం ఉంది. రెండవది వరదల ప్రమాదం తగ్గుతుంది. నది తీరాలను శాస్త్రీయంగా అభివృద్ధి చేస్తే భారీ వర్షాల సమయంలో నీటి ప్రవాహం సాఫీగా సాగుతుంది. మూడవది నగరానికి కొత్త వినోద ప్రాంతాలు ఏర్పడతాయి. అయితే ప్రాజెక్టు విజయవంతం కావాలంటే కేవలం నిర్మాణ పనులు సరిపోవు. నగరంలోని మురుగు కాల్వలను పూర్తిగా నియంత్రించాలి. పారిశ్రామిక వ్యర్థాల విడుదలను కట్టడి చేయాలి. ప్రజల్లో కూడా పర్యావరణ అవగాహన పెంచాలి.లేదంటే భారీ వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టు దీర్ఘకాలంలో ఆశించిన ఫలితాలు ఇవ్వకపోవచ్చు. మొత్తం మీద 7 వేల కోట్ల రూపాయల వ్యయంతో రూపొందుతున్న మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు హైదరాబాద్ నగర చరిత్రలో ఒక కీలక మైలురాయిగా నిలవవచ్చు.శాస్త్రీయ ప్రణాళిక, పారదర్శక అమలు, ప్రజల భాగస్వామ్యం ఉంటే మూసీ నది మళ్లీ జీవనదిగా మారే అవకాశం ఉంది. ఒకప్పుడు నగరానికి ప్రాణాధారంగా నిలిచిన మూసీ మళ్లీ అదే వైభవాన్ని సంతరించుకుంటే అది కేవలం పర్యావరణ విజయం మాత్రమే కాదు, హైదరాబాద్ నాగరికతకు కొత్త అధ్యాయం అవుతుంది. ●

# యుద్ధాలకు బలి అవుతున్న బాల్యం


డా. కె. రమాప్రభ

ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలు కేవలం దేశాల మధ్య పోరాటాలు కావు. అవి లక్షలాది బాలల జీవితాలను, కలలను, భవిష్యత్తును ధ్వంసం చేస్తున్న మానవ విపత్తులు. ఉక్రెయిన్, గాజా, ఇరాన్ వంటి ప్రాంతాల్లో బాంబులు పడుతున్నది కేవలం భవనాలపై కాదు – బాలల భవిష్యత్తుపై. ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా మొదటగా నశించేది మానవత్వం,ఎక్కువగా నష్టపోయేదిబాల్యం. బాంబులు పడుతున్నప్పుడు కూలిపోతున్నది కేవలం భవనాలు కాదు, వేలాది బాలల కలలు, భవిష్యత్తు కూడా. ఉక్రెయిన్, గాజా, ఇరాన్ వంటి ప్రాంతాల్లో కొనసాగుతున్న యుద్ధాలు లక్షలాది పిల్లలను అనాథలుగా, శరణార్థులుగా మార్చుతున్నాయి. చదువు, ఆరోగ్యం, భద్రత వంటి ప్రాథమిక హక్కులు కూడా వారికి అందకుండాపోతున్నాయి. బాలలు యుద్ధాలకు కారణం కాకపోయినా, ప్రతి యుద్ధంలో అత్యధికంగా బాధపడుతున్నవారు వారే. అందుకే బాలల హక్కులను కాపాడటం అంటే యుద్ధాలను ఆపడం శాంతిని కాపాడటం. ప్రపంచంలో ఎక్కువ యుద్ధాలు ప్రధానంగా నాలుగు ప్రయోజనాల కోసం జరుగుతున్నాయి. మొదటిది రాజకీయ అధికారం. కొంతమంది నాయకులు విదేశీ శత్రువు" అనే భయాన్ని సృష్టించి జాతీయతను రెచ్చగొట్టి తమ అధికారాన్ని బలపరుచుకుంటారు. రెండవది ఆయుధ వ్యాపారం. ఆయుధ తయారీ సంస్థలు ప్రపంచంలో అతి పెద్ద లాభాలను పొందే రంగాల్లో ఒకటి. యుద్ధం మొదలైతే కోట్ల డాలర్ల వ్యాపారం జరుగుతుంది. మూడవది సహజ వనరులపై ఆధిపత్యం. చమురు, గ్యాస్, ఖనిజాలు, నీరు వంటి వనరుల కోసం యుద్ధాలు జరుగుతున్నాయి. నాలుగవది మతం లేదా జాతీయత. ఇవి చాలాసార్లు నిజమైనకారణాలు కాకుండా ప్రజలను యుద్ధానికి ప్రేరేపించే ఒక ముసుగుగా ఉపయోగపడతాయి. ఈ నాలుగు కారణాల్లో ఒక్కటి కూడా సాధారణ ప్రజల ప్రయోజనం కోసం కాదు. లాభం కొద్దిమందికి, నష్టం కోట్లాది మందికి. ఆధునిక యుద్ధాల్లో మరణించే వారిలో ఎక్కువ మంది సైనికులు కాదు, సాధారణప్రజలు. అందులో పెద్దభాగంబాలలే. అంతర్జాతీయ సంస్థల నివేదికల ప్రకారం ఆధునిక యుద్ధాల్లో సుమారు 90 శాతం మరణాలు సాధారణ ప్రజలవే. బాలలను కోల్పోతే మనం మన భవిష్యత్తునుకోల్పోతున్నాం. బాలల రక్తం ఎవరి లాభానికైనా ఖర్చు చేయడం మానవత్వానికే మచ్చ. బాలలు యుద్ధాలకు కారణం కాదు, కానీ ప్రతి యుద్ధంలో పెద్ద బాధితులు వారే. ఉక్రెయిన్ యుద్ధం – బాలల జీవితాలపై ప్రభావం రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నాలుగేళ్లుగా కొనసాగుతోంది. దీని ప్రభావం లక్షలాది కుటుంబాలపై పడింది. నివేదికల ప్రకారం 2022 నుంచి కనీసం 3200మంది బాలలు చనిపోయారు లేదా గాయపడ్డారు. 2025లో మాత్రమే 92మంది బాలలు మరణించగా, 652 మంది గాయపడ్డారు. దేశంలోని మూడింట ఒక వంతు బాలలు మానసిక గాయాలకు గురయ్యారు. పాఠశాలలు ధ్వంసం కావడం, విద్యుత్ సౌకర్యాలపై దాడులు జరగడం వల్ల పిల్లలు చదువు, ఆరోగ్య సేవలు కోల్పోతున్నారు. చాలామంది శరణార్థులుగా మారిపోయారు. 2023 అక్టోబర్ నుంచి కొనసాగుతున్న గాజా యుద్ధం బాలలపై అత్యంత దారుణ ప్రభావం చూపింది. నివేదికల ప్రకారం 21 వేలకుపైగా బాలలు చనిపోయారు. 44 వేలకు పైగా బాలలు గాయపడ్డారు. వారిలో వేలాది మంది శాశ్వత వికలాంగులయ్యారు. 56వేలకుపైగా బాలలు తమ తల్లిదండ్రులను కోల్పోయారు. పాఠశాలలు, ఆసుపత్రులు ధ్వంసమయ్యాయి. ఆహారం లేక వేలాది బాలలు ఆకలి చావు అంచున ఉన్నారు. ఈ యుద్ధం వేలాది బాలలను అనాథలుగా, భయంతో జీవించేలా చేసింది. ప్రతి బాంబు వెనుక ఒక బాలుడి/బాలిక కల చనిపోతున్నది" ఫిబ్రవరి 2026 లో ప్రారంభమైన ఇరాన్ యుద్ధం కూడా బాలలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రారంభ దాడుల్లోనే 180 నుండి 200మంది బాలలు మరణించినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఒక పాఠశాలపై జరిగిన దాడిలో 168మంది బాలికలు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం.పలుపాఠశాలలు, ఆసుపత్రులు ధ్వంసమయ్యాయి. విద్య, ఆరోగ్య సేవలు పూర్తిగా దెబ్బతిన్నాయి.ప్రపంచ సంఘర్షణల్లో బాలలపై ఆరుప్రధాన ఉల్లంఘనలు జరుగుతున్నాయి. బాలలను చంపడం లేదా గాయపరచడం, బాలలను సైనికులుగా ఉపయోగించడం, పాఠశాలలు, ఆసుపత్రులపై దాడులు,లైంగిక హింస,బాలల అపహరణ, మానవతా సహాయాన్ని నిరాకరించడం. ఇవి అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకంఅయి నప్పటికీ యుద్ధాల్లో కొనసాగుతూనే ఉన్నాయి. ప్రపంచంలో కోట్లాది బాలలు యుద్ధ ప్రభావంలో జీవిస్తున్నారు. నివేదికల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 47.3 కోట్ల బాలలు సంఘర్షణ ప్రాంతాల్లో జీవిస్తున్నారు.ప్రతిరోజు సగటున 23 మంది బాలలుబాంబు దాడుల్లో గాయపడుతున్నారు లేదా చనిపోతున్నారు.పాఠశాలలపై దాడులు గణనీయంగా పెరిగాయి. లక్షలాది బాలలు స్కూల్‌కు వెళ్లలేకపోతున్నారు. కోట్లాది బాలలు శరణార్థులుగా మారిపోయారు. యుద్ధం వారి జీవితాలను శాశ్వతంగా మార్చేస్తోంది. యుద్ధాలు దేశాలను గెలిపించవచ్చు, కానీ బాల్యాన్ని ఎప్పుడూ ఓడిస్తాయి. యుద్ధం ఎప్పుడూ సమస్యకు పరిష్కారం కాదు. దేశాలు సంభాషణలు, చర్చలు, డిప్లమసీకి ప్రాధాన్యం ఇవ్వాలి. అంతర్జాతీయ చట్టాలను బలోపేతం చేయాలి. ఆయుధ వ్యాపారంపై నియంత్రణఉండాలి. నాయకుల జవాబుదారీతనం పెరగాలి. ప్రజలు కూడా యుద్ధాలకువ్యతిరేకంగా శాంతికోసం గొంతుఎత్తాలి.బాలలు యుద్ధాలకు కారణం కాదు.కానీవారు అత్యధిక బాధితులు.అందువల్ల వారిని 'బలి'గా కాదు,శాంతి దూతలు'గాచూడాలి. ●

# మితిమీరుతున్న 'డిజిటల్' దాడులు..

ఎక్కులూరి నాగార్జున్ రెడ్డి

డిజిటల్ విప్లవం మానవ జీవనశైలిని సమూలంగా మార్చేసింది. ప్రపంచాన్ని ఒక గ్లోబల్ విలేజ్‌గా మార్చిన సోషల్ మీడియా, భావప్రకటనా స్వేచ్ఛకు ఒక గొప్ప వేదికగా నిలిచింది. కానీ, దురదృష్టవశాత్తూ అదే వేదిక నేడు అరాచకానికి, అశ్లీలతకు, వ్యక్తిత్వ హననానికి చిరునామాగా మారుతోంది.ఒకప్పుడు సమాచార వారధిగా వెలిగిన సామాజిక మాధ్యమాలు, నేడు వేధింపుల వలయంగా మారి సామాన్యుల నుండి సెలబ్రిటీల వరకు అందరినీ భయాందోళనకు గురిచేస్తున్నాయి. ట్రోలింగ్ అనేది సోషల్ మీడియాలో ఇప్పుడు అసాధారణ సమస్యేకాదు, ఇది వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీసే సామాజిక వ్యాధిగా మారుతోంది. ఎవరైనా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తే చాలు. వెంటనే దాడులు మొదలవుతున్నాయి. ఫొటోలను మార్ఫింగ్ చేయడం, అసత్య కథనాలు ప్రచారం చేయడం,సెక్సొర్షన్ బెదిరింపులు చేయడం, ఏఐ సాయంతో తప్పుడు వీడియోలు తయారు చేసి ప్రచారం చేయడం వంటి పద్ధతులు పెరుగుతున్నాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం సోషల్ మీడియాలో ఉన్న ప్రతి 8 మంది మహిళల్లో ఒకరు ఇలాంటి అశ్లీల బెదిరింపులకు గురవుతున్నారు. ప్రముఖనటి ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న దుష్ప్రచారంపై తీవ్రంగా స్పందించడం ఈ సమస్య తీవ్రతను మరోసారి వెలుగులోకి తీసుకొచ్చింది. తాను మాట్లాడని మాటలను తన పేరుతో ప్రచారం చేయడం, పాత వ్యక్తిగత సంభాషణలను వక్రీకరించి ప్రచారం చేయడం వంటి చర్యలు తన వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. తప్పుడు ప్రచారాన్ని వెంటనే తొలగించాలని హెచ్చరిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. ఇది కేవలం ఒక సెలబ్రిటీ సమస్య కాదు, సోషల్ మీడియా వేదికలో ఎవరైనా లక్ష్యంగా మారవచ్చని చెప్పడానికి ఈ ఘటన ఉదాహరణ.ఒకప్పుడు విమర్శ అంటే ఆరోగ్యకరంగా ఉండేది. కానీ,నేడు సోషల్ మీడియాలో జరుగుతున్న ట్రోలింగ్ కేవలం విమర్శలకే పరిమితం కావడం లేదు. సైబర్ స్టాకింగ్, డాక్సింగ్, ఐడెంటిటీ థెఫ్ట్, బాడీ షేమింగ్ వంటి అనేక రూపాల్లో వేధింపులు జరుగుతున్నాయి.ట్రోల్ చేయాలనుకున్న వ్యక్తి ఫోన్ నంబర్, ఇంటి చిరునామా వంటి వ్యక్తిగత వివరాలను బయటపెట్టడం ద్వారా మరింతమందిని దాడికి ప్రోత్సహించడం జరుగుతోంది.



నకిలీ ఖాతాలు సృష్టించి అశ్లీల లేదా వివాదాస్పద కంటెంట్‌ను ప్రచారం చేయడం కూడా సాధారణంగా మారింది. ఈ దాడులు కేవలం మానసికంగా మాత్రమే కాదు,కొన్నిసార్లు భౌతిక దాడులకు కూడా దారితీస్తున్నాయి. ఇలాంటి పరిస్థితులు రాజ్యాంగం ఇచ్చిన భావప్రకటన స్వేచ్ఛపైనే ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఈ భయాన్ని 'చిల్లింగ్ ఎఫెక్ట్' అని పిలుస్తారు. అంటే, వ్యక్తులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయకుండా భయపడే పరిస్థితి. ఐక్యరాజ్యసమితి నిర్వహించిన అధ్యయనాల్లో కూడా చాలా మంది మహిళా జర్నలిస్టులు ఆన్‌లైన్ వేధింపుల కారణంగా ఉద్యోగాలు వదిలేయడం, సోషల్ మీడియాకు దూరం కావడం వంటి చర్యలు తీసుకోవాల్సి వచ్చినట్టు వెల్లడైంది. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ ట్రోలింగ్ పద్ధతులు కూడా కొత్త రూపాలను సంతరించుకుంటున్నాయి.హ్యాకింగ్, డిజిటల్ ట్రాకింగ్, వ్యక్తిగత చాట్‌లను దొంగిలించడం వంటి చర్యల ద్వారా బాధితులను మరింతగా బెదిరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో సోషల్ మీడియా సంస్థలు కఠిన చర్యలు తీసుకోవాలని చాలా మంది కోరుతున్నా, వ్యాపార ప్రయోజనాల దృష్ట్యా అవిపూర్తిగా స్పందించడం లేదు అన్న విమర్శలు ఉన్నాయి. అందుకే వ్యక్తిగత స్థాయిలో జాగ్రత్తలు కూడా అత్యంత అవసరం. సోషల్ మీడియా ఖాతాలను ప్రైవేట్‌గా ఉంచడం, వ్యక్తిగత వివరాలను వెల్లడించకపోవడం, లొకేషన్ ట్యాగ్‌లను నివారించడం, బలమైన పాస్‌వర్డ్‌లు ఉపయోగించడం, మల్టీఫ్యాక్టర్ ఆథెంటికేషన్ వంటి భద్రతా చర్యలు తీసుకోవడం తప్పనిసరి. అంతేకాదు, వేధింపులు ప్రారంభమైన వెంటనే సంబంధిత ఖాతాలను బ్లాక్ చేయడం, స్క్రీన్‌షాట్లు భద్రపరచడం,సైబర్ క్రైమ్ అధికారులకు ఫిర్యాదుచేయడం కూడా చాలాముఖ్యం. సైబర్ నేరాలపై మనదేశంలో కఠిన చట్టాలు అమల్లో ఉన్నాయి. సైబర్ స్టాకింగ్, ఐడెంటిటీ థెఫ్ట్, ఆన్‌లైన్ వేధింపులపై కేసులు నమోదు చేయవచ్చు. 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్, 1091 మహిళల హెల్ప్‌లైన్, 14490 నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్ హెల్ప్‌లైన్ వంటి సేవలు అందుబాటులో ఉన్నాయి. ఒక గొప్ప ప్రజాస్వామ్య వేదికలాంటి సోషల్ మీడియా ద్వేషం, వేధింపులు, అసత్య ప్రచారాలకు వేదికగా మారితే సమాజానికి పెనుప్రమాదం. సోషల్ మీడియాఅనేది ఒక పదునైన కత్తి వంటిది. అది అభివృద్ధికి తోడ్పడాలి కానీ వినాశనానికి కాదు. వ్యక్తుల గౌరవం, గోప్యత గౌరవించబడినప్పుడే అది నిజమైన స్వేచ్ఛా వేదిక అవుతుంది. చట్టాల కఠిన అమలుతో పాటు, నెటిజన్లలో సామాజిక బాధ్యత పెరిగినప్పుడే ఈ 'డిజిటల్ చీకటి' తొలగిపోతుంది. ●

# ‘కోడ్’ ముందటి తాయిలాలపై ఏంచేయలేం

## ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ స్పష్టీకరణ - నాలుగు రాష్ట్రాలు, పుదుచ్చేరి ఎన్నికల షెడ్యూల్ విడుదల



**న్యూఢిల్లీ, మార్చి 15:** ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందు తీసుకున్న విధానపరమైన నిర్ణయాలపై తాము జోక్యం చేసుకోలేమని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ స్పష్టం చేశారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందు, కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు జనరంజక పథకాల ప్రకటనపై సిఇసి స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. అలాగే పార్లమెంట్‌లో అభిశంసన తీర్మానం నోటీసు ఇవ్వడంపై స్పందించాలన్న మీడియా ప్రశ్నకు నో కామెంట్ అంటూ జ్ఞానేశ్ కుమార్ సమాధానమిచ్చారు. ఆదివారం ఢిల్లీలో ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషీలు మీడియా సమావేశంలో తమిళనాడు (234), పశ్చిమ బెంగాల్ (294), కేరళ (140), అస్సాం (126)తోపాటు పుదుచ్చేరి (30) రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. పాండా (గోవా), బాగల్‌కోట్, దావణగెరె సౌత్ (కర్నాటక), కొరిడాంగ్ (నాగాలాండ్), ధర్మనగర్ (త్రిపుర), ఉమ్రేత్ (గుజరాత్), రహురి, బారామతి (మహారాష్ట్ర) అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. పుదుచ్చేరితోపాటు నాలుగు రాష్ట్రాల శాసనసభల పదవీకాలం మే, జూన్‌లలో వేర్వేరు తేదీల్లో ముగియనుంది. ఆయా రాష్ట్రాల్లో ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తి చేశాం, క్షేత్ర స్థాయి పరిస్థితులను పర్యవేక్షించేందుకు ఆయా రాష్ట్రాల్లోనూ ఇటీవల పర్యటించినట్లు వివరించారు. పారదర్శక, నిష్పక్షపాతంగా ఎన్నికల కోసమే ఎస్ఐఆర్ నిర్వహిస్తున్నాం. ఓటరు అవగాహన కార్యక్రమాల అధికారులు, యువ ఓటర్లతో మాట్లాడాం" అని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. పారదర్శక, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఎన్నికల హింస, ప్రలోభాలకు తావు లేకుండా నిర్వహిస్తామని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా తొలిసారి ఓటు వేయనున్న యువత ప్రజాస్వామ్య పండుగలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆయా రాష్ట్రాల్లో ఎన్నికల షెడ్యూల్ ఇలా ఉంది.

**అసోం:** అసెంబ్లీ పదవీ కాలం మే 21తో ముగియనుంది. 126 స్థానాలున్న అసోంలో 9 ఎస్సీ, 19 ఎస్టీ రిజర్వు స్థానాలు కాగా, మార్చి 16వ తేదీ సోమవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. 23వరకు నామినేషన్లు కాగా, 24న నామినేషన్ల పరిశీలన, 26 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. అసోంలో 2,50,21,408 మంది ఓటర్లుండగా, 31,486 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 9న పోలింగ్ జరుగనుంది. మే 4న ఓట్ల లెక్కింపు, అదే రోజు ఫలితాలు ప్రకటన చేయనున్నారు. మే 6వ తేదీనాటికి ఎన్నికల ప్రక్రియ ముగియనుంది.

**కేరళ:** అసెంబ్లీ పదవీ కాలం మే 24తో ముగియనుంది. 140 స్థానాలున్న కేరళలో 14 ఎస్సీ, 2 ఎస్టీ సీట్లు రిజర్వు కాగా, మార్చి 16వ తేదీ సోమవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. 23వరకు నామినేషన్లు కాగా, 24న నామినేషన్ల పరిశీలన, 26 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. కేరళలో 2,71,06,059 మంది ఓటర్లుండగా, 30,471 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 9న పోలింగ్ జరుగనుంది. మే 4న ఓట్ల లెక్కింపు, అదే రోజు ఫలితాలు ప్రకటన చేయనున్నారు. మే 6వ తేదీనాటికి ఎన్నికల ప్రక్రియ ముగియనుంది.

**తమిళనాడు:** అసెంబ్లీ పదవీ కాలం మే 11తో ముగియనుంది. 234 స్థానాలున్న తమిళనాడులో 44 ఎస్సీ, 2 ఎస్టీ సీట్లు రిజర్వు కాగా, మార్చి 30 ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. ఏప్రిల్ 6 వరకు నామినేషన్లకు ఆఖరి గడువు కాగా, ఏప్రిల్ 7న పరిశీలన, ఏప్రిల్ 9వ తేదీ లోపు నామినేషన్ల ఉపసంహరణకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. ఇక తమిళనాడులో 5,67,74,436 మంది ఓటర్లుండగా 75,032 పోలింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 23న పోలింగ్ జరుగనుంది. మే 4న ఓట్ల లెక్కింపు, అదే రోజు ఫలితాలు ప్రకటన చేయనున్నారు. మే 6వ తేదీనాటికి ఎన్నికల ప్రక్రియ ముగియనుంది.

**పశ్చిమ బెంగాల్:** అసెంబ్లీ పదవీ కాలం మే 8తో ముగియనుంది. 294 స్థానాలున్న పశ్చిమబెంగాల్‌లో 68 ఎస్సీ, 16 ఎస్టీలు రిజర్వు కాగా, తొలి దశలో 152 నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి మార్చి 30 నోటిఫికేషన్ విడుదల ఏప్రిల్ 6 వరకు నామినేషన్ల దాఖలు అవకాశముంది.

## ‘కాన్షీరామ్‌కు భారత రత్న ఇవ్వాలి’

### ప్రధాని మోడీకి లేఖ రాసిన రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ, మార్చి 15:** బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్‌కు మరణానంతరం భారతరత్న పురస్కారం ప్రదానం చేయాలని ప్రధాని నరేంద్ర మోడీని లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ప్రధాని లేఖ రాశారు. కాన్షీరామ్‌జయంతిని పురస్కరించుకుని, ఆయన సేవలను స్మరించుకుంటూ ఈ విజ్ఞప్తిచేస్తున్నట్లు పేర్కొన్నారు. భారత రాజకీయాల స్వరూపాన్నే కాన్షీరామ్ మార్చారని రాహుల్‌గాంధీ తన లేఖలో కొనియాడారు. ఉద్యమాల ద్వారా బహుజనుల్లో, పేదల్లో రాజకీయ చైతన్యం నింపారని తెలిపారు. బహుజనుల ఓటు, గళం, ప్రాతినిధ్యం ఎంతో ముఖ్యమని గుర్తుచేశారని, ఈ దేశం అందరిదీ అని చాటిచెప్పారనివివరించారు. ఆయన కృషివల్లే ఎందరో అణగారిన వర్గాల ప్రజలు రాజకీయాలను న్యాయం, సమానత్వం సాధించే మార్గంగా చూడటం ప్రారంభించారని లేఖలో రాశారు. ప్రతి భారతీయుడికి రాజ్యాంగం సమానత్వం, గౌరవం, భాగస్వామ్యం కల్పించిందని, ఆ హామీలను సమాజంలో అట్టడుగున ఉన్నవారికి అందించేందుకు కాన్షీరామ్ తన జీవితాన్ని అంకితం చేశారని రాహుల్ కీర్తించారు. ఇటీవల లక్నోలో జరిగిన ‘సామాజిక్ పరివర్తన్ దివస్’ కార్యక్రమంలోనూ ఈ డిమాండ్‌కు బలమైన మద్దతు లభించిందని ప్రధానికి రాసిన లేఖలో ప్రస్తావించారు. 2027లో యుపి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాహుల్ ఈ అంశాన్ని లేవనెత్తడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. కాన్షీరామ్‌కు భారతరత్న ప్రకటించడంఆయన దేశానికి చేసినసేవలకు దక్కే నిజమైన గౌరవమని రాహుల్‌గాంధీ ప్రధాని రాసిన లేఖలో అభిప్రాయపడ్డారు.

## కొత్తప్యాసింజర్ రిజర్వేషన్ వ్యవస్థకు రైల్వే శ్రీకారం!

**న్యూఢిల్లీ,మార్చి 15:** భారతీయ రైల్వేల్లో సుమారు 40 ఏళ్లుగా వినియోగంలో ఉన్న పాత టికెట్ రిజర్వేషన్ సాఫ్ట్‌వేర్‌కు రైల్వే శాఖ వీడ్కోలు చెబుతోంది. దాని స్థానంలో అత్యంత వేగవంతమైన, ఆధునిక టెక్నాలజీతో కూడిన కొత్త ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్‌ను అందుబాటులోకి తేనుంది. ఈ కొత్త వ్యవస్థ ఏప్రిల్ నుంచి జూన్ మధ్య కాలంలో దేశవ్యాప్తంగా ప్రారంభం కానుంది. ప్రస్తుతం ఉన్న సిస్టమ్ తరచూ నెమ్మదిగా పనిచేయడం, తత్కాల్ బుకింగ్ సమయంలో క్రాష్ అవ్వడం వంటి సమస్యలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పీఆర్ఎస్ ఆధునికీకరణ ఫేజ్ 2 పేరుతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. రైల్వే మంత్రిత్వ శాఖ కింద పనిచేసే సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఈ కొత్త వ్యవస్థను అభివృద్ధి చేస్తోంది. ప్రస్తుతం ఈ సిస్టమ్ టెస్టింగ్ దశలో ఉందని, ఏప్రిల్‌జూన్ మధ్యలో లైవ్‌లోకి వస్తుందని క్రిస్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. కొత్త సిస్టమ్ ద్వారా టికెట్ బుకింగ్ సామర్థ్యం భారీగా పెరగనుంది. ప్రస్తుతం నిమిషానికి 25 వేలు టికెట్లు మాత్రమే బుక్ చేయగలుగుతుండగా, కొత్త వ్యవస్థతో నిమిషానికి లక్షకు పైగా టికెట్లు బుక్ చేయవచ్చు. అలాగే, టికెట్ ఎంక్వైరీల సామర్థ్యం కూడా నిమిషానికి 4 లక్షల నుంచి 40 లక్షలకు (పది రెట్లు) పెరగనుంది. ఈ ఆధునికీకరణ కోసం సుమారు రూ.1,000 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇందులో భాగంగా సైబర్ దాడులు, బాట్‌ల నుంచి రక్షణ కల్పించేందుకు రూ.600 కోట్లతో ఇండియన్ రైల్వేస్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ మార్పులతో ప్రయాణికులకు టికెట్ బుకింగ్ అనుభవం మరింత వేగంగా, సులభంగా, సురక్షితంగా మారుతుందని అధికారులు భావిస్తున్నారు.

# విజయ్‌కి డిప్యూటీ సీఎం, 80 టికెట్లు ఆఫర్

## ఎన్డీయేలో చేరాలని బిజెపి సంప్రదింపులు



**చెన్నై మార్చి 15:** తమిళనాడు, పశ్చిమ్ బెంగాల్, కేరళ, అసోం రాష్ట్రాలు, పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతం ఎన్నికలకు షెడ్యూల్ విడుదలయిన నేపథ్యంలో తమిళనాడులో తమిళగ వెట్రి కళగం (టీవీకే), బీజేపీల మధ్య పొత్తులపై వార్తలు మరోసారి చక్కర్లు కొడుతున్నాయి. టీవీకే అధ్యక్షుడు విజయ్‌కు ఉపముఖ్యమంత్రి పదవిని బీజేపీ ఆఫర్ చేసినట్టు జాతీయ మీడియా కథనాలు వెలువడ్డాయి. విజయ్ ఎన్డీయేలో చేరికపై చర్చలు తుది అంకానికి చేరుకున్నట్టు బీజేపీ వర్గాలు తెలిపాయి. టీవీకేకు 80 సీట్లు ఇచ్చేందుకు సిద్ధమైనట్టు వెల్లడించాయి. డిప్యూటీ సీఎం పోస్ట్ ఆఫర్ చేశామని, విజయ్ మాత్రం సీఎం పదవిపై దృష్టి పెట్టారని చర్చల్లో ఇది కీలకంగా మారిందని చెప్పాయి. ఈ విషయంపై ఇప్పటివరకు అటు బీజేపీ, ఇటు టీవీకే నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు. బీజేపీ, డీఎంకేలకు తాము సమాన దూరంలో ఉంటామని, ఎవరితోనూ పొత్తులు ఉండవని విజయ్ ఇప్పటికే తేల్చి చెప్పిన సంగతి తెలిసిందే. అయినాసరే, దీనిపై ప్రచారం జరుగుతూనే ఉండటం గమనార్హం. తమిళనాడులో ఇళయ దళపతి , నటుడు విజయ్‌కు ఉన్న భారీ అభిమానులే టీవీకే పట్ల బీజేపీ ఆసక్తికి ప్రధాన కారణం. వీరు ఎన్నికల ఫలితాలపై గణనీయమైన ప్రభావాన్ని చూపవచ్చని కమలనాథులు భావిస్తున్నారు. అనేక నియోజకవర్గాల్లో కనీసం రెండు శాతం ఓట్లను ప్రభావితం చేయగలరు. అందువల్లనే విజయ్‌తో సంప్రదింపులకు కాషాయ పార్టీ అనేక మార్గాలను అన్వేషించినట్లు తెలుస్తోంది. ఇందులో ఓ రాష్ట్రానికి చెందిన డిప్యూటీ సీఎం సంధానకర్తగా వ్యవహరిస్తున్నారు. ఎలాగైనా టీవీకేను తమ కూటమిలో చేర్చుకోవాలని బీజేపీ ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఆఫర్ రాజకీయంగా ముఖ్యమైంది అయినప్పటికీ, విజయ్ సలహాదారులు మాత్రం వద్దని వారిస్తున్నారు. కూటమిలో చేరడం వల్ల రాజకీయ ప్రత్యామ్నాయంగా స్థాపించిన టీవీకే విశ్వసనీయత దెబ్బతింటుందని భావిస్తున్నారు. జాతీయ పార్టీతో జతకట్టడం వల్ల విజయ్, టీవీకే అంచనా వేసిన స్వతంత్ర ఇమేజ్ తగ్గిపోతుందనేది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరూర్ తొక్కిసలాట కేసులో సీబీఐ విచారణకు విజయ్ ఢిల్లీ వెళ్లడంతో ఆయన బీజేపీ నేతలను కలుస్తారనే ప్రచారం జరిగింది. కానీ, వీటిని టీవీకే తోసిపుచ్చింది.

## బాబ్ ఎల్‌మాండెబ్ జలసంధిమూసేస్తాం: హౌతీల హెచ్చరిక



**సనా, మార్చి 15:** ఇరాన్‌తో అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా ఇప్పటికే కీలకమైన హార్మూజ్ జలసంధి మూసుకుపోగా ఇప్పుడు ప్రపంచ వాణిజ్యానికి మరో ముప్పు పొంచి ఉంది. ఇరాన్ మిత్రపక్షమైన యెమెన్‌లోని హౌతీ రెబల్స్ ఎర్ర సముద్రంలోని ‘బాబ్ ఎల్‌మాండెబ్’ జలసంధిలో వాణిజ్య నౌకలపై దాడులు పునఃప్రారంభిస్తామని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. దీంతో ఒకేసారి రెండు ప్రధాన సముద్ర మార్గాలు స్తంభించిపోయే ప్రమాదం ఏర్పడింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సైనిక చర్యకు ప్రతిస్పందనగానే హౌతీలు ఈ బెదిరింపులకు దిగుతున్నారు. హార్మూజ్ మార్గం మూసుకుపోవడంతో, అనేక వాణిజ్య నౌకలు ప్రత్యామ్నాయంగా “బాబ్ ఎల్‌మాండెబ్” మీదుగా ప్రయాణిస్తున్నాయి. ఫలితంగా ఈ మార్గంలో నౌకల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. ఇదే అదనుగా దాడులకు దిగితే ప్రపంచ సరఫరా గొలుసుపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. హౌతీల నాయకుడు అబ్దుల్‌మాలిక్ అల్ హౌతీ మాట్లాడుతూ అవసరమైతే చర్యలకు దిగేందుకు తమ వేళ్లు ట్రిగ్గర్‌పైనే ఉన్నాయని హెచ్చరించారు. క్షిపణులు, డ్రోన్లతో దాడికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఫిబ్రవరి చివరి నుంచి హౌతీలు హెచ్చరికలు చేస్తున్నప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి కొత్త దాడులు జరిగినట్లు నిర్ధారణ కాలేదు. ప్రపంచ కంటైనర్ వాణిజ్యంలో దాదాపు 30 శాతం బాబ్ ఎల్‌మాండెబ్, సూయజ్ కాలువ మార్గం గుండానే సాగుతుంది. ఈ నేపథ్యంలో, ఇప్పటికే పలు అంతర్జాతీయ షిప్పింగ్ కంపెనీలు తమ నౌకలను ఆఫ్రికా చుట్టూ సుదీర్ఘ మార్గంలో మళ్లిస్తున్నాయి. మరోవైపు, అమెరికాకు చెందిన విమానవాహక నౌక ఈ ప్రాంతంలోకి ప్రవేశిస్తుండటం హౌతీల తదుపరి చర్యలకు పరీక్షగా నిలవనుంది. ఎర్ర సముద్రాన్ని, గల్ఫ్ ఆఫ్ ఆడెన్ మరియు హిందూ మహాసముద్రంతో కలిపే ఈ జలసంధి ప్రపంచ వాణిజ్యానికి వెన్నెముక వంటిది. ప్రపంచ మొత్తం వాణిజ్యంలో దాదాపు 12 శాతం ఈ మార్గం గుండానే జరుగుతుంది. రోజుకు సుమారు 8.8 మిలియన్ బ్యారెళ్ల చమురు మరియు సహజ వాయువు ఇక్కడి నుంచే రవాణా అవుతాయి. యూరప్ మరియు ఆసియా ఖండాల మధ్య ప్రయాణించే నౌకలు సూయెజ్ కాలువను చేరుకోవాలంటే ఈ మార్గం తప్పనిసరి. ఒకవేళ ఈ జలసంధి మూతపడితే నౌకలు ఆఫ్రికా ఖండం చుట్టూ కేప్ ఆఫ్ గుడ్ హోప్ మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. దీనివల్ల రవాణా సమయం అదనంగా 15 నుండి 20 రోజులు పెరుగుతుంది. ప్రయాణ దూరం పెరగడం వల్ల ఇంధన ఖర్చులు, బీమా ప్రీమియంలు భారమై, వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతాయి.

## లూనాజ్ ఆయిల్ రిఫైనరీపై డ్రోన్ల దాడులు!

**బాగ్దాద్, మార్చి 15:** ఉత్తర ఇరాక్‌లోని ఎర్బిల్ నగరంలో డ్రోన్ దాడి కలకలం సృష్టించింది. లానాజ్ ఆయిల్ రిఫైనరీ లక్ష్యంగా జరిగిన ఈ దాడిలో అక్కడ భారీగా మంటలు చెలరేగాయి. ఆకాశమంత ఎత్తున దట్టమైన నల్లటి పొగ అలుముకున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఘటన నేపథ్యంలో రిఫైనరీలో చమురు ఉత్పత్తిని అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. కుర్దిస్థాన్ ప్రాంత ఇంధన వనరుల మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఉదయం నాటికి మంటలను అదుపులోకి తెచ్చినప్పటికీ, పనులు ఇంకా మొదలుకాలేదు. దాడి వల్ల జరిగిన నష్టాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు. అప్పటివరకు రిఫైనరీ కార్యకలాపాలు పునరుద్ధరించే అవకాశం లేదని సమాచారం. మరోవైపు, ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయంపై కూడా దాడులు జరిగాయి. ఎంబసీ ప్రాంగణంలోని హెలిప్యాడ్, రాడార్ వ్యవస్థ లక్ష్యంగా సూసైడ్ డ్రోన్లు, మిస్సైళ్లతో దాడులు చేసినట్లు సమాచారం. ఈ ఘటనలో కార్యాలయ ప్రాంగణంలో మంటలు చెలరేగి ఆస్తి నష్టం వాటిల్లింది. అమెరికా, ఇజ్రాయెల్ దళాలు ఇరాన్‌పై దాడులు మొదలుపెట్టిన తర్వాత బాగ్దాద్‌లోని ఎంబసీపై దాడి జరగడం ఇది రెండోసారి. బాగ్దాద్ విమానాశ్రయం వద్ద ఉన్న అమెరికా దౌత్య కార్యాలయం, మిలిటరీ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని నిరంతరం డ్రోన్ దాడులు జరుగుతున్నాయి. ఇరాన్ మద్దతు గల ఇస్లామిక్ రెసిస్టెన్స్ ఇన్ ఇరాక్ గ్రూపు ఈ దాడులకు బాధ్యత వహిస్తూ ప్రకటనలు చేస్తోంది. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా తన రాయబార కార్యాలయ సిబ్బందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించింది.

# ఆచూకీలేని యాయిర్ నెతన్యాహు

## ప్రధాని కుమారుడి అదృశ్యంపై కలవరం



టెల్ అవీవ్, మార్చి 15: పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెన్యామిన్ నెతన్యాహు కుటుంబంపై సోషల్ మీడియాలో రకరకాల ప్రచారాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా నెతన్యాహు పెద్ద కుమారుడు యాయిర్ నెతన్యాహు గత వారం రోజులుగా సోషల్ మీడియాలో ఎక్కడా కనిపించకపోవడం ఇప్పుడు చర్చనీయాంశం అయింది. ఎప్పుడూ చురుకుగా ఉంటూ, విపక్షాలపై విరుచుకుపడే యాయిర్ క్లిష్ట సమయంలో మౌనంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. యాయిర్ నెతన్యాహు ఎక్స్ వేదికగా రోజుకు సగటున 30 నుంచి 40 పోస్టులు చేస్తుంటారు. అలాంటిది ఈనెల 8వ తేదీ తర్వాత ఆయన నుంచి ఒక్క పోస్ట్ కూడా రాలేదు. ఈనెల 9న ఒక చిన్న రీపోస్ట్ తప్ప, ఆయన సొంతంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఒకవైపు నెతన్యాహు ఆరోగ్యంపై, ప్రాణహానిపై ఇరాన్ అనుకూల మీడియా వార్తలు ప్రసారం చేస్తున్న వేళ, యాయిర్ ఇలా మాయం అవ్వడం కుటుంబంలో ఏదైనా విషాదం జరిగిందా అనే పుకార్లకు దారితీసింది. ప్రస్తుతం యాయిర్ నెతన్యాహు అమెరికాలోని మయామిలో నివసిస్తున్నట్లు సమాచారం. ఇరాన్‌ఇజ్రాయెల్ యుద్ధం ముదురుతున్న నేపథ్యంలో అమెరికాలోని ఇజ్రాయెల్ ప్రముఖుల కుటుంబ సభ్యులకు భద్రతా ముప్పు పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికా మాజీ నిఘా అధికారి ఒకరు మాట్లాడుతూ ఇలాంటి ఉద్రిక్త సమయాల్లో యాయిర్ వంటి వ్యక్తులు బహిరంగంగా తిరగడం లేదా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండటం ప్రమాదకరమన్నారు.

# కమర్షియల్ సిలిండర్ల పంపిణీ షురూ: కేంద్రం వెల్లడి

**న్యూఢిల్లీ, మార్చి 15:** దేశవ్యాప్తంగా వంటగ్యాస్ సరఫరాపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 29 రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల్లో వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభమైందని పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాతా శర్మ వెల్లడించారు. గ్యాస్ సిలిండర్ల నిల్వ, నల్లబజారు విక్రయాలను అరికట్టడానికి దేశవ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు, దాడులను ముమ్మరం చేసినట్లు ఆమె పేర్కొన్నారు. దేశంలో గృహావసరాలకు సరిపడా వంటగ్యాస్ నిల్వలు ఉన్నాయని, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. స్టాక్ తగినంతగా ఉన్నప్పటికీ, కొందరు అనవసరంగా ముందస్తు బుకింగ్‌లు చేస్తున్నారని, దీనివల్ల సరఫరా వ్యవస్థపై అనవసర ఒత్తిడి పడుతోందని సుజాతా శర్మ తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని ఆమె కోరారు. మరోవైపు పెట్రోల్, డీజిల్ సరఫరాపై కూడా ప్రభుత్వం భరోసా ఇచ్చింది. భారత్ వద్ద తగినంత ముడి చమురు నిల్వలు ఉన్నాయని, దేశీయ రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా ఇంధన కొరత ఏర్పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఎక్కడా సరఫరాకు ఆటంకం కలగదని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.


# తాలిబన్ స్థావరంపై పాక్ వైమానిక దాడి

**కాందహార్, మార్చి 15:** పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరుకుంటున్నాయి. తాజాగా ఇరు దేశాల మధ్య కొత్త టెన్షన్ వచ్చి పడింది. ఆఫ్ఘనిస్థాన్‌లోని కాందహార్ ప్రాంతంలో తాలిబన్ సంబంధిత స్థావరంపై పాకిస్థాన్ వైమానిక దాడి చేసింది. ఇటీవలి డ్రోన్ దాడులకు ప్రతీకారంగా ఈ దాడి చేసినట్లు పాకిస్థాన్ పేర్కొంది. గత కొన్ని రోజులుగా పాకిస్థాన్‌లోని వివిధ నగరాలపై అనేక డ్రోన్లు కనిపించాయని చెపుతున్న పాక్ సైన్యం డ్రోన్‌లను సకాలంలో అడ్డగించామని, అవి తమ లక్ష్యాలను చేరుకోకుండా నిరోధించాయని పేర్కొంది. విచ్ఛిన్నమయ్యాక భూమి మీద పడిపోతున్న డ్రోన్ శిథిలాలు కొన్ని ప్రాంతాలలో నష్టాన్ని కలిగించాయని వెల్లడించింది. క్వెట్టాలో శిథిలాల వల్ల ఇద్దరు పిల్లలు గాయపడగా, కోహత్, రావల్పిండిలలోనూ అనేక మంది గాయపడ్డారని తెలిపింది. ఈ సంఘటనపై తీవ్రంగా స్పందించిన పాకిస్థాన్ ఈ దాడులు జరిపినట్లు చెబుతున్నారు. దేశంలోని పౌరులను,

భద్రతా స్థావరాలను లక్ష్యంగా చేసుకోవడం పాకిస్థాన్ సైన్యం తీవ్రంగా మండిపడింది. డ్రోన్ దాడులు ఆఫ్ఘనిస్థాన్ కాందహార్‌లోని సైనిక స్థావరానికి సంబంధించినవని పాకిస్థాన్ ఆరోపించింది. తత్ఫలితంగా, పాకిస్థాన్ ఆ స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని వైమానిక దాడి ప్రారంభించింది. తాజా నివేదికల ప్రకారం డ్రోన్ కార్యకలాపాలను గుర్తించిన తర్వాత ముందు జాగ్రత్త చర్యగా ఇస్లామాబాద్ చుట్టూ ఉన్న వైమానిక ప్రాంతాన్ని తాత్కాలికంగా మూసివేశారు. ఈ సంఘటన రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత దెబ్బతీస్తుందని భావిస్తున్నారు. తాలిబాన్ అనుబంధ యోధులు ఉపయోగించే కాందహార్‌లోని సాంకేతిక సౌకర్యాలు, ఆయుధ డిపోలను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ ఆపరేషన్ జరిగింది. కాందహార్‌లో జరిపిన దాడులపై కాబూల్ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం అందలేదు.

## మంటల్లో పశ్చిమాసియా

# ఇస్ఫహాన్ అణుస్థావరంపై అమెరికా ఇజ్రాయెల్ దాడులు!



**టెహ్రాన్, మార్చి 15:** ఇరాన్ దేశానికి చెందిన అత్యంత కీలకమైన అణుకేంద్రంపై ఇజ్రాయెల్, అమెరికా దేశాలు వైమానిక దాడులకు పాల్పడ్డాయి. అణుకేంద్రం ఉన్న ఇస్ఫహాన్ నగరంపై అమెరికాఇజ్రాయెల్ విమానాలు విరుచుకుపడుతున్నాయి. ఆదివారం ఉదయం నుంచి ఇస్ఫహాన్‌లోని వివిధ ప్రదేశాల్లో భారీ పేలుళ్లు వినిపించాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. చాలాచోట్ల భారీ ఎత్తున నల్లపొగ ఆకాశాన్ని కమ్మేసింది. అమెరికాఇజ్రాయెల్ యుద్ధ విమానాలు చాలా తక్కువ ఎత్తులో ఎగురుతూ దాడులు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. అదేవిధంగా పశ్చిమ టెహ్రాన్‌లోని ఇరాన్ స్పేస్ రిసెర్చ్ సెంటర్‌పై కూడా అమెరికా ఇజ్రాయెల్ దళాలు దాడులు చేశాయి. ఇరాన్ తనకు అవసరమైన శాటిలైట్ ఇంటెలిజెన్స్ మ్యాపింగ్ సమాచారాన్ని అక్కడి నుంచే సేకరిస్తుంది. ఇదిలావుంటే ఇరాన్‌పై దాడులకు అమెరికా తన వద్ద ఉన్న బి52 బాంబర్ విమానాన్ని పంపినట్లు తెలుస్తోంది. ఇది దాదాపు 38 టన్నుల బాంబులను తీసుకెళ్లగలదు. దీనికి సంబంధించిన వీడియోను సెంట్రల్ కమాండ్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేసింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ఆదివారం ఉదయం దాదాపు 20 నిమిషాల వ్యవధిలోనే 20 భారీ పేలుళ్లు వినిపించినట్లు స్థానికులు వెల్లడించారు. ముఖ్యంగా నగరంలోని ఎయిర్‌పోర్టు వద్ద ఇవి చోటు చేసుకున్నట్లు చెబుతున్నారు.

## నెతన్యాహు మరణంపై వార్తలు ఫేక్: ఇజ్రాయెల్



**జెరూసలేం, మార్చి 15:** ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు సంబంధించిన ఓ వార్త నెట్టింట వైరల్‌గా మారింది. యుద్ధంలో ఆయన ప్రాణాలు కోల్పోయారంటూ నెట్టింట ప్రచారం జరుగుతోంది. శుక్రవారం నెతన్యాహు తన ‘ఎక్స్’ ఖాతాలో పోస్టు చేసిన విడియోనే ఈ ఊహాగానాలకు కారణం. తాజాగా ఆయన కార్యాలయం దీనిపై స్పందిస్తూ.. అవన్నీ ఫేక్ అని కొట్టిపారేసింది. అసలేం జరిగిదంటే.. ఇరాన్‌పై యుద్ధం గురించి నెతన్యాహు ఓ సమావేశంలో మాట్లాడారు. దానికి సంబంధించిన విడియోను ఇటీవల ఆయన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. ఆ విడియోలో నెతన్యాహు చేతికి ఆరు వేళ్లు ఉన్నట్లు కన్పించింది. దానిని ఎఐ విడియోగా నెటిజన్లు అభివర్ణించారు. ఈ క్రమంలో నెతన్యాహుకి ఏమైంది? అసలు ఆయన ప్రాణాలతో ఉన్నారా? వంటి అనేక ప్రశ్నలను నెటిజన్లు లేవనెత్తారు. యుఎస్ కన్జర్వేటివ్ వ్యాఖ్యాత కాండేస్ ఓవెన్స్ దీనిపై స్పందిస్తూ.. ‘బిబి ఎక్కడ? ఆయన కార్యాలయం ఎందుకు ఫేక్ ఎఐ విడియోను విడుదల చేసింది. ఎందుకు తొలగించింది. అమెరికా ప్రభుత్వం ఎందుకు ఆందోళనకు గురవుతోంది’ అని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. మరికొందరు కూడా విడియోలోని అంశాలపై ప్రశ్నలు లేవనెత్తుతూ పోస్టులు పెట్టారు. దీంతో ఇరాన్ దాడుల్లో ఆయన మృతి చెందారంటూ వార్తలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో నెతన్యాహు కార్యాలయం వీటిపై స్పందిస్తూ.. ఆయన క్షేమంగానే ఉన్నారని స్పష్టం చేసింది. దీంతో ఊహాగానాలన్నింటికీ చెక్ పడింది.

**వెంటాడతాం.. నెతన్యాహుకి ఇరాన్ వార్నింగ్**

ఇదిలా ఉండగా.. ఇరాన్‌కు చెందిన ఐఆర్జీసీ నెతన్యాహుకి హెచ్చరికలు చేసింది. పిల్లల ప్రాణాలు తీసే వ్యక్తిగా ఇజ్రాయెల్ ప్రధానిని అభివర్ణించింది. ఆయన ఇంకా బతికే ఉంటే.. శక్తి మేరకు వెంటాడతామని వ్యాఖ్యానించింది. ఆయన మరణంపై వస్తున్న వార్తలు ఫేక్ అని ఇజ్రాయెల్ పేర్కొన్న కొన్ని గంటల్లో ఐఆర్జిసి ఈ హెచ్చరికలు చేయడం గమనార్హం. నెతన్యాహు బతికే ఉన్నారా అనే అంశంపై అస్పష్టంగానే ఉందని ఇరాన్ దళాలు పేర్కొన్నాయి. ఆయన మృతి చెంది ఉండొచ్చని.. లేదా కుటుంబంతో సహా దేశాన్ని వీడి ఉండవచ్చని తెలిపాయి.

## యుఎస్, ఇజ్రాయెల్ నౌకలకే హార్మూజ్ జలసంధి బంద్: ఇరాన్



**టెహ్రాన్, మార్చి 15:** హార్మూజ్ జలసంధి విషయంలో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం అమెరికా, ఇజ్రాయెల్ నౌకలకే దీనిని మూసివేసినట్లు ఓ వార్తా సంస్థ ఇంటర్వ్యూలో తెలిపారు. ఇతర దేశాల నౌకలు స్వేచ్ఛగా ప్రయాణించవచ్చని చెప్పారు. అయితే.. భద్రతా సమస్యల కారణంగా అనేక దేశాలు ముందుకు రావడం లేదని పేర్కొన్నారు. దీనికి ఇరాన్‌తో ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం హార్మూజ్ జలసంధి మీదుగా అనేక చమురు ట్యాంకర్లు, నౌకలు ప్రయాణిస్తున్నాయని తెలిపారు. హార్మూజ్‌లో కృత్రిమ అడ్డంకుల కారణంగా చైనా, ఫ్రాన్స్, జపాన్ తదితర దేశాలు ఇబ్బంది పడుతున్నాయని, త్వరలో ఈ ప్రాంతానికి అవి తమ యుద్ధ నౌకలను పంపనున్నాయని ట్రంప్ ప్రకటించిన వేళ అరాఘ్చీ ఈ మేరకు వ్యాఖ్యానించారు. నూతన సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఇటీవలి దాడుల్లో గాయపడ్డారని అమెరికా చేస్తున్న వాదనలపైనా స్పందిస్తూ.. ఆయనకు ఎటువంటి సమస్యా లేదని చెప్పారు. రాజ్యాంగం ప్రకారం మొజ్తాబా తన విధులను నిర్వర్తిస్తున్నారని తెలిపారు. తమ దేశం పటిష్ఠ స్థితిలో ఉందని, ఏ ఒక్క వ్యక్తిపైనా ఆధారపడి లేదని చెప్పారు. ఒకవేళ కీలక వ్యక్తులకు ప్రాణనష్టం సంభవించినా.. తట్టుకోగలదని చెప్పారు. పరిస్థితి అంతా అదుపులోనే ఉందన్నారు. గత నెలలో జెనీవాలో జరిగిన చర్చల సందర్భంగా.. అమెరికా ప్రతినిధులు స్టీవ్ విట్కాఫ్, కుష్నర్‌లపై తాను గట్టిగా అరిచానని, ఇరాన్ వద్ద 11 అణుబాంబులకు సరిపడా యురేనియం ఉందని బెదిరించానంటూ వచ్చిన ఆరోపణలనూ అరాఘ్చీ ఖండించారు. తప్పుగా అర్థం చేసుకున్నారని, చర్చలకు సంబంధించిన వాస్తవాలు త్వరలోనే బయటకు వస్తాయని ఆశిస్తున్నట్లు తెలిపారు.

## సరదాకి కూడా ఖర్గ్ ద్వీపంపై మళ్లీ దాడులుచేస్తాం:ట్రంప్

**వాషింగ్టన్, మార్చి 15:** ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతల నడుమ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌కు చెందిన కీలకమైన ఖర్గ్ ద్వీపంపై సరదాకి కూడా మరికొన్ని దాడులు చేయొచ్చంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు విస్మయం కలిగించాయి. ఇప్పటికే అమెరికా జరిపిన దాడుల్లో ఖర్గ్ ద్వీపంలోని సైనిక లక్ష్యాలు చాలావరకు పూర్తిగా ధ్వంసమయ్యాయని ఆయన స్పష్టం చేశారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్ లో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ అణు కార్యక్రమాలు,

క్షిపణి ముప్పులకు ప్రతిస్పందనగా ఇటీవల అమెరికాఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు ప్రారంభించాయి. ఇందులో భాగంగా మార్చి 13న ఖర్గ్ ద్వీపంపై అమెరికా వైమానిక దాడులు జరిపింది. ఈ నేపథ్యంలోనే ట్రంప్ తాజా హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ ముడి చమురు ఎగుమతుల్లో దాదాపు 90 శాతం ఖర్గ్ ద్వీపం నుంచే జరుగుతాయి.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

## జూనియర్ యోగి సిఎం రేవంత్‌రెడ్డి

### మాజీ మంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్ (ముషీరాబాద్), మార్చి 15, ప్రభాతవార్త:** ఉత్తర్‌ప్రదేశ్‌లో పేదల ఇండ్లను కూల్చిన యోగి మాదిరిగా నగరంలో పేదల ఇండ్లు కూల్చివేస్తూ, జూనియర్ యోగిలాగా రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావ్ ఘాటుగా విమర్శించారు. ఆదివారం భోలక్‌పూర్‌లోని అంజుమన్ భవన్‌లో మాజీ ఎమ్మెల్సీ సలీం ఆధ్వర్యంలో 2,500 మందికి రంజాన్ పండుగ సందర్భంగా నిత్యావసర సరుకుల కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంకు స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలసి ముఖ్య అతిధిగా హాజరై హరీష్‌రావు కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో హరిష్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి, రెండున్నర సంవత్సరాలు అయినప్పటికీ ఏ పేదవానికి కూడా ఒక్క ఇల్లు కూడా కట్టించి ఇవ్వలేదు కానీ, మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇండ్లను మాత్రం కూల్చి వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మైనార్టీల సంక్షేమానికి సబ్ ప్లాన్ కమిటీ ఏర్పాటుచేసి, నాలుగు వేల కోట్లు కేటాయిస్తానని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి సంవత్సరాలు గడిచి పోతున్నా, హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. షాదీ ముబారక్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి పిల్లలు పుట్టాక, చెక్కులు అందచేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో 350 బస్తీ దావఖానాలు ఏర్పాటుచేసి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక, వాటి నిర్వహణ బాధ్యతలను విస్మరిస్తోందని, దావఖానాలకు డాక్టర్లను సైతం నియమించటం లేదని అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు కేవలం కమీషన్ల కోసమే పనిచేస్తున్నారని విమర్శించారు. పవిత్ర రంజాన్ మాసంలో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ దేశాలలో జరుగుతున్న యుద్ధం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధం ఆగాలని ప్రార్ధనలు చేయాలని, ప్రజలందరికీ మళ్లీ మంచి రోజులు రావాలని ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్సీ సలీం పేద ప్రజలు నివసించే ప్రాంతాలలో పదివేల మందికి నిత్యావసర కిట్లను అందచేయటం అభినందనీయమని కొనియాడారు.

## నేడు చలో అసెంబ్లీ

### పిలుపునిచ్చిన రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం జెఎసి

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త :** బకాయి బిల్లులను వెంటనే విడుదల చేయాలన్న డిమాండ్‌తో సోమవారం అసెంబ్లి ముట్టడికి తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం జెఎసి పిలుపునిచ్చింది. కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్ర ప్రభుత్వానికి 15వ ఆర్థిక సంఘం నిధులు విడులవుతున్నా తమ పెండింగ్ బిల్లులను చెల్లించడం లేదని జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ మండిపడ్డారు. 2023 చివరి ఆరు నెలల్లో చేసిన పనులకు గాను మాజీ సర్పంచ్‌లకు రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.530 కోట్లు బకాయి పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యంగానైనా బిల్లులను చెల్లించకపోదా అన్న నమ్మకంతో అప్పు తెచ్చిన సొంత నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశామని మాజీ సర్పంచ్‌లు చెబుతున్నారు. చాలా గ్రామాల సర్పంచ్‌లు లక్షల విలువైన గ్రామాభివృద్ధి పనులను అప్పు తెచ్చిన నిధులతోనే చేశారని గుర్తు చేస్తున్నారు.

## ఎల్‌పిజి కొరత నివారణకు పౌర సరఫరాల శాఖ ప్రత్యేక చర్యలు

### ప్రత్యేకంగా టోల్‌ఫ్రీ నంబరు 1967 ఏర్పాటు

### శనివారం 2,43,371 సిలిండర్ల పంపిణీ

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త :** ఇరాన్-అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో రాష్ట్రంలో ఎల్‌పిజి సరఫరా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించి వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ కొరత కారణంగా ఎల్‌పిజి గ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ సరఫరా అంతరాయం లేకుండా చూడటానికి తెలంగాణ పౌర సరఫరాలశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఎలపిజి పంపిణీని పర్యవేక్షించేందుకు 24 గంటలపాటు పనిచేసే మల్టి ఏజెన్సి కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రం ద్వారా రియల్ టైమ్ జిపిఎస్ ట్రాకింగ్ వ్యవస్థను ఉపయోగించి గ్యాస్ రవాణా వాహనాల కదలికలు, జిల్లాల వారీగా నిల్వలు, పంపిణీ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. దీంతో గృహ వినియోగదారులు, ప్రాధాన్య వాణిజ్య రంగాలకు ఎల్‌పిజి సరఫరా ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలో ఎల్‌పిజి సరఫరా వ్యవస్థలో ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే గుర్తించి పరిష్కరించేందుకు ఈ కమాండ్ సెంటర్ కేంద్రంగా పనిచేస్తోంది. పౌర సరఫరాల కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర ఆధ్వర్యంలో అధికారులు జిల్లాల అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ రవాణా ఏర్పాట్లు, రోజువారీ నిల్వల వివరాలను పర్యవేక్షిస్తున్నారు. పూర్తి పారదర్శకత కోసం ప్రధాన ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు తమ గ్యాస్ రవాణా వాహనాల జిపిఎస్ ట్రాకింగ్ వ్యవస్థలను ప్రభుత్వ అధికారులకు అందుబాటులో ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం సంస్థల ప్రతినిధులు, పోలీస్, పరిశ్రమలశాఖ, డిస్ట్రిబ్యూటర్ల ప్రతినిధులు రోటేషన్ పద్ధతిలో విధులు నిర్వహిస్తూ సరఫరా వ్యవస్థలో సమన్వయం సాధిస్తున్నారు. అదనంగా టోల్ ఫ్రీ నంబర్ 1967 హెల్ప్‌లైన్ కూడా ఈ కేంద్రంలోనే ఏర్పాటు చేశారు. తాజాగా శనివారం రాష్ట్ర వ్యాప్తంగా బుకింగ్ మేరకు 2, 43, 371 సిలిండర్లు పంపిణీ చేశారు.

# మూసీ భూములు ప్రపంచ బ్యాంక్‌కు కట్టబెట్టే యత్నం

### చిన్న మోడీలా వ్యవహరిస్తున్న రేవంత్‌రెడ్డి

### పూర్తి డిపిఆర్ ఇవ్వకపోవడం వెనుక మోసం: కల్వకుంట్ల కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 15:** మూసీ ప్రక్షాళన పేరుతో దాని పరివాహక ప్రాంతాల్లోని భూములను ప్రభుత్వం ప్రపంచ బ్యాంకుకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఇప్పటి వరకు మూసీ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి డిపిఆర్‌ను ప్రభుత్వం విడుదల చేయలేదని, ఫేజ్ 1కు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను మాత్రమే చూపించిందని అన్నారు. పూర్తి వివరాలు ఇవ్వకపోవడం వెనుక మోసం ఉందని విమర్శించారు. ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టులో ఈ ప్రాజెక్టుకు రూ.5,641 కోట్లు ఖర్చవుతుందని ప్రభుత్వం తెలిపిందని, అయితే ఆరు నెలల వ్యవధిలోనే దాదాపు రూ.1,400 కోట్ల వరకు అంచనా వ్యయం పెరిగిందని అన్నారు. ఆదివారం కవిత మీడియాతో మాట్లాడుతూ, సిఎం రేవంత్‌రెడ్డి, హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రాతో కలిసి సిఎం రేవంత్‌రెడ్డి అరాచకం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఇప్పటివరకు ఆరు ఫిర్యాదులు చేశామని ప్రస్తావించారు. అవసరమైతే హైడ్రా కమిషనర్, ప్రభుత్వంపై పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. నాళాలను ఆక్రమించి విల్లాలు నిర్మిస్తున్న సంస్థ తమ పరిధిలోకి రాదని హైడ్రా కమిషనర్ చెబుతున్నారని విమర్శించారు. ఇష్టం వచ్చినట్లుగా వీడియోలు పెడుతున్నారని.. మీరేమైనా కంటెంట్ రైటర్లా ...? అంటూ ధ్వజమెత్తారు. హైడ్రా వీడియోలు తీసి సోషల్ మీడియాలో పెడుతూ అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని కవిత అన్నారు. తాను ఆధారాలు బయటపెడితే ప్రభుత్వం, హైడ్రా సమాధానం చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. హైడ్రా చేసిన ట్వీట్లు వెంటనే డిలీట్ చేయాలని, లేదంటే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. గాంధీ విగ్రహం కోసం రూ.70 కోట్లు, రూ.200 కోట్లు ఖర్చు చేస్తామని చెప్పే ప్రభుత్వం, సిఎం ఇంటి నుంచి మాత్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదని కవిత విమర్శించారు. మూసీ ప్రాజెక్టు ప్రజెంటేషన్‌కు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు, మంత్రులను పిలిచారని, అయితే మూసీ కారణంగా ఇళ్లు కోల్పోయి నిర్వాసితులవుతున్న వారిని మాత్రం ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహారం తెలంగాణలో చిన్న మోదీలా ఉందని వ్యాఖ్యానించారు. 2017లో మూసీ ప్రక్షాళన ప్రాజెక్టును తిరస్కరించిన ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ అనుమతులు ఇచ్చిందని అన్నారు. మూసీ పేరుతో సీఎం గ్రాఫిక్స్ చూపిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. నగరంలోని 16 నాళాల నుంచి మురికి నీరు మూసీలోకి వస్తోందని, నగర వ్యర్థాలన్నీ మూసీలోకే వెళ్తున్నాయని తెలిపారు. 1,430 ప్రాపర్టీలను కూల్చివేస్తామని ప్రభుత్వం చెబుతోందని, దీనితో ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ ప్రభుత్వం నడుస్తోందని ఆరోపించారు. ఖమ్మం జిల్లాలోని వెలుగుమట్లలో ప్రభుత్వం దారుణంగా వ్యవహరించిందని, అసలైన బాధితులకు ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా కొంతమంది కాంగ్రెస్ కార్యకర్తలకు ఇచ్చినట్లు తమకు సమాచారం అందిందన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 17వ తేదీన తాను, విశారదన్ కలిసి నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేసి ఖమ్మంలో పర్యటిస్తామని కవిత తెలిపారు. వెలుగుమట్లలో నిజమైన బాధితులకు న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. తాను, విశారదన్ కలిసి చేసిన పోరాటంతోనే ప్రభుత్వం వెనక్కి తగ్గిందని ఆమె పేర్కొన్నారు.

## రెండు వారాలుగా త్రిపుల్ సెంచరీ మార్క్ వద్దే చికెన్

### తాజాగా కిలో ధర రూ.320.. సామాన్యులు బెంబేలు

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో చికెన్ ధరలు ఊహించని విధంగా పెరుగుతున్నాయి. ఫలితంగా సామాన్యుడు చికెన్ కర్రికి దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. సాధారణంగా డిమాండ్ తక్కువగా ఉండే అన్ సీజన్‌లోనే చికెన్ ధరలు ఒక్కసారిగా పెరగడం వినియోగదారులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. దాదాపు 20 రోజులుగా బహిరంగ మార్కెట్‌లో చికెన్ ధరలు ట్రిపుల్ సెంచరీ మార్కును దాటాయి. ప్రస్తుతం కిలో చికెన్ రూ.320 వరకు ధర పలుకుతోంది. చికెన్ ధరలు రోజురోజుకు పెరుగుతుండటంతో సామాన్య జనాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చికెన్ ధర ఎంత అని అడిగి.. కొనకుండా వెళ్లిపోతున్నారని వ్యాపారాలు చెబుతున్నారు. కిలో చికెన్ ధరకు అర కేజీ మటన్ వస్తదని కదా అని కొనకుండా వెళ్లిపోతున్నారని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ఇదే సమయానికి చికెన్ ధరలు తక్కువగా ఉండేవి. అయితే ఈసారి పరిస్థితి భిన్నంగా ఉందని వ్యాపారులు చెబుతున్నారు. పౌల్ట్రీ ఫారాల నుంచి సరఫరా తగ్గిపోవడమే ధరలు పెరగడానికి ప్రధాన కారణమని పేర్కొంటున్నారు.

# బిఆర్ఎస్ డ్రగ్స్ పార్టీ తెలంగాణ సమాజానికి మచ్చ

### యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో కెటిఆర్, రోహిత్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం



**హైదరాబాద్, మార్చి 15,ప్రభాతవార్త:** తెలంగాణ సమాజానికి మచ్చలా బిఆర్ఎస్‌న డ్రగ్స్ పార్టీలు నిర్వహిస్తూ యువతను నిర్వీర్యం చేస్తున్నారని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం గాంధీభవన్ లో యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో కెటిఆర్, రోహిత్‌రెడ్డిల దిష్టిబొమ్మలను దగ్దం చేసి నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా శివ చరణ్‌రెడ్డి మాట్లా డుతూ ఖబద్దార్ బిఆర్ఎస్ నాయకుల్లారా ఈగల్ టీమ్ మీ ఆటలు ఇక సాగనివ్వవనీ హెచ్చరించారు. మొయి నాబాద్ ఫామ్ హౌస్ లో డ్రగ్స్ పార్టీ కేసు వ్యవహారంలో బిఆర్ఎస్ నాయకుల పేర్లు తెర పైకి రావడం సిగ్గుచేటనీ విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీ నాయకుల డ్రగ్స్ వ్యవహారంను రాజకీయాలతో చూడవద్దని ఇది సమాజానికి కీడు చేసే మదకద్రవ్యాలను నిరోధించడానికి ప్రజలు ఒక్కటికావాలని సూచించారు. రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియా పెరగడానికి ప్రధాన కారణం బిఆర్ఎస్ నాయకులే అని మండిపడ్డారు. ప్రతిపక్ష నాయకులు ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండాల్సింది పోయి మత్తులో మునుగుతూ జల్సా లకు తేర లేపడంతో రాష్ట్ర ప్రజలందరూ ముక్కున వేలేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి సారిద్యంలో ప్రజా ప్రభుత్వంలో డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడమే మా లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుర్రం శ్యాంశరణ్ రెడ్డి, ఎర్రమల రాంరెడ్డి, జిల్లా అధ్యక్షులు హరిధర్ పలువురు రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు, నియోజకవర్గాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

**కెటిఆర్.. డగ్స్ టెస్ట్‌కు సిద్ధమా!**

కెటిఆర్‌కు ఛాలెంజ్ చేస్తున్న.. డ్రగ్స్ టెస్ట్‌కు ఆయన సిద్ధమా అని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సవాల్ విసిరారు. ఆదివారం గాంధీభవన్ ఎదుట కెటిఆర్ దిష్టి బొమ్మను కాంగ్రెస్ నాయకులు దగ్ధం చేశారు. కెటిఆర్‌తోనే తెలంగాణలో డ్రగ్స్ కల్చర్ ఆరంభమైందని ఆవేదన వ్యక్తం చేశారు. పైలట్ రోహిత్‌రెడ్డి ఘటనతో మరోసారి కెటిఆర్‌కు డ్రగ్స్ సంబంధం ఉందనీ రుజువైందని ఆయన ఆరోపించారు. ఈగల్ టీమ్ కు డ్రగ్స్‌తో మీ నాయకులు పట్టుబడ్డారని ఆయన ఎద్దేవా చేశారు. ఇప్పు డు కెటిఆర్ ఏం సమాధానం చెబుతారో స్పష్టం చేయాలన్నారు. ప్రజా ప్రభుత్వం తెలంగాణను డ్రగ్స్‌రహిత రాష్ట్రంగా తీర్చి దిద్దుతోందని అన్నారు.

## బిఆర్ఎస్ హయాంలో డ్రగ్స్ మాఫియా అడ్డాగా తెలంగాణ

### తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ హయాంలో పదేళ్లుగా డ్రగ్స్ మాఫియాకు అడ్డగా తెలంగాణను మార్చారని, సిఎం రేవంత్‌రెడ్డి డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం ఈగల్ టీంను ఏర్పాటు చేశారని తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్ ఆదివారం గాంధీభవన్‌లో అన్నారు. మోయినాబాద్‌లో పైలట్ రోహిత్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ తీసుకుంటూ దొరికాడనీ, ఆయనతో పాటు పలువురు ప్రజాప్రతినిధులున్నారని అన్నారు. ఢిల్లీకి చెందిన మాజీ ఎమ్మెల్యే నమీత్‌శర్మకు పైలట్ రోహిత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడని ఆయనతోనే రాకెట్ జరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. డ్రగ్స్‌రహిత తెలంగాణ కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిద్రలేని రాత్రులు గడిపి ఈగల్‌ను ఏర్పాటు చేసి మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపారని తెలిపారు. పదేళ్లపాటు ఆడిందే ఆట.. పాడిందే పాటగా బిఆర్ఎస్ ప్రభుత్వంలో డ్రగ్స్ మాఫియా వ్యవహరించిందని విమర్శించారు. పైట్ రోహిత్‌రెడ్డి డ్రగ్స్ తీసుకున్నట్లు తేలిందని మనోహర్‌రెడ్డి ధ్రువీకరించారు. బిఆర్ఎస్ నాయకులు దీనికి సమాధానం చెప్పాలని, డ్రగ్స్ అంటే ఏమిటో నాకు తెలియదని గతంలో కెటిఆర్ అన్నారు.. వేరే రాష్ట్రాల నుంచి డ్రగ్స్ తీసుకువచ్చి ఇక్కడ హంగామా చేశారని ఆయన అన్నారు. శనివారం రాత్రి జరిగింది చిన్న పార్టీ కాదు, డ్రగ్స్ మాఫియా, పెద్ద రాకెట్ నడుస్తోందని, డ్రగ్స్ రాకెట్‌లో ఉన్న వాళ్ల పేర్లు బయటకు వస్తాయని ఆయన చెప్పారు. కూకటివేళ్లతో డ్రగ్స్ మాఫియాను నిర్మూలించాలని ఆయన సూచించారు. తెలంగాణ యువతను చెడగొట్టడానికి డ్రగ్స్ మాఫియా పనిచేస్తోందని అన్నారు.

## బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలి

### ఎబివిపి రాష్ట్ర కమిటీ డిమాండ్

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులను కేటాయించాలని అఖిల భారత విద్యార్థి పరిషత్(ఎబివిపి) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు డిమాండ్ చేశారు. వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశ పెట్టబోయే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని రాంబాబు డిమాండ్ చేశారు. విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొస్తామని, అధిక నిధులు కేటాయించి విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తామని అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్.. విద్యారంగంపై సవితితల్లి ప్రేమ చూపిస్తుందన్నారు.



## మార్పు కోరుతున్న హైదరాబాద్ ప్రజలు

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త :** హైదరాబాద్ నగరంలో ప్రజలు స్పష్టమైన మార్పు కోసం ఎదురుచూస్తున్నారని, రాష్ట్రంలో బిజెపిని అధికారంలోకి తీసుకురావాలనే సంకల్పంతో మహిళలు, యువత ముందుకు వస్తున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు సమక్షంలో బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ప్రముఖ సంఘ సేవకులు, గౌడ సంఘం అధ్యక్షుడు, బిఆర్ఎస్ నాయకుడు పంజాల గిరిధర్ గౌడ్ తమ మద్దతుదారులతో కలిసి భారతీయ జనతా పార్టీలో చేరారు. అలాగే మాజీ టిడిపి కార్పొరేటర్ కుటుంబానికి చెందిన న్యాయవాది కవిత, పృద్వీరాజ్ తమ అనుచరులతో కలిసి బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా స్వాగతించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. గౌతంరావు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక రెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షులు లంకల దీపక్ రెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి విఠల్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు మాట్లాడుతూ కవిత, గిరిధర్ గౌడ్‌తో పాటు అనేక మంది యువకులు, మహిళలు భారతీయ జనతా పార్టీలో చేరడం పార్టీపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని తెలిపారు. పార్టీలో చేరిన వారందరూ ప్రజా సేవా ధృక్పథంతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ నగర అభివృద్ధి నిజంగా జరగాలంటే బిజెపికి అవకాశం ఇవ్వాలని, బిజెపి మేయర్‌ను గెలిపిస్తే నగరానికి పారదర్శక పరిపాలన, సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని రాంచందర్‌రావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.


## క్రీడలను యువత అభివృద్ధికి వినియోగించాలి

### సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ నారాయణ

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** డ్రగ్స్ సేవిస్తూ పట్టుబడిన టీడీపీ ఎంపీ పుట్ట మహేష్, మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నేత పైలట్ రోహిత్ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) జాతీయ కంట్రోల్ కమీషన్ ఛైర్మెన్ డాక్టర్ కె నారాయణ డిమాండ్ చేశారు. క్రీడలను కార్పొరేట్ లాభాల కోసం కాకుండా, యువత అభివృద్ధి కోసం వినియోగించాలన్నారు. ఐపీఎల్ పేరుతో క్రీడాకారులను సంతలో సరుకుల్లా కొనుగోలు చేసే క్రీడా వ్యాపారాన్ని అరికట్టాలని నారాయణ డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ సీ గ్రౌండ్స్‌లో ఈ నెల 12 నుండి 17వరకు నిర్వహిస్తున్న భగత్ సింగ్ ప్రీమియర్ లీగ్(బీపీఎల్) టోర్నీ నాల్గవ రోజైన ఆదివారం సిపిఐ నేత నారాయణ, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎం కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వారిద్దరూ కాసేపు ప్లేయర్లతో మ్యాచ్ ఆడి వారిలో ఉత్సాహం నింపారు. సీపీఐ జాతీయ కంట్రోల్ కమీషన్ ఛైర్మెన్ కె. నారాయణ మాట్లాడుతూ.. దేశంలో క్రీడల అభివృద్ధి విషయంలో పాలక వర్గాలు అవలంబిస్తున్న విధానాలను తీవ్రంగా విమర్శిం చారు. దేశ యువతలో అపారమైన ప్రతిభ ఉన్నప్పటికీ, ప్రభుత్వాలు క్రీడలకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా నిరక్ష్యం చేస్తున్నాయని మండిపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో మైదానాలు, శిక్షణా కేంద్రాలు, క్రీడా సదుపాయాలు కల్పిం చడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. క్రీడలను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వాలు వాటిని కార్పొరేట్ లాభాల కోసం ఉపయోగించే విధంగా మారుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భగత్ సింగ్ వంటి విప్లవ వీరుల ఆశయాలు యువతకు ప్రేరణ కావాలన్న నారాయణ, యువత క్రీడలు, విద్య, సామాజిక బాధ్యతల వైపు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

క్రీడలను కూడా వ్యాపారంగా మార్చి బెట్టింగ్ యాప్స్, మాదకద్రవ్యాల సంస్కృతి యువతను తప్పుదోవ పట్టిస్తున్నాయన్నారు. యువత మాదకద్రవ్యాలు, బెట్టింగ్ సంస్కృతి వంటి సామాజిక దుష్ప్రభావాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. క్రీడలు అనేవి క్రమశిక్షణ, ఐక్యత, పోరాటస్ఫూర్తి పెంపొందించే గొప్ప సాధనమన్నారు. దేశంలో క్రీడలను అభివృద్ధి పరచాల్సిన పరిస్థితిలో, ప్రస్తుతం క్రీడలను పూర్తిగా వ్యాపారంగా మార్చే ప్రమాదకర పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఐపీఎల్ పేరుతో జరుగుతున్న క్రీడా వ్యవస్థలో క్రీడాకారులను సంతలో సరుకుల్లా వేలం వేయడం క్రీడాస్ఫూర్తికి విరుద్ధమని విమర్శలు వ్యక్తమవుతున్నాయన్నారు. క్రీడాకారులు దేశ గౌరవాన్ని నిలబెట్టే ప్రతిభావంతులైన యువకులని కానీ వారిని కోట్ల రూపాయల వేలాల్లో కొనుగోలు చేసే విధానం క్రీడలను పూర్తిగా కార్పొరేట్ వ్యాపారంగా మార్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సికింద్రాబాద్ నియోజకవర్గ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. సత్య ప్రసాద్, శ్రీమాన్, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నేర్లకంటి శ్రీకాంత్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, ఉపాధ్యక్షుడు కళ్యాణ్, రాజ్ కుమార్, మహేష్, భాను పాల్గొన్నారు.

## డ్రగ్స్ సేవిస్తూ పట్టుబడిన పుట్ట మహేష్, రోహిత్‌రెడ్డిపై కఠినచర్యలు తీసుకోవాలి



ఫీజు పోరు దీక్షలో అభివాదం చేస్తున్న నేతలు

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలి

### దీక్ష కార్యక్రమంలో పలువురు వక్తల డిమాండ్

### హాజరైన బండారు దత్తాత్రేయ, ఎంపి ఈటల రాజేందర్, మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎల్.రమణ, మధుసూదనాచారి

**హైదరాబాద్ (ధర్నాచౌక్), మార్చి 15, ప్రభాతవార్త:** ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్ యాదవ్ అధ్యక్షతన, జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్‌గౌడ్ సమన్వయంతో నిర్వహించిన ఫీజు పోరు దీక్ష కార్యక్రమంకు హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ ఈటెల రాజేందర్, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఎల్.రమణ, మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, సీపీఐ నేత జి.నరసింహా, టీజేఎస్ ఉపాధ్యక్షులు నిజ్జన రమేసన, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద నరేష్ మాదిగ, సినీ దర్శకులు ఎన్.శంకర్ హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే పూర్తి ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తుందని, ఫీజుల బకాయిలు అన్నీ విడుదల చేస్తామని, ప్రతి విద్యార్థికి ఐదు లక్షల రూపాయలతో విద్యా భరోసా కార్డు ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచిపోయినప్పటికీ ఫీజులు ఇవ్వకుండా పేద విద్యార్థుల ఉసురు పోసుకుంటోందని ధ్వజమెత్తారు. రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో ఎవరికి ఎన్ని నిధులు కేటాయించారో స్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజులు ఇవ్వకపోతే అసెంబ్లీ ముట్టడించేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ విద్యార్థుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, విద్యార్థులు తలచుకుంటే ప్రభుత్వం కూలటం ఖాయమని హెచ్చరించారు. విద్యార్థుల ఉద్యమం ఇంకా ఉధృతం కాకముందే ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని, లేనిపక్షం విద్యార్థులు రోడ్డు ఎక్కితే ప్రభుత్వానికే ప్రమాదమని అన్నారు. ఈటెల రాజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను అమలుచేయటంలో విఫలమయిందని ఆరోపించారు. ఏ పార్టీ నాయకులైనా, ఏ సంఘాల నేతలపైనా మమ్మల్ని ఏం చేస్తారు అనే రాజకీయ అహంకారంతో కాంగ్రెస్ వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం అహంకార వైఖరి వీడనాడి, విద్యార్థుల సమస్యలపై స్పందించాలని, లేనిపక్షం విద్యార్థుల పక్షాన యావత్ తెలంగాణ, ప్రభుత్వానికి కర్రు కాల్చి వాత పెడుతుందని హెచ్చరించారు. ఫీజురీయంబర్స్‌మెంట్ అన్నది కేవలం పిడికెడుమంది యాజమాన్యాల సమస్య కాదని, ఇది లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లితండ్రుల సమస్యగా ప్రభుత్వం గుర్తించాలని హితవు పలికారు. మధుసూదనాచారి, ఎల్.రమణ, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్‌లు మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ అమలుచేయకుండా బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ కనీసం విద్యార్థుల విషయంలోనైనా నిధులు విడుదల చేసి, చిత్తశుద్ధి చాటుకోవాలని అన్నారు. బీసీ సంఘాలు చేపడుతున్న ఫీజుల రీయంబర్స్‌మెంట్ ఉద్యమానికి బీఆర్ఎస్ పక్షాన పూర్తి మద్దతు తెలియచేస్తున్నామన్నారు. ఫీజుల విషయంలో ప్రభుత్వం ఇంకా నిర్లక్ష్యం వహిస్తే, బీసీ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టబోయే అసెంబ్లీ ముట్టడిలో తాము ముందు వరసలో ఉంటామని స్పష్టం చేశారు. ఈ దీక్షా కార్యక్రమంలో బీసీ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గుజ్జకృష్ణ, బీసీ కుల సంఘాల జేఏసీ ఛైర్మన్ కుందారం గణేష్‌చారి, రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు శ్యాం కుర్మా, బీసీ మహిళా సంఘం అధ్యక్షురాలు మణి మంజరి, బీసీ జేఏసీ కన్వీనర్ జాజుల లింగం గౌడ్, బీసీ యువజన సంఘం నేతలు రావులకోల్ నరేష్, ప్రజాపతి, దిటి మల్లయ్య, దేశగోని సంబశివగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో మైనస్ 1.16 శాతం ద్రవ్యోల్బణం

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త :** తెలంగాణలో ద్రవ్యోల్బణం రేటు మైనస్ 1.16 శాతంగా నమోదైంది. ఇది జాతీయ సగటు కంటే తక్కువగా ఉంది. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా వినియోగదారుల ధరల సూచిక మేరకు భారతదేశ జాతీయ రిటైల్ ద్రవ్యోల్బణం 0.25 వద్ద ఉంది. దేశంలోని మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే తెలంగాణ ఒక ప్రత్యేకమైన ధోరణిని ప్రదర్శించింది. తాజా డేటాలో రాష్ట్రం ద్రవ్యోల్బణ రేటు 1.16 (ప్రతి ద్రవ్యోల్బణం)ను నివేదించింది. ఇటీవలి నెలల్లో అనేకసార్లు ప్రతి ద్రవ్యోల్బణ జోన్‌లోకి ప్రవేశించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ రికార్డయింది. జూన్‌లో 0.93 తో ప్రారంభమైన ప్రతి ద్రవ్యోల్బణ దశ, జూలైలో 0.44 తో కొనసాగింది, ఆగస్టులో 0.94 ద్రవ్యోల్బణంతో స్వల్ప కోలుకుంది. అయితే సెప్టెంబర్‌లో మళ్ళీ 0.15 ప్రతి ద్రవ్యోల్బణానికి పడిపోయింది. ప్రధానంగా గ్రామీణ తెలంగాణలో 0.29 ప్రతి ద్రవ్యోల్బణం నమోదైంది, అయితే పట్టణ తెలంగాణలో అది 0.05 నమోదైంది, రెండూ జాతీయ సగటు కంటే చాలా తక్కువ (ఈ నెల భారతదేశ రిటైల్ ద్రవ్యోల్బణం 1.54)గా ఉంది.



## గవర్నర్ శివప్రతాప్‌శుక్లాతో డిప్యూటీ సిఎం భట్టి భేటీ

### అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ఆహ్వానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 15:** రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాని ప్రత్యేకంగా కలిసి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆహ్వానించారు. ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు పుష్పగుచ్ఛం అందించి.. శాలువాతో సత్కరించారు. ఉపముఖ్యమంత్రితోపాటుగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిసిన వారిలో ఆర్థిక శాక ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఫైనాన్స్ ప్లానింగ్ సెక్రెటరీ గౌరవ్ ఉప్పల్, ఆర్థిక శాఖ కార్యదర్శి స్మితాపట్నాయక్ తదితరులున్నారు.

# ఫాంహౌస్‌లపై కొరవడిన నిఘా

## నిన్నటి వరకు లిక్కర్ డ్యాన్సులు, రేవ్ పార్టీలు

## నేడు డ్రగ్స్ పార్టీలతో హల్‌చల్

## ప్రముఖులతోపాటు ప్రజాప్రతినిధులు

## వరుసగా పట్టుబడుతున్న వైనం

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** హైదరాబాద్ శివార్లలోని ఫాం హౌస్‌లపై నిఘా కొరవడింది. నిన్నమొన్నటి వరకు మద్యంతో డ్యాన్స్‌లు, మహిళల అశ్లీల నృత్యాలతో కూడిన రేవ్ పార్టీల వరకే పరిమితమైన ఫాం హౌస్‌లు కొంతకాలంగా డ్రగ్స్ పార్టీలకు కేరాఫ్‌గా మారాయి. ఈ పార్టీలో ప్రముఖులతో పాటు రాజకీయ నేతలు, చట్టసభల్లో సభ్యులుగా వున్న వారు పాల్గొనడంతో పాటు డ్రగ్స్ సేవించి దొరికిపోవడం సంచలనం రేపుతో ంది. ఇంతకు ముందు జంట నగరాలలోని పబ్‌లలో డ్రగ్స్ సేవించి దొరికిపోయిన వారు అనేక మంది వుండగా ఇప్పుడు ఫాం హౌస్‌లలో ఈ తర హా ఘటనలు ఎక్కువవుతున్నాయి. శివార్లలోని మొయినాబాద్‌లో గల అజీజ్‌నగర్‌లో బిఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంఎల్ఎ పైలట్ రోహిత్ రెడ్డి ఫాం హౌస్‌లో శనివారం రాత్రి డ్రగ్స్ పార్టీని పోలీసులు రట్టుచేయగా ఈ సందర్భంగా ఏలూరు ఎంపి పుట్టా మహేష్ యాదవ్‌తో పాటు రోహిత్ రెడ్డి సహా ఆరుగురు మాదకద్రవ్యాలు సేవించి దొరికిపోవడం తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపింది.

ఫాం హౌస్‌లు నిన్నటి వరకు ఒక స్టేటస్ సింబల్‌గా వుండేవి. కానీ నేడు ఇవి అరాచక కార్యకలాపాలకు నిలయంగా మారుతున్నాయి. ఫాం హౌ స్‌లలో ఇటీవల కాలంలో డ్రగ్స్ పార్టీలు అనేకం రట్టవగా ఈ సందర్భంగా ఇందులో పాల్గొన్న పలువురు మాదకద్రవ్యాలు సేవించి పోలీసులకు దొరి కిపోరు. ఏడాది క్రితం శంకర్‌పల్లిలో ఓ ప్రముఖుడి ఫాం హౌస్‌లో ఒక నాయకుడి జన్మదిన వేడుకలు జరపగా అర్థరాత్రి దాటిన తరువాత కూడా సంగీతం హోరెత్తడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు దాడిచేశారు.

ఈ సందర్భంగా కొందరు గంజాయి సేవించినస్థితిలో దొరికిపోయారు. నాలుగు నెలల క్రితం ప్రముఖ గాయని జన్మదిన వేడుకలు ఇదే ప్రాంతంలో జరగగా ఈ పార్టీపై పోలీసులు దాడిచేయగా కొందరు గంజాయి తీసు కుని పట్టుబడ్డారు. అంతకు ముందు రాయదుర్గంలో జరిగిన మరో పార్టీలో ఓ ప్రముఖ నాయకుడు, మాజీ మంత్రి బంధువు సహా పలువురు గం జాయి సేవించి పట్టుబడ్డారు. ఫాం హౌస్‌లు ఎక్కువగా వున్న శంకర్‌పల్లి, మోకిల, మొయినాబాద్, అజీజ్‌నగర్‌లలో పార్టీలు ఎక్కువగా జరుగుతుం డగా మెజారిటీ పార్టీల్లో డ్రగ్స్ వాడకం వుందని పోలీసుల గణాంకాలు చెబుతున్నాయి. ఈ పార్టీలకు వస్తున్న వారిలో రాజకీయ రంగానికి చెందిన వారితో పాటు సినీ రంగం వారు ఎక్కువగా వుంటున్నారు. వీరితో పాటు రియల్టర్లు కూడా వుంటున్నారు.

ఇటీవల దుబాయ్‌లో ఓ టాలీవుడ్ నిరా ్మత అనుమానాస్పదస్థితిలో మరణించగా ఆయన డ్రగ్స్ ఎక్కువగా తీసుకోవడం వల్ల మరణించాడని ఆరోపణలు వచ్చాయి. కాగా అంతకు ముందు మరో నిర్మాత సైబరాబాద్ పోలీసులకు డ్రగ్స్‌తో పట్టుబడగా ఆయన ఆరు నెలల క్రితం గోవాలో ఆత్మహత్యకు పాల్పడడం సంచలనం రేపింది. టా లీవుడ్‌కు చెందిన ద్వితీయ శ్రేణీ హీరోలు పలువురు డ్రగ్స్‌తో పట్టుబడ్డ ఉదంతాలు అనేకం వుండడం గమనార్హం.

**గోవాసహా ఉత్తరాది ముఠాలకు లింకులు**

ఇదిలావుండగా హైదరాబాద్ శివార్లలోని ఫాం హౌస్‌లలో వెలుగుచూస్తున్న డ్రగ్స్ పార్టీల వెనుక గోవాతో పాటు ఉత్తరాది డ్రగ్స్ ముఠాల హస్తం వు ందని పోలీసుల విచారణలో తేలడం గమనార్హం. గోవాకు చెందిన అనేక మంది డ్రగ్స్ స్మగ్లర్లు హైదరాబాద్‌తో పాటు మల్కాజిగిరి, సైబరాబాద్ పో లీసులకు పట్టుబడ్డారు. గతంలో వీరంతా నగరంలోని పబ్‌కు డ్రగ్స్ సరఫరా చేసేవారు ఇప్పుడు ఫాం హౌస్‌లలో జరిగే పార్టీలకు అందిస్తున్నారు. తాజా ఘటన నేపథ్యంలో ఫాం హౌస్‌లపై నిఘా కఠినతరం చేయాల్సిన అవసరం వుంది.

# ఇంధన, పారిశ్రామిక వృద్ధికి బొగ్గు మూలస్తంభం

### గనుల మూసివేత స్థిరమైన అభివృద్ధికి కొత్త ప్రారంభం

### సామాజిక, ఆర్థిక, పర్యావరణ ప్రయోజన ఆస్తులుగా మార్పు

### కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త :** భారతదేశ ఇంధన, పారిశ్రామిక అభివృద్ధి, వికసిత్ భారత్ దార్శనికతకు బొగ్గు గ్యాసిఫికేషన్ ఒక ముఖ్యమైన మూలస్తంభంగా ఎదుగుతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి తెలిపారు. బొగ్గు గ్యాసిఫికేషన్ దిగుమతులను తగ్గించడంలో, పారిశ్రామిక సరఫరా గొలుసులను బలోపేతం చేయడంలో సహాయ పడు తుందన్నారు. మహారాష్ట్రలో తన రెండు రోజుల పర్యటనలో రెండవ రోజు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్‌తో కలిసి చంద్రాపూర్‌లో రెండు బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రెండు ప్రాజెక్టులలో రూ.10 వేల కోట్లకుపైగా పెట్టుబడి పెట్టనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులు నిర్ణీత గడువులోపు ఉత్పత్తిని ప్రారంభిస్తాయని, బాధ్యతాయుతమైన మైనింగ్, క్లీన్ కోల్ టెక్నాలజీలకు కొత్త బెంచ్‌మార్క్‌ను నిర్దేశిస్తాయని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అనంతరం వెస్టన్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్‌కు చెందిన ముర్పార్ భూగర్భ గని మూసివేత స్థలాన్ని పరిశీలించారు. ఈ గనిలో బొగ్గు ఉత్పత్తి 2003లో ప్రారంభించగా, ఈ ప్రాంతాన్ని తడోబాఅంధారి టైగర్ రిజర్వ్ యొక్క పర్యావరణసున్నితమైన జోన్‌గా ప్రకటించడంతో దాన్ని మూసివేశారు. దీన్ని పురస్కరించుకుని గనుల మూసివేత అనేది ఒక ప్రాజెక్టు ముగింపు కాదని, స్థిరమైన అభివృద్ధి వైపు కొత్త ప్రారంభమన్నారు.

పర్యావరణ సమతుల్యత పునరుద్ధరణ, సహజ వనరుల పరిరక్షణను నిర్ధారించడానికి గనుల మూసివేత ప్రక్రియను శాస్త్రీయంగా, క్రమపద్ధతిలో అమలు చేయాలని నొక్కి చెప్పారు. గనుల మూసివేత ప్రణాళికలలో స్థానిక సమాజిక ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహించిన వివిధ కార్యక్రమాల ద్వారా, మూసివేసిన గనులను సామాజికంగా, ఆర్థికంగా, పర్యావరణపరంగా ఉపయోగకరమైన ఆస్తులుగా మార్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు.

# శాసనసభ పరిసరాల్లో 3 అంచెల భద్రత.. ముందస్తు నిషేధాజ్ఞలు

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి మొదలవనుండడంతో పోలీసులు భారీ భద్రత చే బట్టారు. ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాలు, ప్రజా సంఘాల ఆందోళన నేపథ్యంలో అసెంబ్లీ పరిసర ప్రాంతాలలో ముందస్తుగా నిషేధాజ్ఞలు విధించారు. ఈ నెలాఖరు వరకు జరగనున్న ఈ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ లోపల, వెలుపలా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చూసేందుకు సాయుధ బలగాలను కూడా రంగంలో దించారు. అసెంబ్లీ సమావేశాలకు సర్కారు సమాయాత్తమవగా పోలీసులు అందుకు అనుగుణంగానే బందోబస్తు ఏర్పాట్లు చేశారు. బడ్జెట్ సమావేశాల్లో ప్ర భుత్వం అన్ని విభాగాలకు కేటాయింపులు జరిపే సంగతి అందరికి తెలిసిందే.

ఈ కేటాయింపుల్లో ఓ విభాగానికి లేదా మరేదైనా వర్గానికి అన్యాయం జరిగిందని అనిపించినా దానికి సంబంధించిన వారు ఆందోళనకు దిగడం విదితమే. ఈ క్రమంలోనే అసెంబ్లీ సమీప ప్రాంతంలో ధర్నాలు చేయడం వీలైతే శాసనసభను ముట్టడించేందుకు ప్రయత్నించడం వంటివి చేయడానికి ప్రతిపక్ష పార్టీలతో పాటు ప్రజా సంఘాలు చేస్తుంటాయి.

ఈ నేపథ్యం లోనే అసెంబ్లీ వద్ద రక్షణ కోసం మూడంచల భద్రతను ఏర్పాటు చేయడంతో పాటు భద్రతా బలగాల కోసం ప్రత్యేకంగా ఓ మార్గాన్ని కూడా ఏర్పా టు చేశారు. ఈ మార్గం ఏర్పాటైన తరువాత అసెంబ్లీ సమావేశాల సమయంలో భద్రతా బలగాలు ఇక్కడ నిరంతరం మోహరించసాగాయి. అయిన ప్పటికీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సమయంలో ఇందిరా పార్కు, సుందరయ్య పార్కుల వద్ద ఆందోళనకు దిగిన ప్రజా సంఘాలు, నిరుద్యోగ సం ఘాలు, ప్రతిపక్ష పార్టీలు చాలాసార్లు పోలీసుల వలయాన్ని ఛేధించుకుని శాసనసభ వరకు దూసుకువచ్చిన ఘటనలు అనేకం వున్నాయి.

ఈ క్రమం లోనే ధర్నాచౌక్, ఇందిరా పార్క్ వద్ద ముందుగానే పోలీసులను మోహరించారు. అసెంబ్లీ లోపలకు కేవలం శాసనసభ్యులు, అనుమతులు వున్న అ ధికారులు, మీడియా సిబ్బంది, విధి నిర్వహణలో వున్న పోలీసులు మినహాయించి ఇతరులు రాకుండా చూడాలని ఉన్నతాధికారులు ఇప్పటికే ఆదే శాలు జారీ చేశారు. అసెంబ్లీ భవనాన్ని పోలీసులు ఇప్పటికే తమ అదుపులోకి తీసుకున్నారు. సోమవారం నుంచి మొదలుకానున్న సమావేశాల కోస ం లోపల, వెలుపల పెద్ద సంఖ్యలో సాయుధ బలగాలను మోహరించారు. సమావేశాలు జరిగే సమయంలో ఆందోళనకారులు అసెంబ్లీ వైపు రాకుం డా వుండేందుకు నాంపల్లి, రవీంద్ర భారతి చౌరస్తా, ఇక్బాల్ మినార్ చౌరస్తా, పబ్లిక్ గార్డెన్ చౌరస్తా, బాబు జగజీవన్ రాం చౌరస్తా, బషీర్‌బాగ్ చౌర స్తా, ఏఆర్ పెట్రోల్ బంకు చౌరస్తాతో పాటు సచివాలయం, తెలుగుతల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జి, బషీర్‌బాగ్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి తదితర ప్రాంతాలలో పోలీసులను మోహరించారు. ఎక్కడైనా తేడావచ్చి ఆందోళనకారులు దూసుకువస్తే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. బడ్జెట్ స మావేశాలు సాఫీగా సాగేందుకు చేబట్టిన భద్రతా ఏర్పాట్లపై సిటీ కొత్వాల్ సజ్జన్నార్ సహా ఇతర ఉన్నతాధికారులు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

# మరో రూ.2,540 కోట్ల అప్పు

### రిజర్వ్ బ్యాంక్‌కు సర్కార్ ఇండెంట్

### ఈ ఆర్థికంలో రూ.85,840 కోట్లకు చేరున్న రుణం

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త :** ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరం చివరి క్వార్టర్, చివరి నెలలో భారీ రుణాన్ని సేకరించాలని నిర్ణయించింది. ఇప్పటికే బడ్జెట్ అంచనాలను అధిగమించిన ప్రభుత్వం తాజాగా మరో రూ.2,540 కోట్ల రుణాన్ని సమీకరించనుంది. ఈ మేరకు దీనికి సంబంధించి రాష్ట్ర ఆర్థిక శాఖ రిజర్వ్ బ్యాంక్ ఇండియాకు ఇండెంట్ పెట్టింది. ఇందుకు గాను అవసరమైన ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లు పెడతామని పేర్కొంది. రిజర్వ్ బ్యాంక్ నేతృత్వంలో బహిరంగ మార్కెట్లో ఈ నెల 17న నిర్వహించబోయే ఈ వేలంలో పాల్గొని, ఈ మొత్తాన్ని తీసుకోనుంది. ఈ రుణాన్ని 19 ఏండ్ల కాల పరిమితితో రూ.540 కోట్లు, 28 ఏండ్ల కాల పరిమితితో రూ.1000 కోట్లు, 30 ఏండ్ల కాలానికి మరో రూ.1000 కోట్లు తీసుకుంటామని ఇండెంట్‌లో తెలిపింది. ఈ రుణానికి సంబంధించి తమకు ప్రతిపాదనలు పంపించినట్టు రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. కాగా 2025-26 రాష్ట్ర వార్షిక అంచనా బడ్జెట్‌లో రూ.54,009 కోట్ల మేర రుణం సేకరించనున్నట్లు పేర్కొంది. ఈ మొత్తం రుణాన్ని దశలవారీగా గతంలోనే తీసుకున్న ప్రభుత్వం ఫిజికల్ రెస్పాన్సిబిలిటీ మేనేజ్‌మెంట్ (ఎఫ్ఆర్‌బిఎం) నుఅధిగమించింది. దీంతో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నుండి ఎఫ్ఆర్‌బిఎంకు మించి అదనపు రుణాన్ని సేకరించేందుకు అనుమతి తీసుకోవడంతో ఇప్పటివరకు సేకరించిన రుణాలు అక్షరాలా రూ.83,300 కోట్లకు (154.23 శాతం)చేరాయి.

# పద్మ పురస్కారాల దరఖాస్తులకు ఆహ్వానం

**న్యూఢిల్లీ, మార్చి 15:** దేశ అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన పద్మ అవార్డులు2027 కోసం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఆదివారం ప్రారంభించింది. 2027 గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ అవార్డులను ప్రకటించనున్నారు. నామినేషన్లు దాఖలు చేయడానికి 2026 జూలై 31 చివరి తేదీ అని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్లు లేదా సిఫార్సులను కేవలం రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ అవార్డ్స్.డాట్‌జివోవీ‌డాట్‌ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరించనున్నట్లు కేంద్రం స్పష్టం చేసింది. 1954లో ప్రారంభమైన ఈ పురస్కారాలను పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ అనే మూడు కేటగిరీలలో ఏటా అందిస్తున్నారు. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక సేవ, సైన్స్, ఇంజనీరింగ్, ప్రజా వ్యవహారాలు, వాణిజ్యం వంటి వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన వారిని ఈ అవార్డులతో సత్కరిస్తారు. ఈ నేపథ్యంలో ప్రతిభావంతులను గుర్తించి నామినేట్ చేయాలని పౌరులను కోరింది. ముఖ్యంగా మహిళలు, బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగులు, సమాజానికి నిస్వార్థ సేవ చేస్తున్న వారిని గుర్తించి సిఫార్సు చేయాలని సూచించింది. పౌరులు తమకు తాముగా కూడా




నామినేషన్ దాఖలు చేసుకునే అవకాశం ఉంది. జాతి, వృత్తి, హోదా, లింగ బేధాలు లేకుండా అందరూ ఈ అవార్డులకు అర్హులే. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు వైద్యులు, శాస్త్రవేత్తలు మినహా వీటికి అనర్హులు.

# మనవడి వేడుకలో పాల్గొనడం గొప్ప జ్ఞాపకంగా ఎప్పటికీ నిలిచి ఉంటుంది: ఏపి సిఎం చంద్రబాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,మార్చి15:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన మనవడు నారా దేవాన్ష్ పంచెకట్టు వేడుకలో పాల్గొనడం పట్ల తన సంతోషాన్ని వెలిబుచ్చారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఈ కార్యక్రమం సంప్రదాయబద్ధంగా జరిగిందని ఆయన తెలిపారు. మన సంస్కృతీ, సంప్రదాయాలను గౌరవిస్తూ నిర్వహించిన ఈ వేడుకలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియాలో స్పందిస్తూ, 'బంధుమిత్రుల ఆశీస్సులతో దేవాన్ష్ నూతన వస్త్ర బహూకరణ కార్యక్రమం సంప్రదాయబద్ధంగా జరిగింది. దేవాన్ష్ సంపూర్ణ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని అన్నారు. అందరి ప్రేమాభిమానాలు, ఆశీస్సులు దేవాన్ష్‌కు ఎల్లప్పుడూ అండగా ఉండాలని ఆకాంక్షి ంచారు. రాజకీయాలతో నిత్యం బిజీగా ఉండే తాను, మన వడితో గడిపిన ఈ క్షణాలు అమూల్యమైనవని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఈ వేడుక తన జీవితంలో ఒక గొప్ప జ్ఞాపకంగా ఎప్ప టికీ నిలిచి ఉంటుందని ఆయన తన మనసులోని మాటను పంచుకున్నారు.

# ధర్మదం నుంచే పినరయి విజయన్ పోటీ

**తిరువనంతపురం, మార్చి 15:** కేరళ అసెంబ్లీ ఎన్నికల నగారా మోగడంతో రాష్ట్రంలో రాజకీయ హడావిడి ఒక్కసారిగా పెరిగింది. అధికార సిపిఎం తమ అభ్యర్థుల ఎంపికను పూర్తి చేసింది. మొత్తం 140 అసెంబ్లీ స్థానాలకు గాను సీపీఐ(ఎం) 86 స్థానాల్లో నేరుగా



పోటీ చేయనుంది. మిగిలిన 54 స్థానాలను లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్)లోని ఇతర మిత్ర పక్షాలకు కేటాయించింది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ తన సొంత గడ్డ అయిన కన్నూర్ జిల్లాలోని ధర్మదం నియోజక వర్గం నుంచి మరోసారి బరిలోకి దిగనున్నారు. ఇది సీపీఐ(ఎం)కు బలమైన కోటగా పేరుగాంచింది. మాజీ ఆరోగ్య మంత్రి, సీనియర్ నాయకురాలు కె.కె. శైలజ ఈసారి కన్నూర్ జిల్లాలోని పేరావూర్ స్థానం నుంచి పోటీ చేయనున్నారు. గత ఎన్నికల్లో ఆమె మట్టనూర్ నుంచి రికార్డు మెజారిటీతో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం పేరావూర్ సీటు కేరళ కాంగ్రెస్ ప్రదేశ్ కమిటీ (కేపీసీసీ) అధ్యక్షుడు సన్నీ జోసెఫ్ ప్రాతినిధ్యంలో ఉంది. అభ్యర్థుల ఎంపిక అత్యంత ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి ఎం.వి. గోవిందన్ తెలిపారు. కేరళలో ఎల్డీఎఫ్ వరుసగా మూడవసారి అధికారంలోకి వచ్చి చరిత్ర సృష్టిస్తుందని సీపీఐ ఎంపీ పి.సంతోష్ కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే అభ్యర్థులు క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని ముమ్మరం చేశారని ఆయన పేర్కొన్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్, ఫలితాల తేదీలను ఎన్నికల సంఘం ఏప్రిల్ 9, 2026 పోలింగ్ నిర్వహిస్తుంది, మే 4, 2026 ఫలితాలు వెలువడనున్నాయి.

# కాంగ్రెస్ అంటేనే హిందూత్వ వ్యతిరేక పార్టీగా మారింది

### బిజెపి రాష్ట్ర కార్యదర్శి కొప్పు భాషా, అధికార ప్రతినిధి కప్పర

**హైదరాబాద్, మార్చి 15 ప్రభాతవార్త:** తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఇటీవల గాంధీ భవన్లో జరిగిన కార్యక్రమంలో ఉపయోగించిన భాష తెలంగాణ సభ్య సమాజాన్ని అసౌకర్యానికి గురిచేసిందని బిజెపి రాష్ట్ర కార్యదర్శి కొప్పు భాషా విమర్శించారు. ఆదివారం పార్టీ కార్యాయలంలో మీడియాతో మాట్లాడారు. ప్రజాప్రతినిధిగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. వేద మంత్రాలతో ఆశీర్వాదం పొందిన వ్యక్తులపై అవమానకర వ్యాఖ్యలు చేయడం హైందవ సమాజ భావోద్వేగాలను దెబ్బతీసే చర్యగా భావించాల్సి వస్తుందని అన్నారు. అలాంటి వ్యాఖ్యలు జరిగినప్పుడు కాంగ్రెస్ వేదికపై ఉన్న నాయకులు స్పందించకపోవడం మరింత ఆందోళన కలిగిస్తుందన్నారు.

కాంగ్రెస్ పార్టీ అంటేనే హిందుత్వ వ్యతిరేక పార్టీగా మారింది. కాంగ్రెస్ పార్టీ చరిత్రలోనే దళిత నాయకులను అవమానించిన అనేక ఉదాహరణలు ఉన్నాయని అన్నారు. హిందూ సమాజంపై, బ్రాహ్మణులు, హిందూ సంప్రదాయాలపై అవమానకర వ్యాఖ్యలు చేసే వారిపై కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. బిజెపి అధికార ప్రతినిధి కప్పర ప్రసాద్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నిర్మాణం, దాని ఆలోచనా విధానం, దాని ప్రవర్తనను పరిశీలిస్తే సనాతన ధర్మం, హిందూ భావజాలం, హిందూ దేవీదేవతల పట్ల గౌరవ భావన కనిపించడం లేదనే అభిప్రాయం మరింత బలపడుతుందన్నారు. ఇందుకు గాంధీ భవన్‌లో జరిగిన కార్యక్రమం మరో స్పష్టమైన ఉదాహరణగా నిలిచిందన్నారు.


# 14 నెలల శిశువును హత్య చేసిన కసాయి తల్లి

**హైదరాబాద్ (మెహిదీపట్నం), మార్చి 15, ప్రభాతవార్త :** కుటుంబ కలహాల కారణంగా ఓ కసాయి తల్లి, కన్న కూతురుని హత్య చేసిన సంఘటన గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ సైదులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి...గోల్కొండ రిసాల బజార్ కు చెందిన అమీర్ అలీ ఆటో డ్రైవర్. 2023లో స్థానికంగా ఉన్న గౌసియా బేగం (23) ఇరువురు ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు. ఈ క్రమంలో వీరి ఇరువురికి ఉమ్మె ఇమాన్ 14 నెలల శిశువు ఉంది. అయితే ఇంట్లో నిత్యం గొడవలు జరుగుతుండడంతో గౌసియా బేగం తన 14 నెలల కూతురిని ఆదివారం సాయంత్రం దిండుతో ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు ఆరోపణలు రావడంతో వెంటనే అలీ తల్లిదండ్రులు స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే శిశువు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించడంతో పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు మృతురాలు శిశువు తల్లిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ముంబైలో రూ.50 వేలకు పసిబిడ్డ విక్రయం

### కసాయిగా మారిన కన్నతల్లి.. జగిత్యాలలో దారుణం

**జగిత్యాల రూరల్, ప్రభాతవార్త:** కన్నతల్లి అంటే ప్రేమకు ప్రతిరూపం.కానీ ఇక్కడ ఆ తల్లే కసాయిగా మారింది. ప్రేమ వివాహం చేసుకుందన్న కక్షతో కూతురిని భర్త నుంచి విడదీయడమే కాకుండా,ఆమె గర్భాన పుట్టిన పసికందును అంగడి సరుకులా అమ్మేసింది. జగిత్యాల జిల్లాలో వెలుగుచూసిన ఈ అమానుష ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. వివరాలు ఇలా ఉన్నాయి జగిత్యాల మండలం తిప్పన్నపేటకు చెందిన అశ్విని, జగిత్యాల పట్టణానికి చెందిన సాయికుమార్ గత ఏడాది ఫిబ్రవరి లో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అయితే వీరి వివాహం అశ్విని తల్లికి ఇష్టం లేదు. కూతురు గర్భవతి కావడంతో, ప్రేమగా నటిస్తూ ఫార్మాలిటీస్ పేరుతో





ఇంటికి తీసుకెళ్లింది. అక్కడే అసలు డ్రామా మొదలైంది. అశ్వినిని భర్తతో కలవనీయకుండా నిర్బంధించి, చిత్రహింసలకు గురిచేసింది.ఎవరికీ అనుమానం రాకుండా అశ్వినిని జగిత్యాల నుంచి ముంబైకి తరలించారు. అక్కడ ఆమె మగబిడ్డకు జన్మనివ్వగానే, తల్లి, ఆమె బావ కలిసి ఆ పసికందును 50 వేల రూపాయలకు గుర్తుతెలియని వ్యక్తికి విక్రయించారు. బిడ్డ ఏడి అని అడిగితే పొంతన లేని సమాధానాలు చెబుతూ అశ్వినిని తిరిగి జగిత్యాలకు తీసుకొచ్చారు.

ఇటీవల వారి బారి నుంచి అతికష్టమ్మీద తప్పించుకున్న అశ్విని, తన భర్త సాయికుమార్‌ను చేరుకుని జరిగిన ఘోరాన్ని వివరించింది. కన్నబిడ్డను అమ్ముకున్న కసాయిల నుంచి తన బాబును కాపాడాలని ఈ నెల 7వ తేదీన జగిత్యాల రూరల్ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదుతో కదిలిన పోలీసులు. అశ్విని తల్లి, బావపై కేసు నమోదు చేశారు. అసలు ఆ పసికందు ఇప్పుడు ఎక్కడ ఉన్నాడు? కొనుగోలు చేసిన వ్యక్తులు ఎవరు? అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు.

# సాగర్ హైవేపై ఘోర ప్రమాదం.. ముగ్గురు మృతి

### ఎనిమిది మందికి తీవ్రగాయాలు

**నల్గొండ (నాంపల్లి), మార్చి 15, ప్రభాతవార్త:** నల్గొండ జిల్లా నాగార్జున సాగర్ హైదరాబాద్ హైవే పై దేవత్ పల్లి గేటు సమీపంలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని రేఖ్య తాండ గ్రామ పంచాయతీలో లోని వస్త్రంతాండా పరిధిలో ఇటుక లోడుతో కొండమల్లేపల్లి నుండి ఏపీ 29యు 7795 నెంబర్ గల లారీ మల్లేపల్లి నుండి హైదరాబాదుకు వెళుతుండగా వస్త్రం తండా సమీపంలో 12 మంది ప్యాసింజర్ తో చింతపల్లికి వెళ్తున్న ఆటో నంబర్ ఏపీ 24టిసి 5299 ను వెనక నుండి వచ్చిన లారీ ఢీ కొట్టింది. చింతపల్లి మండలం కోర్ర మాన్ సింగ్ తండాకు కు చెందిన ఆటో డ్రైవర్ కోర్ర భద్ర(57) , బీహార్ రాష్ట్రానికి చెందిన సంతోష్ ఖలీఫా(40) ఆంధ్రప్రదేశ్ బాపట్ల జిల్లాకు చెందిన బండారు ఇషాక్ (55) లు స్పాట్లోనే మృతిచెందారు.

ఆటోలో ప్రయాణిస్తు తీవ్ర గాయాలైన 8 మందిని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సంతోష్ ఖలీఫా ఇటుక బట్టీలు కార్మికుడిగా పనిచేస్తుండగా బండారు ఇసాక్ తోటలు కౌలుకు తీసుకుని జీవనం సాగిస్తున్నాడు. మృతి చెందిన ఆటో డ్రైవర్ కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాంపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ దూది రాజు పర్యవేక్షణలో ఎస్సై లింగారెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

# వలిగొండలో ఘోర ప్రమాదం

### లారీ, బైక్ ఢీకొని ఇద్దరు దుర్మరణం

**వలిగొండ, మార్చి 15. ప్రభాతవార్త:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలో ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదాన్ని మిగిల్చింది. అరూరు గ్రామ శివారు తొర్రూరు రోడ్డుపై లారీ, బైక్ ఢీకొనడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు.పోలీసుల సమాచారం ప్రకారం వలిగొండ నుంచి తొర్రూరు వైపు వెళ్తున్న లారీని, తొర్రూరు నుంచి వలిగొండ వైపు వస్తున్న బైక్ ఎదురెదురుగా ఢీకొట్టింది. ఢీకొట్టిన ప్రభావం తీవ్రంగా ఉండడంతో బైక్ పూర్తిగా ధ్వంసమైపోయింది. బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడి ఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వలిగొండ ఎస్ఐ యుగేందర్ గౌడ్ తన సిబ్బందితో వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాల వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా ఒకరిని అనురాగ్ రాయ్ (28)గా గుర్తించారు. అతను వెస్ట్ బెంగాల్ రాష్ట్రంలోని బంకుర జిల్లా బంగ్లా హిందూపూర్ ప్రాంతానికి చెందినవాడని ప్రస్తుతం స్వరాజ్ నగర్, బోరబండ, హైదరాబాదులో నివాసముంటున్నట్టు పోలీసులు తెలిపారు. మరో యువకుడి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

### పైలట్ రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో డ్రగ్స్ పార్టీ గుట్టురట్టు వెనుక

# ఈగల్, ఫోర్త్‌సిటీ పోలీసుల ముప్పేట దాడి

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** నగర శివార్లలోని మొయినాబాద్ అజీజ్‌నగర్‌లో గల మాజీ ఎంఎల్ఎ పైలట్ రోహిత్ రెడ్డి ఫాం హౌస్‌లో జ రిగిన డ్రగ్స్ పార్టీని ఈగల్, ఫోర్త్ సిటీ పోలీసులు రట్టు చేయడం వెనుక భారీ ఆపరేషన్ కొనసాగింది. ఈ పార్టీలో ప్రముఖులు వున్నట్లు, ఇందులో డ్రగ్స్ వాడుతున్నట్లు సమాచారం అందుకున్న ఈగల్ పోలీసులు దీనిపై స్థానిక పోలీసుల సహకారంతో శనివారం రాత్రి పది గంటల సమయంలో దాడులు చేయడం తెలిసిందే. దాడి చేసేముందు పోలీసులు ఫాం హౌస్‌లో వెళ్లి స్పీకర్లతో తాము పోలీసులమని హెచ్చరించడంతో పాటు పార్టీలో డ్రగ్స్ వాడుతున్నట్లు తమకు సమాచారం వుందని, తాము సోదాలు చేయడానికి వచ్చామని, తమకు సహకరించాలని కోరారు. ఈ సమయంలో పా ర్టీలో వున్న ఓ వ్యక్తి నాలుగు రౌండ్లు పోలీసులను బెదిరిస్తూ గాలిలో నాలుగు రౌండ్లు కాల్పులు జరిపాడు. ఈ నేపథ్యంలో పోలీసులు మరోసారి స్పీ కర్లలో హెచ్చరించారు. పోలీసులపై కాల్పులు జరిపితే పరిణామాలు తీవ్రంగా వుంటాయని హెచ్చరించడంతో పాటు పార్టీ జరుగుతున్న భవనంలోకి బలవంతంగా ప్రవేశించారు. ఈ సమయంలో అక్కడ ఒక మహిళతోపాటు 11 మంది వున్నారు. వీరంతా మద్యం మత్తులో వుండగా కొందరు డ్ర గ్స్ సేవించినట్లు అనుమానాలు వుండడంతో అందరికి డ్రగ్స్ పరీక్షలు జరిపారు. ఇదే సమయంలో వాష్ రూం వద్ద చేతిలో ఎ32 కాలిబర్ రివాల్వ ర్‌ను పట్టుకుని వుండగా అతన్ని పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. అతని పేరు నమిత్ శర్మగా తేలింది. ఇతని చేతిలో వున్న రివాల్వర్ జర్మనీలో తయారైనట్లు తేలింది. ఇతనికి సమీపంలో మరో వ్యక్తి ఖాళీ తూటా పట్టుకుని వుండగా అతన్ని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఇతన్ని సిల్వేరి శరత్‌కుమార్‌గా గుర్తించారు. ఇతని వద్ద .26 గ్రాముల కొకైన్, భారీగా మద్యం సీసాలు పట్టుబడ్డాయి. రివాల్వర్ పట్టుకున్న నమిత్ శర్మ పోలీసులపై కాల్పులు జరిపినట్లు తేలింది. ఈ రివాల్వర్ రోహిత్ రెడ్డి సోదరుడు రితేష్ రెడ్డిదిగా తేలింది. ఘటనా స్థలంలో తూటాతో పాటు మొత్తం 4 ఖాళీ తూటాలు లభ్యమ య్యాయి. రివాల్వర్‌తోపాటు తూటాను, ఖాళీ తూటాలను పరీక్షల నిమిత్తం ఎఫ్ఎస్ఎల్‌కు పరీక్షల నిమి త్తం పంపారు. కాగా ఈ ఆపరేషన్‌పై ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా ఆదివారం నాడు మీడియాకు ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామని, రోహిత్ రెడ్డి ఫాం హౌస్‌పై జరిగిన దాడికూడా పక్కా సమాచారం తోనే జరిగిందని ఆయన తెలిపారు. డ్రగ్స్‌కు సంబం ధించి ఎవరి వద్ద ఎలాంటి సమాచారం వున్నా 1908 లేదా 8712671111కు వెంటనే ఫోన్‌చేసి సమాచారం అందించాలని ఆయన కోరారు. సమా చారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా వుంచుతామని ఆయన వెల్లడించారు.

# ప్రభుత్వంపై బురద చల్లడం బిజెపి, బిఆర్ఎస్ అజెండా : ఎంపి చామల

**హైదరాబాద్, మార్చి 15,ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద చల్లడం బిఆర్ఎస్,బిజెపిల అజెండాగా మారిందనీ భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. కెసిఆర్ కుటుంబ పాలనను తెలంగాణ ప్రజలు పదేళ్లు చూశారనీ,రేవంత్ రెడ్డి పాలనలో ఇళ్ళు కూలగొడుతున్నారనీ,కట్టడం లేదని కెటిఆర్ అసత్య ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కెటిఆర్ ఎక్కడికి వస్తావో చెప్పు నీ సిరిసిల్ల రావాలా నువ్వు భువనగిరికి వస్తావా ప్రతి నియోజకవర్గానికి కాంగ్రెస్ ప్రభుత్వం 3,500 ఇళ్ళు ఇచ్చింది చూడు అని సవాల్ చేశారు. తెలంగాణ ప్రజలు కెటిఆర్ మాటలను నమ్మవద్దు అని ఆయన కోరారు. కెటిఆర్ ఫేక్ ప్రచారాలు బంద్ చేయాలనీ కోరారు. రేవంత్ రెడ్డిపై కెటిఆర్‌కు అక్కసు ఎందుకు నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర కెటిఆర్ పోషించాలనీ అన్నారు. గాంధీ సరోవర్ 70 కోట్లు అవుతుందని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారుకానీ గాంధీ విగ్రహం 5 వేల కోట్లు అవుతుందని కెటిఆర్ అసత్య ప్రచారం చేస్తున్నారనీ ఆవేదన చెందారు.

# అల్కరాజ్ జైత్రయాత్రకు మెద్వదెవ్ బ్రేక్


సిన్నర్‌తో మెద్వదెవ్ టైటిల్ ఫైట్
అల్కరాజ్ వరుస 16 విజయాలకు బ్రేక్

**కాలిఫోర్నియా:** ప్రపంచ నంబర్‌వన్ కార్లోస్ అల్కరాజ్ వరుస విజయాలకు బ్రేక్ పడింది. ఇండియానా వెల్స్ ఓపెన్‌లో స్పెయిన్ స్టార్ అల్కరాజ్ జైత్రయాత్రకు రష్యా ప్లేయర్ డానిల్ మెద్వదెవ్ బ్రేక్ వేశాడు. పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో మెద్వదెవ్ 6-3, 7-6తో వరుస సెట్లలో అల్కరాజ్‌పై గెలుపొందాడు.నాలుగు ఏస్‌లు సంధించిన మెద్వదెవ్... తొలి సెట్‌ను సులువుగా కైవసం చేసుకున్నాడు. అయితే రెండో సెట్‌లో అల్కరాజ్ నుంచి గట్టిపోటీ ఎదురైంది. ఇద్దరూ పోటాపోటీగా తలపడడంతో రెండో సెట్ రసవత్తరంగా సాగింది. మ్యాచ్ టై బ్రేక్ వరకు వెళ్లింది. టై బ్రేక్‌లో అల్కరాజ్ ఒత్తిడికి గురై రెండు డబుల్ ఫాల్ట్‌లు చేయడంతో మెద్వదేవ్ ఖాతాలో రెండో సెట్ చేరింది. ఈ విజయంతో మెద్వదెవ్ ఫైనల్లో ప్రవేశించారు. ఇండియన్ వెల్స్ టోర్నీలో మెద్వదెవ్ ఫైనల్ చేరడం ఇది మూడోసారి. 2023, 2024లో ఫైనల్ చేరినా రన్నరప్‌తోనే సరిపెట్టాడు. అల్కరాజ్ వరుస 16 విజయాలకు బ్రేక్ పడింది.

మరో సెమీస్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ జానిక్ సిన్నర్ 6-2, 6-4తో నాలుగో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్‌ను ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించాడు. సోమవారం జరగనున్న పురుషుల సింగిల్స్ ఫైనల్లో సిన్నర్‌తో మెద్వదెవ్ అమీతుమీ తేల్చుకోనున్నాడు.

# డ్రామాలు చేస్తే కుదరదు: జైషా

## పాక్, బంగ్లాకు వార్నింగ్



**ముంబై:** క్రికెట్‌లో ఐసీసీనే సుప్రీం అని పరోక్షంగా పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లు చురకలంటించాడు ఐసీసీ ఛైర్మన్ జైషా. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్, బంగ్లాదేశ్ నాటకాలపై ఎట్టకేలకు జైషా మౌనం వీడారు. భారత్‌లో ఆడేందుకు నిరాకరించిన బంగ్లా దేశ్ టోర్నీ నుంచి తప్పుకుంది. బంగ్లాదేశ్‌కు సంఘీ భావంగా పాకిస్థాన్ కూడా టీ20 ప్రపంచకప్‌లో టీమిండియాతో జరిగే మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేస్తానని బెదిరించింది. చివరకు యూటర్న్ తీసుకుని మ్యాచ్ ఆడింది. టీ20 ప్రపంచకప్ ముగిసిన వారం రోజులకు జైషా దీనిపై స్పందించాడు. ముంబైలో జరిగిన ఇండియన్ బిజినెస్ లీడర్ అవార్డులలో మాట్లాడుతూ.. కొన్ని జట్ల డ్రామాలతో టోర్నమెంట్ ఎలా ప్రమాదంలో పడిందో వెల్లడించారు. కొన్ని జట్లు పాల్గొన బోమని బెదిరింపులకు దిగినా, వాటన్నింటినీ అధిగమించి విజయవంతంగా మెగా టోర్నీ నిర్వహించినట్లు చెప్పారు. ఐసీసీ కంటే ఏ జట్టు గొప్పది కాదని స్పష్టం చేశారు.

### పాక్‌పై బంగ్లాదే సిరీస్

**మిర్పూర్:** బంగ్లాదేశ్ సొంతగడ్డపై పాకిస్థాన్‌ను ఓడించి మూడు వన్డేల సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది. మిర్పూర్ వేదికగా జరిగిన మూడో, చివరి వన్డేలో పాకిస్తాన్‌ను11రన్స్‌తో ఓడించింది. టాంజిద్ హసన్(107 బంతుల్లో 107 రన్స్) శతకంకు తోడు లిటన్ దాస్(41), తౌహిద్48) రాణించడంతో బంగ్లాదేశ్ 50ఓవర్లలో 5 వికెట్లకు 290 రన్స్ చేసింది. అనంతరం లక్ష్య చేధనలో విఫలమైన పాక్ 279 రన్స్‌కు ఆలౌటైంది.కెప్టెన్ సల్మాన్ అఘా(98బంతుల్లో 106 రన్స్) సెంచరీతో ఒంటరిపోరాటం చేశాడు. బంగ్లాదేశ్ బౌలర్లలో టస్కిన్ 4, ముస్తాఫిజుర్ 3 వికెట్లు తీశారు.

# సౌతాఫ్రికా దెబ్బకు కివీస్ విలవిల



**మౌంట్ మంగన్యూ:** న్యూజిలాండ్ పర్యటనను దక్షిణాఫ్రికా ఘనంగా ఆరంభించింది. అయిదు టీ20ల సిరీస్‌లో భాగంగా మౌంట్ మంగన్యూ వేదికగా జరిగిన తొలి టీ20లో న్యూజిలాండ్‌పై 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన కివీస్.. సౌతాఫ్రికా బౌలర్ల ధాటికి 14.3 ఓవర్లలో 91 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్లఉ కాన్వే(1), లాథమ్(7), రాబిన్సన్(6),నిక్ కెల్లీ(2) సింగిల్ డిజిట్‌కే అవుటై నిరాశపరిచారు. దీంతో 21 పరుగులకే నాలుగు టాప్ ఆర్డర్ వికెట్లు కోల్పోయి కివీస్ కష్టాల్లో పడింది. మధ్యలో జేమ్స్ నిషమ్(26), మికెల్ సాంట్నర్(15) ఆదుకునే ప్రయత్నం చేసినా.. ఆ వెంటనే వేగంగా వికెట్లు కోల్పోయింది. నలుగురు బ్యాట్స్‌మన్ మాత్రమే డబుల్ డిజిట్ దాటారు. సౌతాఫ్రికా బౌలర్లలో కొబాని 3 వికెట్లు... గెరాల్డ్, బార్ట్‌మన్, కేశవ్ మహారాజ్ తలా రెండేసి వికెట్లు పడగొట్టారు.

92 పరుగుల లక్ష్యాన్ని సౌతాఫ్రికా మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి 16.4ఓవర్లలో చేధించింది. టోనీ, రూబిన్ హెర్మాన్ వికెట్లను 28 పరుగులకే కోల్పోయినా.. మరో ఓపెనర్ ఎస్టర్ హ్యూజెన్ ధాటిగా ఆడుతూ 48 బంతుల్లో 45 పరుగులతో అజేయంగానిలిచి సౌతాఫ్రికాకు గెలుపందించాడు. ఇరు జట్ల మధ్య రెండో టీ20 హామిల్టన్ వేదికగా మార్చి 17న జరగనుంది.


# కార్యదర్శిగా జీవన్ రెడ్డి, ట్రెజరర్‌గా అనిల్ ఎన్నిక

**హైదరాబాద్, మార్చి 15(వార్త క్రీడా ప్రతినిధి)**

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శిగా మన్నె జీవన్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, ఉత్కంఠ రేపిన కోశాధికారి పదవిలో అనిలల్ కుమార్ గెలుపొందారు. రెండు పోస్టులకు మధ్యంతర ఎన్నికలు నిర్వహించారు. కార్యదర్శి పదవికి మన్నె జీవన్ రెడ్డి ఒక్కరే నామినేషన్ వేయడంతో అతని ఎన్నిక ఏకగ్రీవమైంది.

ఆదివారం ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో కోశాధికారి పదవికి ఎన్నికలు జరిగాయి.పెద్దసంఖ్యలో సభ్యులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం జరిగిన ఓట్ల లెక్కింపు ట్రెజరర్ పదవికి హోరాహోరీ పోరు సాగింది. ఈ ఎన్నికల్లో అనిల్ కుమార్ తన సమీప ప్రత్యర్థి డాక్టర్ హరినారాయణ్‌పై రెండు ఓట్ల స్వల్ప మెజారిటీతో విజయం సాధించారు. మొత్తం పోలైన ఓట్లలో అనిల్ కుమార్‌కు 61 ఓట్లు రాగా, హరినారాయణ్‌కు 59 ఓట్లు లభించాయి. ట్రెజరర్ బరిలో నిలిచిన ఇతర అభ్యర్థులలో ఆగం రావుకు 26 ఓట్లు, బాబూ రావుకు 6 ఓట్లు వచ్చాయి. గెలుపొందిన అభ్యర్థులు మన్నె జీవన్ రెడ్డి, అనిల్ కుమార్‌లకు ఎన్నికల అధికారిగా వ్యవహించిన సంపత్ కుమార్ ధృవీకరణ పత్రాలను అందజేశారు.

హెచ్‌సీఏ అభివృద్ధికి, క్రికెట్ కార్యకలాపాల మెరుగుదలకు కృషి చేస్తామని ఈ సందర్భంగా మన్నె జీవన్ రెడ్డి, అనిల్ కుమార్ పేర్కొన్నారు.గతంలో లాగా కాకుండా క్రికెట్ వ్యవహారాలను పారదర్శకుండా నిర్వహిస్తామని జీవన్ రెడ్డి చెప్పారు. హైదరాబాద్‌కే క్రికెట్‌ను పరిమితం చేయకుండా తెలంగాణలోని అన్ని జిల్లాలో క్రికెట్ స్టేడియాలు, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. తద్వారా హెచ్‌సీఏ లీగ్‌లను జిల్లాల్లోనూ నిర్వహించే ప్రణాళిక చేయనున్నట్లు మన్నె జీవన్ రెడ్డి, అనిల్ కుమార్ వెల్లడించారు.


గెలుపొందిన వారికి ధృవీకరణ పత్రాలను అందజేస్తున్న ఎన్నికల అధికారి సంపత్ కుమార్



తొలి కప్ ముద్దాడిన వేళ ఆంటోనెల్లి భావోద్వేగం

# చైనా గ్రాండ్ ప్రి విజేత ఆంటోనెల్లి

**షాంఘై:** 19 ఏళ్ల ఇటాలియన్ కిమి ఆంటోనెల్లి తొలిసారి ఫార్ములా వన్ నెగ్గాడు. గ్రాండ్ ప్రి నెగ్గిన రెండో అతిపిన్న వయస్కుడిగా నిలిచాడు. షాంఘై వేదికగా జరిగిన చైనా గ్రాండ్ ప్రి పార్ములాను పోల్ టాప్‌తో ప్రారంభించినఆంటోనెల్లి ఆరంభంలో వెనకబడ్డాడు.మధ్య ల్యాప్‌లలో వేగంగా దూసుకుపోయాడు. మెర్సిడెస్ సహచరుడు జార్జ్ రస్సెల్ కంటే 5 సెకన్ల ముందు పూర్తి చేసి విజేతగా ఆవిర్భవించాడు. మెర్సిడెస్ డ్రైర్ జార్స్ రస్సెల్ రెండో స్థానంలో, ఫెరారీ డ్రైవర్ లూయిస్ హామిల్టన్ మూడో స్థానంలో నిలిచారు.తొలి రెండు స్థానాలు మెర్సిడేస్‌కు దక్కగా, లూయిస్ హామిల్టన్ ఫెరారీ కోసం తన తొలి పోడియం దక్కించుకున్నాడు.477రోజుల తర్వాత లూయిస్ హామిల్టన్ పోడియంపై నిలిచాడు. 2024లో లాస్‌వేగాస్ గ్రాండ్ ప్రి తర్వాత హామిల్టన్‌కు ఇది మొదటి పోడియం.చైనా గ్రాండ్ ప్రి నెగ్గిన తర్వాత కిమి ఆంటోనెల్లి భావోద్వేగానికి గురయ్యాడు. అనంతరం షాంపెన్‌తో విజయ సంబరాలు చేసుకున్నాడు.మెర్సిడేస్ సహచరులు అతన్ని అభినందించారు.గెలిచిన తర్వాత మాటలురాలేదని ఆంటోనెల్లి అన్నాడు. ఈ కలను సాధించడంతో తనకు సహాయం చేసిన జట్టుకు ధన్యవాదాలు తెలిపాడు. ఛాంపియన్ రస్సెల్.. యువ సహచరుడు ఆంటోనెల్లిని ఛాంపియన్ రేసులో ముందున్న రస్సెల్ పశ్రం సలతో ముంచెత్తాడు. మొదటి రేసును గెలవడం ఎల్లప్పుడూ చాలా ప్రత్యేకమైందన్నాడు.

# బహ్రెయిన్, యుఎఇ ఫార్ములావన్ రద్దు

**అబుదాబి:** పశ్చిమాసియా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో 2026 సీజన్‌లో జరగాల్సిన బహ్రెయిన్, సౌదీ గ్రాండ్ ప్రి రేసులను రద్దు చేస్తున్నట్లు ఫార్ములా వన్ యాజమాన్యం అధికారికంగా ప్రకటించింది. క్రీడాకారులు, సిబ్బంది భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం.. ఏప్రిల్ 12న బహ్రెయిన్ గ్రాండ్ ప్రి, ఏప్రిల్ 19న సౌదీ అరేబియా గ్రాండ్ ప్రి రేసులు జరగాలి ఉంది. ఈ రద్దు వల్ల 2026 ఫార్ములా వన్ ఛాంపియన్‌షిప్ రేసుల సంఖ్య 24 నుంచి 22 కి పడిపోయాయి. ఇప్పటికే బిజీగా ఉన్న షెడ్యూల్ కారణంగా, ఈ రేసులను మళ్ళీ నిర్వహించే అవకాశం లేదని తెలుస్తోంది. ఇక, మార్చి 29న జరగనున్న జపాన్ గ్రాండ్ ప్రి తర్వాత, నేరుగా మే 3న మయామి గ్రాండ్ ప్రిక్స్ జరగనుంది. దీంతో సీజన్ మధ్యలో ఐదు వారాల గ్యాప్ ఏర్పడింది.



# ఈవారం మార్కెట్లకు మూడు ఐపిఒలు




**ముంబయి, మార్చి 15:** దేశీయ స్టాక్ మార్కెట్లో పబ్లిక్ ఇష్యూల సందడి కొనసాగుతోంది. ఈ వారం ప్రైమరీ మార్కెట్లో మూడు ఐపిఒలు సబ్‌స్క్రిప్షన్ కోసం ఓపెన్ అవుతున్నాయి. ఇందులో రెండు మెయిన్‌బోర్డ్ నుంచి వస్తున్నాయి. అదనంగా మూడు కంపెనీల స్టాక్స్ ఈ వారమే మార్కెట్లో లిస్టింగ్ అవుతున్నాయి. ప్రస్తుతం స్టాక్ మార్కెట్లో తీవ్ర అనిశ్చితి నెలకొంది. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం కారణంగా చమురు ధరలు పెరిగి మార్కెట్లు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పలు కంపెనీలు పబ్లిక్ ఇష్యూకు వస్తున్నాయి. అతిపెద్ద ఐపీఓగా ఆగ్రోకెమికల్ తయారీ కంపెనీ జీఎస్‌పీ క్రాప్ సైన్స్ మార్కెట్ నుంచి రూ.400 కోట్లు సమీకరించనుంది. ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ కోసం సోమవారం 16వ తేదీన వస్తుండగా 18వ తేదీ వరకు కొనసాగుతుంది ఇష్యూ ప్రైస్ బ్యాండ్ రూ.304 నుంచి రూ.320గా నిర్ణయించారు. ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.240 కోట్ల విలువైన షేర్లు, రూ.160 కోట్లు విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయిస్తోంది. కనీసం 46 షేర్లు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. మెయిన్ బోర్డ్ నుంచి వస్తున్న రెండో కంపెనీ సీఎంపీడీఐ అనే కంపెనీ ఐపీఓకు వస్తోంది. ప్రభుత్వ రంగ కంపెనీ అయిన కోల్ ఇండియా అనుబంధ కన్సల్టెన్సీ సర్వీసెస్ సంస్థ ఇది. ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ 20వ తేదీన ప్రారంభమయి 24వ తేదీ వరకు కొనసాగుతుంది. పూర్తి ఆఫర్ ఫర్ సేల్ ద్వారా 10.71 కోట్ల షేర్లను విక్రయిస్తోంది. ప్రభుత్వం, కోల్ ఇండియా కంపెనీలు తమ వాటాను విక్రయిస్తున్నాయి. ఈ కంపెనీ బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో మార్చి 30న లిస్టింగ్ కానుంది. ఎస్ఎంఈ సెగ్మెంట్ నుంచి ఈ కంపెనీ ఈ వారం పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. నోవస్ లాయాల్టీ లిమిటెడ్ ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ 17వ తేదీన ప్రారంభమయి 20వ తేదీ వరకు కొనసాగుతుంది. ప్రైస్ బ్యాండ్ రూ.139 నుంచి రూ.146గానిర్ణయించారు. మొత్తం రూ.60.15 కోట్లు సమీకరించనుంది. ఈ వారం మూడు కంపెనీలు స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ కానున్నాయి. రాజ్‌పుతన స్టెయిన్ లెస్, అప్సిస్ ఏయిరోకామ్, రాజ్‌మార్క్ ఇన్‌ఫ్రా ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ కంపెనీలు ఉన్నాయి.

# భారత్‌లో 229 మంది బిలియనీర్లు



**ముంబయి, మార్చి 15:** ప్రముఖ మ్యాగజైన్ ఫోర్బ్స్ 2026 సంవత్సరానికి గాను ప్రపంచ కుబేరుల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో అత్యధిక బిలియనీర్లు ఉన్న దేశంగా అమెరికా తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకోగా, చైనా రెండో స్థానంలో కొనసాగుతోంది. 229 మంది బిలియనీర్లతో భారత్ మూడో స్థానంలో నిలిచి తన సత్తాను చాటింది. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం అమెరికాలో 989 మంది, చైనాలో 610 మంది కుబేరులు ఉన్నట్లు వెల్లడైంది. గత ఏడాదితో పోలిస్తే ప్రపంచవ్యాప్తంగా బిలియనీర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. కొత్తగా 390 మంది ఈ జాబితాలో చేరడంతో మొత్తం కుబేరుల సంఖ్య 3,400 దాటింది. సగటున రోజుకు ఒకరు బిలియనీర్‌గా మారారన్నమాట. భారత్ తర్వాత జర్మనీ (212), రష్యా (147) దేశాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ ఏడాది జాబితాలో ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ దేశాల నుంచి కూడా తొలిసారిగా బిలియనీర్లు చోటు దక్కించుకోవడం విశేషం. ఈ జాబితాలో యువత సత్తా చాటడం మరో ముఖ్యమైన అంశం. భారత సంతతికి చెందిన 22 ఏళ్ల సూర్య మిధా, స్వశక్తితో అత్యంత పిన్న వయస్కుడైన బిలియనీర్‌గా రికార్డు సృష్టించారు. తన స్నేహితులతో కలిసి స్థాపించిన మెర్కార్ అనే ఏఐ రిక్రూటింగ్ టూల్ అతడిని ఈ స్థాయికి చేర్చింది. బ్రెజిల్‌కు చెందిన 20 ఏళ్ల అమెలీ వోయిగ్ట్ ట్రెజెస్ వారసత్వ సంపదతో ప్రపంచంలోనే అత్యంత పిన్నవయస్కురాలైన బిలియనీర్‌గా నిలిచారు. వీరితో పాటు పలువురు ప్రముఖ సెలబ్రిటీలు కూడా 2026లో బిలియనీర్ల క్లబ్‌లో అడు గుపెట్టారు. వీరిలో అమెరికన్ పాప్ సింగర్ బెయాన్సే, టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్, ర్యాపర్ డాక్టర్ డ్రే, హాలీవుడ్ దిగ్గజ దర్శకుడు జేమ్స్ కామెరాన్ వంటి వారు ఉన్నారు.

# దుబాయ్, అబుదాబీలకు విమాన సర్వీసులు నిలిపివేత

**న్యూఢిల్లీ, మార్చి 15:** పశ్చిమాసియా యుద్ధంలో ఇరాన్ అమెరికామిత్రదేశాల ఎయిర్‌పోర్టులు, మిలిటరీబేస్‌లే లక్ష్యంగా దాడులుచేస్తుండటంతో ఎయిర్‌పోర్టులు మూతపడుతున్నాయి. ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థలు పశ్చిమాసియాలోని నగరాలకు వెళ్లాల్సిన పలు విమానాలను రద్దు చేశాయి. దుబాయ్, అబుదాబి,ఇతర గల్ఫ్‌ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇండిగో సంస్థ కూడా దుబాయ్‌కు నడిపే తన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. యుద్ధం కారణంగా గగనతలంలో నెలకొన్న అస్థిరత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థలు తెలిపాయి. విమానాలు రద్దయిన నేపథ్యంలో ప్రయాణికులకు పూర్తి రిఫండ్ లేదా తదుపరి అందుబాటులో ఉన్న విమానాల్లో ఉచితంగా టికెట్ మార్చుకునే సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు ఎయిర్ ఇండియా తెలి పింది. ప్రయాణానికి సిద్ధమయ్యే ముందు విమా నయాన సంస్థల అధికారిక వెబ్‌సైట్లు లేదా మొబైల్ యాప్‌ల ద్వారా తమ ఫ్లైట్ స్టేటస్‌ను సరిచూసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేస్తు న్నారు.ఇరాన్‌అమెరికా మధ్య క్షిపణి దాడులు జరు గుతున్న తరుణంలో యూఏఈ ప్రభుత్వం తమ గగనతలం, విమానాశ్రయాలపై కఠిన ఆం క్షలు విధించింది. క్షిపణుల ముప్పు పొంచి ఉన్నందున అంతర్జాతీయ విమానాల రాకపోకలను పరిమితం చేశారు.



# ఫ్లిప్‌కార్ట్‌పై బమూల్ సిసిఐకి ఫిర్యాదులు

**బెంగళూరు, మార్చి 15:** ప్రముఖ ఈకామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ ప్రకటించిన రూపాయికే లీటర్ పాలు ఆఫర్ కర్ణాటకలో పెద్ద దుమారం రేపింది. ఈ చర్య రైతులను తీవ్రంగా దెబ్బ తీస్తుందని ఆరోపిస్తూ బెంగుళూరు మిల్క్ యూనియన్ లిమిటెడ్ (బమూల్) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. జోక్యం చేసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరతామని, కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియాకు (సీసీఐ) ఫిర్యాదు చేస్తామని హెచ్చరించింది. బమూల్ అధ్యక్షుడు డీకే సురేశ్ మీడియాతో మాట్లాడుతూ మార్కెట్‌ను చేజిక్కించుకునేందుకు ఫ్లిప్‌కార్ట్ ఇలాంటి అనైతిక పోటీకి తెరలేపిందన్నారు. డబ్బు సంపాదించాలనే ఆత్రుతతో ఫ్లిప్‌కార్ట్ లీటర్ పాలను రూపాయికే అమ్ముతోంది. ఇది రైతాంగాన్ని నాశనం చేసే చర్య. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించాలి. లేదంటే దేశవ్యాప్తంగా ఆందోళనలు తప్పవని ఆయన హెచ్చరించారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి ఉన్న సహకార పాల యూనియన్లను బలహీనపరిచే కుట్ర ఇది అని ఆరోపించారు. ఈ పథకం కోసం ఫ్లిప్‌కార్ట్ సుమారు రూ. 2వేల కోట్లు ఖర్చు చేసిందని, ఇప్పటికే 14.5 లక్షల లీటర్ల పాలను విక్రయించిందని సురేశ్ తెలిపారు. ఈ ఆఫర్ కారణంగా తమ యూనియన్ పాల అమ్మకాలు రోజుకు 40 వేల నుంచి 50 వేల లీటర్ల వరకు పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు లీటర్‌కు రూ. 38 నుంచి రూ. 40 చెల్లిస్తుంటే, రూపాయికే ఎలా అమ్ముతారని ఆయన ప్రశ్నించారు. ఫ్లిప్‌కార్ట్ ఎక్కడి నుంచి పాలను సేకరిస్తోందో తెలి యదని, పాల నాణ్యతను పరీక్షించేందుకు శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపుతామని తెలిపారు. రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే ఈ చర్యను ఫ్లిప్‌కార్ట్ వెంటనే వెనక్కి తీసుకోవాల్సిందేనని ఆయన డిమాండ్‌చేసారు.







# టాప్ పది కంపెనీల్లో రూ.4.48 లక్షల కోట్లు పతనం

**ముంబయి, మార్చి 15:** స్టాక్ మార్కెట్లలో చోటుచేసుకున్న గతవారం భారీ పతనం దేశంలోని అగ్రశ్రేణి కంపెనీలను తీవ్రంగా నష్టపరిచింది. ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అత్యధికంగా నష్టపోయింది. ఒక్కవారంలోనే ఎస్ బీఐ మార్కెట్ క్యాపిటలైజేషన్ (ఎంక్యాప్) రూ. 89,306.22 కోట్లు తగ్గి రూ.9,66,261.05 కోట్లకు పడిపోయింది. మొత్తంగా దేశంలోని టాప్10 కంపెనీలు కలిపి రూ.4.48 లక్షల కోట్ల సంపదను కోల్పోయాయి. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణంపై ఆందోళనలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీంతో అన్ని రంగాల్లో అమ్మకాల వెల్లువ కొనసాగింది. ఈ వారంలో బీఎస్ఈ సెన్సెక్స్ 4,354 పాయింట్లు, నిఫ్టీ 1,299 పాయింట్లు నష్టపో యాయి. ఎస్‌బీఐ తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ భారీగా నష్టపోయింది.ఈబ్యాంక్ మార్కెట్ విలువ రూ. 61,715కోట్లు తగ్గి రూ. 12,57,391 కోట్లకు చేరింది.బజాజ్ ఫైనాన్స్ రూ.59,082 కోట్లు, టీసీఎస్ రూ.53,312 కోట్లు, ఐసీఐసీఐ బ్యాంక్ రూ.42,205 కోట్ల చొప్పున తమ మార్కెట్ విలువను కోల్పో యాయి. భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎల్ఐసీ, ఇన్ఫోసిస్, హిందుస్థాన్ యూనిలీవర్ వంటి కంపెనీలు కూడా వేల కోట్ల రూపాయల నష్టాలను చవిచూశాయి. రూ. 33,289 కోట్ల నష్టం ఎదురైనప్పటికీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ దేశంలోనే అత్యంత విలువైన కంపెనీగా తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది.

### ఎయిరిండియాలో ఉద్యోగుల కుంభకోణం

# నాలుగువేలమంది సిబ్బందిపై వేటు

**న్యూఢిల్లీ, మార్చి 15:** ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా ఉద్యోగుల భారీ కుం భకోణం బయటపడింది. సంస్థ తన ఉద్యో గులకు కల్పించే ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వేలాది మంది సిబ్బంది దుర్వినియోగం చేసినట్లు అంతర్గత విచారణలో తేలింది. ఈ కుంభకోణంలో సుమారు 4వేల మందికి పైగా ఉద్యో గులు భాగస్వాములైనట్లు గుర్తించిన యాజమాన్యం, వారిపై కఠిన చర్యలకు సిద్ధమైనట్లు తెలుస్తుంది. ఎయిర్ ఇండియా పాలసీ ప్రకారం, ప్రతి ఉద్యోగికి ఏడాదికి 14 ఉచిత రిటర్న్ టిక్కెట్లు లభిస్తాయి. వీటిని ఉద్యోగి లేదా వారి కుటుంబసభ్యులు (తల్లిదండ్రులు, భార్యా పిల్లలు) మాత్రమే వాడుకోవాలి. దర్యాప్తులో వెల్లడైన నిజాలు యాజమాన్యాన్ని షాక్‌కు గురి చేశాయి. వేలాది మంది ఉద్యోగులు తమకు ఏమాత్రం సంబంధం లేని వ్యక్తులను బంధువులుగా చూపి ఉచిత టిక్కెట్లు పొందారు. మరికొందరు ఉద్యోగులు ఒకడుగు ముందుకు వేసి, ఉచితంగా పొందిన టిక్కెట్లను బయటి వ్యక్తులకు భారీ ధరలకు అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. మొత్తం 24 వేల మంది సిబ్బందిలో దాదాపు 4,000 మంది ఈ అక్రమాలకు పాల్పడ్డారు. ఈ కుంభకోణంలో చిక్కుకున్న వారిలో మెజారిటీ ఉద్యోగులు ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ తర్వాత, టాటా గ్రూప్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత చేరిన వారే కావడం గమనార్హం. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన టాటా యాజమాన్యం రికవరీ చర్యలు ప్రారంభించింది. మోసపూరితంగా వాడిన టిక్కెట్ల విలువను ఉద్యోగుల జీతాల నుంచి వసూలు చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారీగా జరిమానాలు విధించడమే కాకుండా, వారి ప్రయాణ సౌకర్యాలను రద్దు చేస్తున్నారు. ఇకపై నామినీలను చేర్చుకోవాలంటే చట్టపరమైన ఆధారాలు, రక్త సంబంధ నిరూపణ పత్రాలు సమర్పించడం తప్పనిసరి చేశారు. నష్టాల నుంచి గట్టెక్కి, సంస్థను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలని టాటా గ్రూప్ ప్రయత్నిస్తుంటే, ఉద్యోగులే ఇలాంటి అక్రమాలకు పాల్పడటం సంస్థ ప్రతిష్టను దెబ్బతీస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఇది కేవలం ఆర్థిక నష్టమే కాదని, ఉద్యోగుల నైతికతకు సంబంధించిన సమస్య అని ఎయిర్ ఇండియా వర్గాలు స్పష్టం చేశాయి.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.